thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు


సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 207 కరీంనగర్ శనివారం, 4 అక్టోబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## జాతీయ భద్రత సలహా మండలి సభ్యుడిగా సతీశ్‌రెడ్డి

న్యూఢిల్లీ: జాతీయ భద్రత సలహా మండలి (ఎన్ఎస్ఏబీ) సభ్యుడిగా డీఆర్‌డీవో మాజీ చైర్మన్ ప్రొఫెసర్ జి.సతీశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ భద్రత మండలి సచివాలయం ఉప కార్యదర్శి పుష్పేంద్ర కుమార్ ఉత్తర్వులిచ్చారు. సతీశ్‌రెడ్డి ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారు. 2027 జూన్ 9 వరకు.. లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఆయన ఎన్ఎస్ఏబీ సభ్యుడిగా ఉంటారు. కాగా.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం మహిమలూరు గ్రామానికి చెందిన సతీశ్‌రెడ్డి డీఆర్‌డీవో చైర్మన్‌గా, భారత రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారుగా సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ ఆయనను విమానయానం, రక్షణ రంగాల్లో గౌరవ సలహాదారు(రాష్ట్ర క్యాబినెట్ హోదా)గా ఈ ఏడాది మార్చి 19న నియమించింది. ఆయన భారతదేశ క్షిపణి వ్యవస్థలపై పరిశోధన, అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.



# ఏడాదిలో సగం కూలిన మావో సెంట్రల్ కమిటీ .!


## -7 గురి ఎన్కౌంటర్, ముగ్గురి లొంగుబాటు - స్పీడ్ పెంచిన కేంద్రం -హాట్ టాపిక్ గా మల్లోజుల రాక

చురకలు ప్రత్యేక ప్రతినిధి : అర్ధ శతాబ్దం క్రితం పురుడు పోసుకున్న ఆ నాటి పీపుల్స్ వార్ పార్టీ ఇప్పుడు మావోయిస్ట్ పార్టీ చరిత్ర ఇక విప్లవ వీరుల గురించి మాట్లాడే వారి వద్ద,ఆలాంటి వారు రాసే పుస్తకాల్లో మాత్రమే కనిపించే రోజులు వస్తున్నాయి.ఇది వినడానికి విప్లవ రాజకీయాలు ఇష్ట పడే వారికి విషాదంగా అనిపిస్తాయి.కానీ, అది నిజం జరుగుతున్న పరిణామాలను గమనిస్తే వరుస సంఘటనలు ఎన్కౌంటర్లో మరణిస్తున్న అగ్రనేతలు,మావో సిద్ధాంతకర్తల పై గురి పెట్టి మరీ కగార్ చుట్టి ముట్టి చంపడం లాంటి విషాద ఘటనలు జరుగుతున్నాయి.ఒక నంబల్లా కేశవరావు,చలపతి,శాంతి చర్చల ప్రతిని ధులు సుధాకర్,గణేష్ ఇంకా మాంజా వివేక్,సోరెన్, మోడెం బాలాకృష్ణ తాజాగా కోసా,వికల్ప్ వంటి అతి పెద్ద తలకాయలను కాగర్ నెలకుల్చి ంది.వరుస పరాజయాలు రావడంతో మావోయిస్ట్ టాప్ నాయకత్వం ఏడాది కాలంలో సగం మంది ముఖ్యులను పోగొట్టుకున్నది.మరోవైపు కిషన్జీ సహచరిని సుజాతక్క అలియాస్ పోతుల కల్పన కూడా లొంగు బాటుకు గురయ్యారు.ఆమే కేంద్రకమిటీ సభ్యులు కావడంతో పార్టీ ఇప్పుడు మరో ఇద్దరు సీసీ నేతలు కలిసి బయటకు రావాలని నిర్ణయా నికి వచ్చినట్లు సమాచారం.

**గన్ డౌన్ చేసిన మావో సిద్ధాంత కర్త.!**
**మల్లోజుల వెంట మరో సీసీ మెంబర్ ఆశన్న**


రెండేళ్ల కిందట తలపెట్టిన ఆపరేషన్ కాగర్ తో అనేక ఎదురు దెబ్బలు ఎదుర్కొన్న మావోయిస్టు పార్టీ కొత్త చిక్కుల్లో పడింది.సాయుధపోరాట పార్టీ నుంచి వచ్చిన విరమణ గురించి పెద్ద ఎత్తున ప్రచారం జరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం వెనుక మల్లోజుల వేణుగోపాలరావు పాత్ర ఉందని చెబుతున్నారు. అయితే ఆయన పార్టీ నుంచి బయటకు రావడానికి ముందే సాయుధ పోరాటానికి విరమణ చేయాలని కూడా పత్రికలకు ఇచ్చిన లేఖలో పేర్కొన్నారు.

దీంతో పార్టీ నుంచి రెండు వర్గాల మధ్య విభేదాలు తలెత్తా యి. ఒకరిది సాయుధ పోరాటంలో భాగమేనని మల్లోజుల సాయుధం వద్దు,ప్రజాస్వామిక ఉద్యమంలో భాగస్వాములు కావాలని,పోరాటానికి సిద్ధంగా ఉండాలని మల్లోజుల వేణుగోపాల్ రావు చెప్పారు.నెల రోజుల్లో మావోయిస్టు టాప్ నేతల్లో ఘర్షణ వాతావరణం నెలకొంది.ఈలోగా పార్టీ నేతలు జగన్ మనసు మార్చుకొనిఉన్న అభయ్ అలియాస్ మల్లోజుల కు వ్యతిరేకంగా లేఖ రాశారు.



అది తన పూర్తి వ్యక్తి గతం..పార్టీ విధానం ప్రకారం ఆయన పై అనర్హత వేటుకు కారణం అవుతుంది అని స్పష్టం చేశారు.మరో వైపు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు మరో అభయ్.డికే నుండి వికల్ప్ ద్వారా వచ్చిన ఈ లేఖలో మరింత తీవ్రంగా మందలిస్తూ ప్రెస్ నోట్ విడుదల చేసారు. ఈ నేపద్యంలో ఇక మల్లోజుల వేణుగోపాల్ రావు ఏడాది కాలంలో చేసిన శాంతి చర్చల గురించి వివరించారు.తాను పార్టీ జనరల్ సెక్రటరీ హోదాలో ఉన్న నంబాల కేశవరావు సూచన మేరకే రూపేష్ ఇంటర్వ్యూ ఇచ్చారని చెప్పారు.కేంద్రం నుండి ఎలాంటి సహకారం అందలేదని నంబల్లా సైతం గుర్తించి సాయుధ పోరాటానికి విరమణకు ఒప్పించాలని ప్రయత్నిస్తున్న సమయంలో ఆయన ఎన్కౌంటర్ అయ్యారని చెప్పారు.ఇది నా అభిప్రాయం కాదని చెప్పారు.తాను సాయుధ పోరాటానికి స్వస్తి పలికినట్టు గా అంగీకరిస్తూ తుపాకులు దించి మారిన పరిస్థితులు సాధారణంగా అంచనా వేసి ఉద్యమా లను నడిపెందుకు వచ్చిన మల్లోజుల ప్రభుత్వానికి లొంగిపోయినట్లు సమాచారం అందింది.ఐతే సరెండర్ అయిన మల్లోజుల సహా ఆశన్న అలియాస్ తక్కళ్లపల్లి వాసుదేవ రావు ఏమీ ఆశించకుండా మళ్లీ ప్రజా స్వామిక ఉద్యమాలు చేస్తారా చూడాలి

**పోలీస్ గూటికి చేరారా.?! ఆయన వెంట ఎవరెవరు ఉంటారు??...** గన్స్ డౌన్ చేసిన తర్వాత ఇద్దరు ముఖ్య నేతలు అభయ్,రూపేష్ లు హైదరాబాద్ చేరుకున్నారు.వేరే కాకుండా పడకల్ స్వామి ఆయన కొడుకు,కూతురు..జార?ండ్ నుండి,పశ్చిమ బెంగాల్ నుండి ఇలా 50 మంది నక్సల్స్ వస్తున్నారని అంటున్నారు.ఈ ప్రచారం అంతా మీడియా ద్వారా జరిగింది. అయితే ఈ ఇద్దరిపై మాత్రం కొద్ది రోజులుగా సోషల్ మీడియా లో వార్తలు వినిపిస్తున్నాయి.మునుపటి కంటే ఎక్కువగా సోషల్ మీడియాలో మల్లోజుల,తక్కల్లా పల్లి లు వచ్చారంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి.ఒకటి రెండు రోజుల్లో డీజీపీ కార్యాలయంలో ఓ కార్యక్రమంలో వీరి పేర్లు ప్రకటించి లొంగుబాటు వెల్లడించే అవకాశం ఉంది.



# బీజేపీ పాచికలు

## విజయ్‌కు రాజకీయ గండం !

తమిళనాడు రాజకీయాల్లో కరూర్ తొక్కిసలాట ఘటన సమూల మార్పులు తీసుకు వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఈ ఘటనలో తన తప్పిదం లేదని చెప్పుకునేందుకు విజయ్ రొటీన్ రాజకీయాలు ప్రారంభించారు. ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారు. ప్రభుత్వమే కుట్ర చేస్తోందంటున్నారు.

ఇదంతా రాజకీయం. కానీ విచారణలో తేలే విషయాలు కీలకం. డీఎంకే ప్రభుత్వం కాబట్టి నింద తనపైనే వేస్తారని విజయం నిర్ణయానికి వచ్చారు. అందుకే స్వతంత్ర దర్యాప్తు లేదా సీబీఐ అని పిటిషన్ వేశారు. ఈ రాజకీయంలో బీజేపీ రాజకీయం ప్రారంభించింది.

**విజయ్‌కు మద్దతుగా అన్నామలై!!...** తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు.. అన్నామలై విజయ్ కు మద్దతు ప్రకటించారు. తొక్కిసలాటలో విజయ్ తప్పిదమేమీ లేదని అంతా ప్రభుత్వమే చేసిందని ఆరోపిణలు చేస్తున్నారు. డీఎంకే ప్రభుత్వం నిజాలు బయటకు రావాలని కేసును సీబీఐకి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మద్దతు విజయ్ కు ఊరటనిస్తుందా లేకపోతే సమస్యలు తెలుస్తుందా అన్న సంగతి పక్కన పెడితే.. విజయ్ పై బీజేపీ ట్రాప్ వేసిందని స్పష్టమవుతోంది. విజయ్ ఇప్పుడు బీజేపీ మద్దతును కాదనలేరు. ఎందుకంటే సీబీఐ దర్యాప్తు కావాలని విజయ్ పార్టీ స్వయంగా హైకోర్టును ఆశ్రయించింది.

**విజయను కూటమిలోకి లాగడమే బీజేపీ ఎజెండా....** విజయ్ ఎవరితోనూ పొత్తులు పెట్టుకోనని చెబుతున్నారు. బీజేపీ సిద్ధాంతపరమైన శత్రువు అని పొత్తులు పెట్టుకునే చాన్సే లేదని చెబుతున్నారు. ఇక డీఎంకేతో ఉంది కాబట్టి కాంగ్రెస్ తో పొత్తులు పెట్టుకోలేరు.

అందుకే ఒంటరిగా మిగిలారు. కానీ బీజేపీ మాత్రం తన ప్రయత్నాలు తాను చేస్తోంది. అన్నాడీఎంకే, బీజేపీతో కలిసిపోవాలని .. ఎన్డీఏ కూటమిలోకి రావాలని బీజేపీ కోరుకుంటోంది.అలా అయితే తమిళనాడులో డీఎంకేకు చెక్ పెట్టవచ్చని అనుకుంటున్నారు. ఆ ప్రయత్నాలకు సరైన దారి.. ఇప్పుడు కరూర్ ఘటనతో వచ్చినట్లుగా బీజేపీకి స్పష్టత ఉంది. అందుకే సరైన ట్రాప్ వేసిందని అనుకోవచ్చు.

**విజయ్‌కు అసలైన పరీక్ష...** ఇప్పుడు విజయ్ కు అసలైన పరీక్ష ఉంది. రాజకీయంగా ఆయన సంక్షోభ సమయాల్లో ఎలా వ్యవహరించాలో ఇంకా తెలుసుకోలేదని..కరూర్ నుంచి ఆయన వెళ్లిపోయిన వైనమే అందరికీ స్పష్టతనిచ్చింది. ఇప్పుడు ఈ సంక్షోభాన్ని ఆయన అధిగమించాల్సి ఉంది. ఓ వైపు డీఎంకే.. మరో వైపు బీజేపీ కాచుకుని కూర్చున్నాయి. ఎటువైపు మొగ్గినా ఆయన పరిస్థితి దుర్భరం అవుతుంది. ఈ రాజకీయాన్ని ఆయన ఎదుర్కొంటే.. ప్రత్యామ్నాయంగా నిలబడేందుకు ధైర్యం వస్తుంది.



# కేసీఆర్‌కు బిగ్‌షాక్..

## బీఆర్ఎస్‌ను వీడనున్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య!

వరంగల్ : బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగలనున్నట్లు వార్తలు వస్తున్నాయి. వరంగల్ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య కారు పార్టీని వీడుతున్నారని సమాచారం. కాంగ్రెస్ పార్టీలో చేరుతారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్లో చేరేముందు ఆయన కాంగ్రెస్ పార్టీలో పెద్ద నాయకుడు. కాంగ్రెస్ పార్టీ పీసీసీగా కూడా పని చేశారు. పొన్నాల లక్ష్మయ్య కాంగ్రెస్లోకి తిరిగి రావాలంటూ సోషల్ మీడియాలో పొన్నాల అభిమానుల పోస్టులు పెడుతున్నారు. 2023అసెంబ్లీ ఎన్నికల ముందు పొన్నాల బీఆర్ఎస్లో చేరారు.ు కొంతకాలంగా బీఆర్ఎస్ కార్యక్రమాలకు పొన్నాల లక్ష్మయ్య దూరంగా ఉంటున్నారు. ఆయన సొంతగూడు కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో పొన్నాల చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

# అలయ్ బలయ్ సంప్రదాయం కాదు..

# తెలంగాణ ఆత్మ!

## హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ




## బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా అలాయ్ బలాయ్!

హైదరాబాద్, అక్టోబర్ 03: నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అలయ్ బలయ్ కార్యక్రమం ఇవాళ (శుక్రవారం) ఉదయం ప్రారంభమైంది. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ కట్టర్, కిషన్ రెడ్డి, అర్జున్ రామ్ మేఘ్వాల్, జయంతి చౌదరి, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ, బీజేపీ ఎంపీ లక్ష్మణ్, బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, సీపీఐ నేత నారాయణ, ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎంపీ వి.హనుమంతావు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, టాలీవుడు ప్రముఖ నటులు నాగార్జున, బ్రహ్మానందం తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయ నాయకుల మధ్య ఐక్యత కోసం బండారు దత్తాత్రేయ ఈ కార్యక్రమాన్ని చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రతి ఏటా దసరా మరునాడు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తెలంగాణ సంస్కృతి, ఆహారపు అలవాట్లను చాటిచెప్పేలా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. అయితే ఈసారి మాత్రం ఆపరేషన్ సిందూర్ థీమ్‌తో ఈ కార్యక్రమం జరుగుతోంది.

**తెలంగాణ ఆత్మ..** అలయ్ బలయ్ ఒక సంప్రదాయం మాత్రమే కాదని.. తెలంగాణ ఆత్మని ఈ కార్యక్రమం నిర్వాహకులు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అభివర్ణించారు. స్వదేశీ భావనతో ముందుకు వెళ్లాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

సేంద్రీయ వ్యవసాయం వైపు అడుగులు వేయాలంటూ రైతులకు ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ చరిత్రలో ప్రతీ మార్పులో యువత కీలకపాత్ర పోషించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు బండారు దత్తాత్రేయ సూచించారు.

**పరిపాలన సౌలభ్యం కోసమే..** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. పరిపాలన సౌలభ్యం కోసమే రాష్ట్రాల విభజన జరిగినట్లు పేర్కొన్నారు. ప్రాంతాలకు అతీతంగా కలిసికట్టుగా ఉండాలంటూ తెలుగు రాష్ట్రాల ప్రజలకు పిలుపు నిచ్చారు. యువత సనాతన ధర్మం వైపు చూస్తుంద న్నారు. మనకు దసరాతోపాటు జీఎస్టీ పండగ వచ్చిందని తెలిపారు. పెరిగిన ధరలు తగ్గించి ప్రధాని మోదీ రికార్డు సృష్టించారని చెప్పారు. దసరా రోజు అందరి నుంచి ఆశీర్వాదం తీసుకోవడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. అయితే బయట రాజకీయ నేతలు చాలెంజ్‌లు విసురుకుంటారు.. కానీ పండగ పూట ఒకే వేదికపైకి తీసుకు వచ్చి కలుసుకునే విధంగా ఏర్పాటు చేసిన కార్యక్రమమే అలయ్ బలయ్ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వివరించారు.




దిల్లీ: సోదరభావాన్ని పెంపొందించే వేడుక 'అలయ్ బలయ్' అని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము అన్నారు. హైదరాబాద్‌లో నేడు ఈ పండుగ ఎంతో ఉత్సాహంగా నిర్వహించనున్నారని తెలిసి సంతోషించానని పేర్కొన్నారు. హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఏటా అలయ్ బలయ్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలుపుతూ రాష్ట్రపతి సందేశమిచ్చారు. "తెలంగాణ ఆచారాలను పునరుజ్జీవింపజేయడానికి బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్ పండుగను ప్రారంభించారు. ఇది సోదరభావాన్ని పెంపొందించే వార్షిక సాంస్కృతిక ఉత్సవం. అన్నివర్గాల ప్రజలను ఒక్కచోట చేర్చి తెలంగాణకు చెందిన గొప్ప సంస్కృతిని ప్రదర్శిస్తోంది. ప్రజల్లో ఐక్యత, సమాజ విలువలను వ్యాప్తి చేసేందుకు ఓ సామాజిక సమావేశంగా ఇది ఉపయోగపడుతోంది. అలయ్ బలయ్ వేడుకలు ఘనంగా జరగాలని కోరుకుంటున్నాను" అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

## బండారు దత్తాత్రేయ 'అలయ్ బలయ్'.. హాజరైన పలువురు ప్రముఖులు





హైదరాబాద్: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో 'అలయ్ బలయ్' ప్రారంభమైంది. ఏటా దసరా మర్నాడు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, భాజపా ఎంపీ లక్ష్మణ్, ప్రముఖ సినీనటులు నాగార్జున, బ్రహ్మానందం, ఎమ్మెల్యే సుజనాచౌదరి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, సీపీఐ నేత నారాయణ, తెజస నేత ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ తదితరులు హాజరయ్యారు. దత్తాత్రేయ వారికి కండువాలు వేసి స్వాగతం పలికారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయ నాయకుల మధ్య ఐక్యత కోసం దత్తాత్రేయ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతి, ఆహారపు అలవాట్లను చాటిచెప్పేలా అలయ్ బలయ్ మొదలైంది.

## అందరం కలిసి ఉండాలనేదే 'అలయ్ బలయ్' ఉద్దేశం: వెంకయ్యనాయుడు

హైదరాబాద్: వేషభాషలు వేరయినా అందరం భారతీయులమనే భావనతో కలిసి ముందుకెళ్తున్నామని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులను దత్తాత్రేయ సత్కరించారు. అనంతరం ప్రముఖులు మాట్లాడారు. తొలుత వెంకయ్యనాయుడు మాట్లాడుతూ అందరం కలిసి ఉండాలనేది అలయ్ బలయ్ ఉద్దేశమన్నారు. 20 ఏళ్లుగా బండారు దత్తాత్రేయ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని కొనియాడారు. కొందరు కులం, మతం, వర్ణం, వర్గం, జాతి పేరుతో ప్రజల్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మన దేశంలో అలాంటి ఆశలు పెట్టుకున్నవారు నిరాశ చెందక తప్పదని చెప్పారు.

చిన్నచిన్న విభేదాలు వచ్చినా భారతీయులం అనే భావనతో అందరూ కలిసి వెళ్తుంటారన్నారు. ఈ కార్యక్రమంతో ఐక్యతా సందేశాన్ని అందించడం ముదావహమని పేర్కొంటూ దత్తాత్రేయ, విజయలక్ష్మిలకు వెంకయ్యనాయుడు అభినందనలు తెలిపారు.

**ఇలాంటి కార్యక్రమాలు ఐక్యతకు ఉపయోగడతాయి: జస్టిస్ ఎన్వీ రమణ...** ఇలాంటి కార్యక్రమాలతో మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రజలకు తెలుస్తాయని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. అందర్నీ ఒక్కచోట చేర్చి ఐక్యత తెచ్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. సంప్రదాయాలకు అనుగుణంగా అలయ్ బలయ్ నిర్వహిస్తున్న దత్తాత్రేయ, విజయలక్ష్మిలకు ఆయన అభినందనలు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దత్తాత్రేయ అజాత శత్రువని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను ప్రేమిస్తారని.. అందుకే పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున ఇక్కడికి వచ్చారని చెప్పారు.



**20 ఏళ్లుగా దత్తాత్రేయ దీన్ని నిర్వహిస్తున్నారు: నాగార్జున...** ప్రముఖ సినీనటుడు నాగార్జున మాట్లాడుతూ ఇలాంటి సత్కారం తనకు మొదటి సారి అని.. చాలా కొత్తగా ఉందని చెప్పారు. దత్తాత్రేయకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. 2005 నుంచి ఇప్పటి వరకు 20 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న ఈ కార్యక్రమం తమకెంతో కాన్ఫిడెన్స్ ఇస్తుందన్నారు. దత్తాత్రేయతో తనకు ఎప్పటినుంచో పరిచయం ఉందని.. దీనికి ఆహ్వానించడం ఎంతో ఆనందంగా ఉందని నాగార్జున చెప్పారు. ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ అలయ్ బలయ్ అంటే హృదయపూర్వకంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ప్రేమను పంచుకోవడమని చెప్పారు. శాంతి, ప్రేమ కరవైపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి పరస్పరం గౌరవించుకోవడం అవసరమన్నారు.

## డ్రగ్స్‌పై తెలంగాణ పోలీసుల ఉక్కుపాదం.. ఏం చేశారంటే..

హైదరాబాద్, అక్టోబరు 3 : డ్రగ్స్‌పై తెలంగాణ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రధానంగా హైదరాబాద్‌లో డ్రగ్స్ గ్యాంగుల ఆటకట్టిస్తున్నారు పోలీసులు. నైజీరియా నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి హైదరాబాద్‌లో సప్లై చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నిరోజుల క్రితం గ్రీండర్ అనే గే డేటింగ్ యాప్ ద్వారా నైజీరియాకు చెందిన వ్యక్తి జియోఫ్రీ.. హైదరాబాద్‌లో డ్రగ్స్ సప్లై చేశాడు. అయితే, ఆ వ్యక్తి కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. భాగ్యనగరానికి డ్రగ్స్ ఎక్కడి నుంచి తీసుకువస్తున్నాడు.. ఎవరెవరికి ఇస్తున్నాడనే సమాచారాన్ని తెలుసుకున్నారు. ఇందుకోసం ప్రత్యేక పోలీసు టీమ్ ను ఏర్పాటు చేశారు ఉన్నతాధికారులు. అనంతరం నిందితుడిని పట్టుకుని ఆట కట్టించారు హైదరాబాద్ పోలీసులు. అయితే, సదరు వ్యక్తి 2019లో ఫేక్ పాస్‌పోర్ట్‌తో ఐవరీ కోస్ట్ నుంచి నేపాల్‌లోకి ప్రవేశించాడు. అక్కడి నుంచి ఇండియాకు వచ్చాడు. ఢిల్లీ నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి హైదరాబాద్, బెంగుళూరులో సప్లై చేస్తున్నాడు సదరు నైజీరియన్. ఈ క్రమంలో ఆ వ్యక్తిని పట్టుకున్న పోలీసులు హైదరాబాద్ నుంచి తన సొంత దేశమైనా నైజీరియాకు పంపించారు. డ్రగ్స్ అమ్మినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ జోలికెళ్లి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హైదరాబాద్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.




## ఏడుపాయలలో వరద ఉద్ధృతి.. రాజగోపురంలో వనదుర్గామాతకు పూజలు

**పాపన్నపేట: మెదక్ జిల్లా ఏడుపాయలలో మంజీరా నది ఉద్ధృతి కొనసాగుతోంది. దీంతో వన దుర్గామాత ఆలయాన్ని ఆనుకుని భారీగా వరదనీరు ప్రవహిస్తోంది. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి నిత్య పూజలు చేస్తున్నారు. వనదుర్గ ఆనకట్ట నుంచి 1.09లక్షల క్యూసెక్కుల వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.**



## లిక్కర్ షాపులకు దసరా కిక్కు.. భారీగా పెరిగిన మద్యం విక్రయాలు

హైదరాబాద్: తెలంగాణలో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. ఈ ఏడాది సెప్టెంబరులోనే రూ.3,046 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు 29న రూ.278 కోట్లు, 30న రూ.333 కోట్లు, అక్టోబర్ 1న రూ.86.23 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ 3 రోజుల్లోనే 60 నుంచి 80శాతం వరకు అమ్మకాలు పెరిగాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు.. రాష్ట్ర వ్యాప్తంగా 29.92 లక్షల కేసుల లిక్కర్, 36.46 లక్షల కేసుల బీర్లు విక్రయించారు. గతేడాదితో పోలిస్తే 7శాతానికిపైగా మద్యం విక్రయాలు పెరిగాయి. మద్యం సేల్స్ పెరగడంతో ఎక్సైజ్ శాఖకు రాబడి పెరిగింది.

## హైదరాబాద్‌లోని రక్షణశాఖ భూములు రాష్ట్రానికి ఇవ్వండి.. రాజ్‌నాథ్‌ను కోరిన మంత్రి పొన్నం



హైదరాబాద్: నగరంలోని రక్షణశాఖ భూములను రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉపయోగించేందుకు అనుమతివ్వాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్.. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని హైదరాబాద్‌లో రాజ్‌నాథ్‌సింగ్‌కు మంత్రి పొన్నం అందజేశారు. వినతి పత్రాన్ని పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటారని పొన్నం ఆశాభావం వ్యక్తం చేశారు. జంట నగరాల్లో ప్రజలకు కీలకమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో రక్షణ శాఖ భూములు ఎంతో ఉపయోగపడతాయని, కంటోన్మెంట్ నుంచి తెలంగాణ ప్రభుత్వానికి యూజర్ ఛార్జీల కింద వచ్చే దాదాపు రూ.వెయ్యి కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని రక్షణమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆ బకాయిలను సకాలంలో విడుదల చేయడం వల్ల రక్షణ శాఖ పరిధిలో అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం, అవసరమైన పౌర సేవలు కొనసాగించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు లభిస్తుందని పొన్నం వివరించారు. ప్రజా వినియోగం కోసం కొన్ని రక్షణ భూములను ఇవ్వడానికి అంగీకరించినందుకు భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్న మంత్రి పొన్నం.. ఈ భూములను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాజ్‌నాథ్ సింగ్‌కు అందించిన వినతి పత్రంలో పొన్నం అభ్యర్థించారు.

## తెలంగాణకు భారీ వర్ష సూచన.. అన్ని జిల్లాలకు అలర్ట్

హైదరాబాద్: ఉత్తర వాయువ్య దిశలో కదిలే వాయుగుండం ఇవాళ(శుక్రవారం) దక్షిణ ఒడిస్సా, ఉత్తర ఆంధ్రకోస్తా తీరాన్ని దాటింది. దీని ప్రభావం తెలంగాణ రాష్ట్రంపై పడనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. అక్కడక్కడ తేలికపాటి ఉరుములు, మెరుపులతో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని చెప్పింది. సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్, జనగామ, వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, జగిత్యాల, హైదరాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతాయని వెల్లడించింది. మరోవైపు ఏపీలో వర్షాలు దంచికొడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇవాళ(శుక్రవారం) ఉత్తర కోస్తాకు ఆనుకొని ఉన్న గోపాల్‌పూర్ సమీపంలో వాయుగుండం తీరం దాటినట్లు విశాఖ వాతావరణ శాఖ తెలిపింది. క్రమంగా ఉత్తర వాయువ్య దిశగా పయనిస్తూ.. బలహీనపడుతోందని పేర్కొంది. ఈ మేరకు ప్రస్తుతం ఉత్తరకోస్తా




జిల్లాల్లో.. వర్షం తగ్గుముఖం పట్టినట్లు సమాచారం. అయితే.. రేపు(శనివారం) పలుచోట్ల చెదురుమదురుగా వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు చెప్పింది. ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు పడే ఛాన్స్ ఉన్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.




**శాంతి నశిస్తున్న కాలంలో.. బ్రహ్మానందం... అలయ్ బలయ్.. ఆలింగనం చేసుకునే కార్యక్రమమని ప్రముఖ నటుడు బ్రహ్మానందం పేర్కొన్నారు. హనుమంతుడిని శ్రీరామచంద్రుడు ఆలింగనం చేసుకున్నారని ఆయన గుర్తు చేశారు. ఆనాటి నుంచి అలయ్ బలయ్ ఉందని వివరించారు. శాంతి నశిస్తున్న కాలంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమంటూ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయపై ఆయన ప్రశంసలు కురిపించారు.**

**నమ్మకం కుదిరింది: నాగార్జున... ఈ కార్యక్రమంలో సత్కారం చేయడం తనకు కొత్తగా అనిపించిందని హీరో నాగార్జున అన్నారు. పార్టీలకు అతీతంగా రాజకీయ నేతలంతా ఒకే వేదికపైకి రావడం తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని చెప్పారు. ఏదైనా ఇష్యూ వస్తే.. సపోర్టుగా నిలబడతారనే నమ్మకం తమకు కుదిరిందని ఆయన స్పష్టం చేశారు.**

చురకలు



# సినిమా పుస్తకంలో అరుదైన సంతకం ఏడిద - అక్టోబర్ 4...ఏడిద నాగేశ్వరరావు వర్ధంతి




ఏడిద నాగేశ్వరరావు (ఏప్రిల్ 24, 1934 – అక్టోబరు 4, 2015) ప్రముఖ తెలుగు సినిమా నిర్మాతలలో ఒకరు. సమున్నత ఆశయాలతో అరుదైన చిత్ర నిర్మాణాలను చేసి తెలుగు చిత్ర సీమలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించి, ప్రత్యేక గుర్తింపు పొందారు. సినీ పుస్తకంలో ఒక చెరగని సంతకంగా మిగిలి పోయారు. ఆయన నిర్మించిన సినిమాలు తక్కువే... అయితేనేం అన్నీ ఆణి ముత్యాలే. చిరకాలం ప్రజల హృదయాలలో నిలిచి పోయేవే. ఆయన నిర్మించిన చిత్రాల్ని జాతీయ స్థాయిలో పురస్కారాలు అందుకోవడం విశేషం. సుమారు 30 సినిమాల్లో నటించారు. వంద చిత్రాలకి పైగా డబ్బింగ్? చెప్పారు. పాఠశాల జీవితంలో ముఖానికి రంగు పులుముకుని, అమ్మాయి వేషంలో నట జీవితం ప్రారంభించి, తర్వాతి కాలంలో సినీరంగం లోకి అడుగుపెట్టి, నటుడిగా, డబ్బింగ్ కళాకారుడిగా, నిర్మాతగా ఎదిగిన క్రమం ఆయన అసమాన కృషికి నిదర్శనంగా నిలుస్తోంది. ఆయన తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి కార్యదర్శిగా సేవలందించారు. నంది పురస్కారాల కమిటీ అధ్యక్షుడిగా, జాతీయ పురస్కారాల కమిటీలో సభ్యుడిగా పని చేశారు. పూర్ణోదయ మూవీ క్రియేషన్స్ అనే సంస్థ ద్వారా కొన్ని గొప్ప ఆశయాలతో, ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయే తెలుగు సినిమాలను నిర్మించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర, భారత ప్రభుత్వాల నుండి ఎన్నో అవార్డులను గెలుచుకున్నారు. ఏడిద నాగేశ్వరరావు తూర్పు గోదావరి జిల్లా, కొత్తపేటలో సత్తిరాజు నాయుడు, పాపలక్ష్మి దంపతులకు 1934, ఏప్రిల్ 24 న జన్మించారు. కాకినాడ మెటలారిన్ హైస్కూల్లో ఫిఫ్త్ ఫారమ్ చదువుతుండగా స్కూల్ వార్షికోత్సవంలో లేడీ నాటకంలో తొలిసారిగా ఏడిద అమ్మాయి వేషం వేశారు. దానికి సిల్వర్ మెడల్‌ను కూడా అందు కున్నారు. ఆ నటనకు రజత పతకం సాధించిన ఉత్సాహంతో 'విశ్వభారతి, 'పరివర్తన', 'ఓటు నీకేనంటి నాటకాల్లో నటించి మరిన్ని బహుమతులు పొందారు. ఆ తర్వాత విజయ నగరంలో ఇంటర్మీడియట్ చదువుతుండగా 'కవిరాజు మెమోరియల్ క్లబ్‌లో కొన్ని నాటకాలు వేశారు. పిఠాపురం రాజాస్ కాలేజీలో బి.ఎ. ఎనామెక్స్‌లో చేరిన నాగేశ్వర రావుకు అక్కడే దర్శకనిర్మాత బి.వి.రాజేంద్ర ప్రసాద్ పరిచయ మయ్యారు. వి.బి.రాజేంద్ర ప్రసాద్, నటులు హరనాథ్, మాడా, కె.కె. శర్మ, వద్దాది సూర్యనారాయణ మూర్తిలతో కలిసి కళాపూర్ణ రాఘవ కళా సమితి నాటక సంస్థను ప్రారంభించి ఇన్‌స్పెక్టర్ జనరల్ వంటి పలు నాటకాలు ప్రదర్శించి నటించారు. 26 ఏళ్ళ వయసులో నాగేశ్వరరావు 'కప్పలు' నాటకంలో వృద్ధ పాత్ర పోషించి మెప్పించి నందుకు గానూ ఆయనకు పరిషత్ పోటీలలో బెస్ట్ యాక్టర్ అవార్డు వచ్చింది. తన స్నేహితుడు, నిర్మాత వి.బి.రాజేంద్రప్రసాద్? నుంచి 'అన్నపూర్ణ'లో నటించాలని పిలుపు రావడంతో మద్రాస్? వెళ్లారు. కాని, ఆ వేషం దక్కలేదు. డబ్బింగ్? కళాకారుడిగా ప్రయత్నాలు ప్రారంభించారు. 'పార్వతీ కళ్యాణం' లోని శివుడి పాత్రకి డబ్బింగ్? చెప్పి తొలి సంపాదనగా రూ.500 పొందారు. ఆ తర్వాత నటుడిగా కూడా అవకాశాలు సొంతం చేసుకొన్నారు. నిర్మాత కాక ముందు ఆయన నటుడిగా సినీ ప్రస్థానాన్ని ఆరంభించారు. రణభేరి, నేరము శిక్ష, బంగారు బాబు, మానవుడు దానవుడు, చిన్ననాటి స్నేహితులు తదితర చిత్రాల్లో నటించారు. 1962 నుంచి 1974 మధ్య కాలంలో సుమారు 30 సినిమాల్లో నటించారు. వంద చిత్రాలకి పైగా డబ్బింగ్? చెప్పారు. ఆ తర్వాత కాకినాడకి చెందిన భాస్కరరెడ్డి, రామకృష్ణారెడ్డి, లచ్చిరెడ్డి, వీర్రాజులతో కలిసి 'వెంకటేశ్వర కల్యాణం'అనే చిత్రాన్ని తెలుగులోకి అనువదించారు.

ఆ సినిమాకి లాభాలు రావడంతో ఆ నలుగురూ కలిసి గీతాకృష్ణ కంబైన్స్ అనే సంస్థను ప్రారంభించి నిర్మాణ సారథ్య బాధ్యతలను ఏడిద నాగేశ్వరరావుకే అప్పగించారు. 'నేరము శిక్ష'లో నటించడంతో ఆ చిత్ర దర్శకుడు కె. విశ్వనాథ్ తో పరిచయం ఏర్పడింది. ఆయనతో సిరి సిరి మువ్వ సినిమాను నిర్మించారు. అది విజయం సాధించింది. తర్వాత తన బంధువులతో కలిసి పూర్ణోదయ మూవీ క్రియేషన్స్ స్థాపించారు. తొలి ప్రయత్నంగా కొమ్మినేని శేషగిరిరావు దర్శకత్వంలో తాయారమ్మ బంగారయ్యను నిర్మించారు. అందులో చిరంజీవి ప్రతినాయక ఛాయలున్న ఓ చిన్న పాత్రని పోషించారు. ఆ సినిమా విజయం సాధించడంతో పాటు తమిళం, హిందీ భాషల్లోనూ రీమేక్? అయ్యింది. నిర్మాణ సారథిగా ఒక విజయాన్ని, నిర్మాతగా మరో విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. మూడో సినిమా కోసం మళ్లీ కె.విశ్వనాథ్?ని సంప్రదించి శంకరాభరణం నిర్మించారు. ఇక ఆ చిత్రం తర్వాత వెనుదిరిగి చూసుకొనే అవకాశం రాలేదు. సీతాకోక చిలుక, స్వాతిముత్యం, సితార చిత్రాలకి వివిధ విభాగాల్లో జాతీయ పురస్కారాలు లభించాయి. 'స్వాతిముత్యం' తెలుగు నుంచి ఆస్కార్? నామినేషన్లకు ఎంపికైంది. చాలా సినిమాలకు వివిధ విభాగాల్లో నంది పురస్కారాలు వరించాయి. చివరిగా 'ఆపద్బాంధవుడు' చిత్రాన్ని నిర్మించారు ఏడిద నాగేశ్వరరావు. 2013, ఏప్రిల్ 11 న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉగాది పురస్కారం అందుకున్నారు. కళా సాగర్ వారు దశాబ్దపు ఉత్తమ నిర్మాతగా అవార్డునిచ్చి సత్కరించారు. సంగం అకాడమీ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్, సంతోషం%-% లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు నిచ్చి గౌరవించారు. ఏడిద నిర్మించిన 9 సినిమాల్లో అత్యధిక చిత్రాలు కె.విశ్వనాథ్ దర్శకత్వంలో తెరకెక్కడం విశేషం. పలు చిత్రాలు రష్యన్ భాషలో విడుదలయ్యాయి. సింగిల్ సెంటర్లలో 52 రోజుల్లో రూ.11 లక్షల వ్యయంతో 'శంకరాభరణం'ను నిర్మించారు ఏడిద. జాతీయ స్థాయిలో ప్యూర్ హిట్ తెచ్చుకున్న సినిమా. ఈ సినిమాను మలయాళం లోకి డబ్ చేశారు. అయితే పాటలను మాత్రం తెలుగులోనే ఉంచారు. ఎర్నాకులం లోని కవితా థియేటర్లో రెండేళ్ళు ఆడింది. అమెరికాలోనూ విడుదల చేశారు. 20 మంది యూనిట్ సభ్యులు అమెరికాలో 45రోజుల పాటు శంకరాభరణం నైట్స్‌ను నిర్వహించారు. తెలుగు సినిమాకు అమెరికాలో అంతగా బ్రహ్మరథం పట్టడం అదే ప్రథమం. జాతీయ స్థాయిలో స్వర్ణకమలం కూడా సాధించింది. ఈస్ట్ ఫ్రాన్స్‌లో సంగీత ప్రధాన చిత్రాలు మాత్రమే పాల్గొనే బెసాన్‌కాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ సినిమాకు బెస్ట్ ఫిల్మ్ అవార్డు లభించింది. ఈ సినిమాను ఆంధ్రప్రదేశ్ నాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు, తమిళనాడు సీఎం ఎంజీ రామచంద్రన్, శివాజీ గణేషన్, కేరళ నాటి సీఎం తదితరులు వీక్షించి ప్రశంసల వర్షం కురిపించారు. కమర్షియల్ సినిమా హవా నడుస్తోన్న సమయంలో ఈ సినిమా అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించింది. తర్వాత దేశ, విదేశాల్లో ఎన్నో అవార్డులను కొల్లగొట్టింది. ఆ తర్వాత భారతీరాజా దర్శకత్వంలో సీతాకోక చిలుకను నిర్మించారు. అది జాతీయ స్థాయిలో 'ఉత్తమ ప్రాంతీయ చిత్రం'గా రజత పతకాన్ని, రాష్ట్ర స్థాయిలో బంగారు నందిని అందుకుంది. అలీకి ఈ సినిమాకు ఉత్తమ బాలనటుడు అవార్డు లభించింది. ఆ తర్వాత ఆయన తెరకెక్కించిన సినిమా 'సాగర సంగమం'. బెంగళూరులో 575రోజులు ఆడిన రికార్డును సొంతం చేసుకున్న సినిమా అది. నేటివిటీ మార్పులతో తెలుగు, తమిళ్, మలయాళంలో ఒకేసారి విడుదలైన సినిమా ఇది. తమిళంలో 'సలంగై ఒలి' పేరుతోనూ మలయాళంలో 'సాగర సంగమం' అనే పేరుతోనే విడుదలైంది సినిమా. ఇండియన్ పనోరమకు ఎంపికైంది. ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం కు ఉత్తమ గాయకుని గా జాతీయ అవార్డు వచ్చింది. ఆపద్బాంధవుడు (1992), స్వర కల్పన (1989), స్వయం కృషి (1987), సిరి వెన్నెల (1986), స్వాతి ముత్యం (1985), సాగర సంగమం (1983), సితార (1983), సీతాకోక చిలుక (1981), తాయా రమ్మ బంగారయ్య (1979), శంకర భరణం (1979), సిరిసిరి మువ్వ (1978), తదితర చిత్రాలను ఆయన నిర్మించారు. అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదు లోని స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2015 అక్టోబరు 4న, ఆదివారం మూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ప్రజా సేవలో మేటి... రారెవరూ రత్నాకరునికి సాటి - అక్టోబర్ 4...జువ్వాడి రత్నాకర్ రావు జయంతి



ఆరుపదుల రాజకీయ ప్రస్థానంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకుని, 90 కి పైగా వసంతాలను చూసిన, కరీంనగర్ కాంగ్రెస్ దిగ్గజం, రాజకీయ కురువృద్ధుడు, మాజీ అమాత్యులు రత్నాకర్ రావు ప్రజా సేవలో మేటిగా పేరు గడించారు. ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో 1928 అక్టోబర్ 4వ తేదీన జన్మించిన జువ్వాడి రత్నాకర్ రావు, చిరకాలం తిమ్మాపూర్ సర్పంచ్ గా, జగిత్యాల పంచాయితీ సమితి అధ్యక్షులుగా, ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలకవర్గం సభ్యులుగా, ధర్మపురి దేవస్థానం చైర్మన్ గా, ధర్మపురి ప్రాచ్య డిగ్రీ కళాశాల పాలక వర్గ అధ్యక్షులుగా, బుగ్గారం నియోజకవర్గానికి మూడు సార్లు శాసన సభ్యులుగా, పీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఏఐసిసి సభ్యుడిగా, రాష్ట్ర దేవాదాయ స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా పనిచేసి, చేపట్టిన అన్ని పదవులకు వన్నె తెచ్చి, అవిశ్రాంత ప్రజా సేవకునిగా జన హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారు. 1989 జరిగిన ఎన్నికల్లో టిడిపి, కాంగ్రెస్ ను, కాదని బుగ్గారం నియోజకవర్గ ఓటర్లు స్వతంత్ర అభ్యర్థిగా జువ్వాడి రత్నాకర్ రావును గెలిపించి రాష్ట్రంలో సంచలనం సృష్టించారు. 1994లో మినహా యించి రత్నాకర్రావు 1999లో మరియు 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఘన విజయాలు సాధించారు. చివరిసారిగా రాజశేఖర్ రెడ్డి హయాంలో రత్నాకర్ రావు మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

**"జిల్లా రాజకీయాలలో చెరగని ముద్ర"...** అర్ధ శతాబ్దికి పైగా రాజకీయ యవనికపై ప్రత్యేక పాత్రధారిగా నిలిచిన రత్నాకర్ రావు, అవిభక్త కరీంనగర్ జిల్లా రాజకీయాలపై చెరగని ముద్ర వేశారు. కాంగ్రెస్ అధిష్టానంతో సన్నిహిత సంబంధాలు కలిగి, తలపండిన రాజకీయ నేతగా, రాష్ట్ర ముఖ్య మంత్రులకు సన్నిహితంగా ఉంటూ, జిల్లా రాజకీయాల్లో ప్రత్యేక పాత్ర పోషించారు. కరీంనగర్ ఎం.పి లుగా రమాపతిరావు, చొక్కారావు, సత్యనారాయణ రావు తదితరుల ఎన్నికలలో ఈ ప్రాంతం నుండి మెజారిటీ ఓట్లు అందించి, విజయాలకు ఎంతో కృషి జరిపారు. తనకు ముఖ్య అనుచరులైన ఆది శ్రీనివాస్ ను వేములవాడ దేవస్థానం చైర్మన్ గా, కొండూరి రవీందర్రావును జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ గా, తన మద్దతు కోరిన రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ గా పొన్నం ప్రభాకర్ తదితరుల నియామకాలలో, ఎన్నికలలో తెరవెనక ప్రధాన సూత్రధారిగా ఉండి, తన కుమారుడైన నర్సింగారావు ఏఐసిసి డైరెక్టర్ గా ఉన్న స్థితిలో, పలు క్యాంపుల నిర్వహణ బాధ్యతలు తనయుడికి అప్పగించి, ఉమ్మడి జిల్లాలో తన బలాన్ని, బలగాన్ని, రాజకీయ కురువృద్ధ పాత్రలో, తన పట్టును నిరూపించుకో గలిగారు. అలాగే దశాబ్దాల కాలం రాజకీయ రంగంలో తనను వెన్నంటి ఉండి కష్ట సుఖాలలో విడవకుండా ఉన్న సారంగాపూర్ మండలానికి చెందిన వరిష్ఠ నేత కొండ మల్లారెడ్డిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదాధికారిని చేయడంలో రాజకీయం నెరపి, ఇతర శాసన సభ్యుల ఆమోదం ముద్రలతో, విజయం సాధించ గలిగారు. ధర్మపురి మండలం దోనూర్ వాసి న్యాయవాది లక్ష్మణ్ ను జనరల్ స్థానంలో ఎంపీటీసీగా గెలిపించి ధర్మపురి మండల అధ్యక్షుడిగా చేశారు. తనను ఎల్లకాలం వెన్నంటి ఉన్న రాజారం వాసి, ధర్మపురి మండలం సీనియర్ నేత సౌళ్ళ భీమయ్యకు వైస్ ఎంపీపీ, ఎంపీపీ, జెడ్. పి. టి. సి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవులు ఇప్పించి నమ్మిన బంటుకు చేయూత అందించారు. పులి శెట్టి మల్లేశంను మార్కెట్ కమిటీ చైర్మన్ గా, అప్పాల లింగన్న ను ఎస్సారెస్పీ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ గా, అలాగే చిరకాలం విశ్వసనీయునిగా ఉన్న ధర్మపురి వాసి సంగన భట్ల దినేశ్ ను, వర్తక సంఘం నేత అక్కనపెల్లి రాజేందర్ ను ధర్మపురి దేవస్థానం చైర్మన్ లుగా చేశారు. ఇలా ఒక్కటేమిటి, ఎందరికో న్యాయం చేకూర్చారు. తనను విశ్వసించిన, పార్టీకి సేవలందించిన వ్యక్తులకు అవకాశాలను బట్టి వివిధ పదవులను ఇప్పించడంలో సఫలీకృతులయ్యారు.

**"అవినీతికి దూరం... నిజాయితీ బలం"...** సర్పంచ్ నుండి రాష్ట్ర అమాత్య పదవులు పొందడం వెనక అవినీతి రహిత, రత్నాకర్ రావు మచ్చ లేని, నిజాయితీకి ప్రతిరూపమైన, ఆయన వ్యక్తిత్వమే కారణం. పార్టీ టికెట్ రాని నేపథ్యంలో, 1989లో స్వతంత్ర అభ్యర్థిగా జువ్వాడి రత్నాకర్ నామినేషన్ దాఖలు చేయాలని శ్రేయోభిలాషులు పట్టు బట్టిన సమయంలో "ప్రస్తుతం డిపాజిట్ డబ్బులు లేవు కదా" అనడాన్ని బట్టి ఆయన పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. (ఇక్కడ పార్టీ టికెట్ వస్తే పార్టీ ఫండ్ తో పాటు, అభిమానుల చందాలు వస్తాయని భావం). జగిత్యాల పంచాయితీ సమితి అధ్యక్షునిగా పదవీ విరమణ చేసిన సందర్భంలో, కోండ్ర మల్లారెడ్డి నేతృత్వంలో, 90 మందికి పైగా సర్పంచులు స్వచ్ఛందంగా భాగస్వాములై, ఒక కొత్త అంబాసిడర్ కారు కొని, బహూకరించిన వేళ..."నాకు ముందే ఎందుకు చెప్పలేదు. కారు కొనిచ్చినా, రేపటి నుండి పెట్రోల్ ఎలా పోసుకోవాలి, ప్రేమతో ఇస్తున్న కానుకను ఉపయోగించ లేను. విక్రయించనూ లేను" అని బాధను వ్యక్తం చేయడం ద్వారా రత్నాకర్ రావు అపూర్వ, అనితర, స్ఫూర్తి దాయక, ఆదర్శ వ్యక్తిత్వం ద్యోతకమవుతుంది. 2020 మే 10న రత్నాకర్ రావు మృతి చెందారు. తెరాస సీనియర్ నేత, ధర్మపురి శాసన సభ స్థానానికి ప్రాతినిధ్యం వహించిన తాజా మాజీ రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్... ధర్మపురి క్షేత్రంలో స్వంత ఖర్చుతో కాంగ్రెస్ వరిష్ఠ నేత రత్నాకర్ రావు సంబంధిత 7.6మీటర్ల ఎత్తు గల భారీ విగ్రహాన్ని నేషనల్ హైవే పక్కన ఏర్పాటు చేసి, ఆవిష్కరించడం విశేషం. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# హేతువాదానికి హేతువైన నిర్మాత - తమ్మారెడ్డి గోపాలకృష్ణమూర్తి

## సినిమా మాధ్యమాన్ని సమాజం కోసం మలిచిన వ్యక్తి - తమ్మారెడ్డి గోపాలకృష్ణమూర్తి - అక్టోబర్ 4...తమ్మారెడ్డి గోపాలకృష్ణమూర్తి జయంతి



తెలుగు సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసుకున్న నిర్మాతగా, సామాజిక చైతన్యం కలిగిన ఆలోచనాపరుడిగా, వామపక్ష భావజాలానికి ప్రతినిధిగా నిలిచిన అరుదైన వ్యక్తి తమ్మారెడ్డి గోపాల కృష్ణమూర్తి. 1920 అక్టోబరు 4న కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలం చినపాలపర్రులో తమ్మారెడ్డి వెంకటాద్రి, సౌభాగ్యమ్మ దంపతులకు జన్మించిన ఆయన చిన్ననాటి నుంచే సామాజిక అసమానతలు, అన్యాయాలు తనను కలచివేసేవి. స్వాతంత్ర్యోద్యమం, కమ్యూనిస్టు ఉద్యమాలు, ప్రజా సాహిత్యం, అభ్యుదయ భావజాలం ఆయన వ్యక్తిత్వాన్ని మలిచాయి. గోరా ప్రభావంతో మత మౌఢ్యాలపై విమర్శనాత్మక దృక్పథం పెంచుకున్న ఆయన మాలపల్లిలో సహపంక్తి భోజనాలు చేసి సామాజిక సమానత్వానికి బహిరంగ మద్దతు తెలిపాడు. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు పార్టీలో చేరి, స్వతంత్ర భారత్ పత్రిక వ్రాత. ప్రతులను గ్రామాల గుండా సర్క్యులేట్ చేస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించారు. ప్రజానాట్య మండలి కార్యక్రమాలకు సైతం ఆయన విశేష మద్దతు అందించారు. ఆయన జీవనంలో ఒక విశేషం వితంతు వివాహం. ఆ కాలంలో సామాజికంగా వివాదాస్పదంగా భావించిన వితంతు వివాహాన్ని స్వయంగా 1945లో కృష్ణవేణిని వివాహం చేసుకోవడం ద్వారా సమాజానికి కొత్త మార్గాన్ని చూపారు. ఆయనకు ఇద్దరు కుమారులు %-% సినీ నిర్మాత, దర్శకుడిగా పేరు గాంచిన తమ్మారెడ్డి భరద్వాజ్, మరో కుమారుడు లెనిన్ బాబు దర్శకుడిగా నాలుగు చిత్రాలు తెరకెక్కించారు. జీవితాంతం ఎవరికీ భారమవ్వకూడదని భావించిన ఆయన చివరి రోజులు వృద్ధాశ్రమంలో గడిపి, 2013 సెప్టెంబరు 16న హైదరాబాద్‌లో కన్నుమూశారు. సినీరంగంలో ఆయన ప్రవేశం మద్రాసులో సినీ కళాకారుల పిల్లలకు ట్యూషన్ టీచర్‌గా పనిచేసిన కాలం నుంచే ఆరంభమైంది. తరువాత ప్రొడక్షన్ విభాగంలో అడుగుపెట్టి తాతినేని ప్రకాశరావు దర్శకత్వంలో రూపొందిన 'పల్లెటూరు' (1952) తొలి చిత్రం కాగా, 'రోజులు మారాయి' (1955) వంటి చిత్రాల్లోనూ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు. సారథి సంస్థలో చీఫ్ ఎగ్జిక్యూటివ్, జనరల్ మేనేజర్ పదవుల్లో పనిచేస్తూ అనేక చిత్రాల నిర్మాణంలో పాలుపంచు కున్నారు. సారథి స్టూడియో ఏర్పాటుకు ఆయన కీలక పాత్ర పోషించారు. సారథినే తన విశ్వ విద్యాలయంగా భావించిన ఆయన, 'ఏరువాక సాగారో' పాటకు వహీదా రెహమాన్‌ను తెరపైకి తీసుకురావడం ద్వారా తన దూరదృష్టిని ప్రదర్శించారు. 1962లో రవీంద్ర ఆర్ట్ పిక్చర్స్ పేరుతో స్వంత నిర్మాణ సంస్థను స్థాపించిన ఆయన, రెండు దశాబ్దాల కాలంలో లక్షాధికారి (1963), జమీందార్ (1966), బంగారు గాజులు (1968), ధర్మాదాత (1970), సిసింద్రీ చిట్టిబాబు (1971), దత్తపుత్రుడు (1972), డాక్టర్ బాబు (1973), చిన్ననాటి కలలు (1975), అమ్మ నాన్న (1976), లవ్ మ్యారేజ్ (1978), ఇద్దరు కొడుకులు (1982) వంటి పలు ప్రఖ్యాత చిత్రాలను నిర్మించారు. తెలుగు, తమిళ సినీ తారలతో ఆయన చేసిన చిత్రాలు కళాత్మకత, సామాజిక చైతన్యం కలగలిపినవిగా నిలిచాయి. జూబ్లీహిల్స్‌లో ఫిల్మ్‌నగర్ స్థాపనలో ఆయన ముందుండి కృషి చేశారు. నంది అవార్డుల కమిటీలో సభ్యుడిగానూ, ఛైర్మన్‌గానూ వ్యవహరించి, చిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థలోనూ సేవలందించారు. సినిమాను వాణిజ్య ప్రయోజనాలకే పరిమితం చేయకుండా, సమాజ మార్పుకు దోహదపడే సాధనంగా వాడాలని ఆయన విశ్వసించారు. అందుకే ఆయన నిర్మాణాల్లో ప్రజా సమస్యలు, సమానత్వ భావజాలం, వామపక్ష ఆలోచనలు ప్రతిబింబించాయి. మూఢనమ్మకాలు, మతాంధత, కులవివక్షలను ఆయన చిత్రాల ద్వారా, ప్రసంగాల ద్వారా ధిక్కరించారు. కళను ప్రజల ఆయుధంగా మార్చగల సామర్థ్యం ఉందని ఆయన నమ్మకం. అదే విశ్వాసం ఆయన చలనచిత్రాల వైభవంలో ప్రతిఫలించింది. తమ్మారెడ్డి గోపాల కృష్ణమూర్తి కృషికి గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2007లో రఘుపతి వెంకయ్య అవార్డును ప్రదానం చేసింది. బంగారు గాజులు చిత్రానికి నంది అవార్డు, ధర్మాదాత చిత్రానికి ఫిల్మ్‌ఫేర్ అవార్డు లభించాయి. జీవితాంతం ఆయన కొనసాగించిన హేతువాద ధోరణి, వామపక్ష చింతన, ప్రజాస్వామ్య నిబద్ధత ఆయనను ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక వ్యక్తిత్వంగా నిలిపాయి. ఆయన వారసత్వం కేవలం సినిమాల్లోనే కాకుండా తెలుగు సమాజంలోనూ సజీవంగా ఉంది. ఆయన చూపిన విలువలు, ఆయన నిలబెట్టిన హేతువాద%-%వామపక్ష దృక్పథం నేటికీ కొత్త తరాలను ప్రభావితం చేస్తున్నాయి. తమ్మారెడ్డి గోపాల కృష్ణమూర్తి జీవితం కళను ప్రజల కోసం అంకితం చేయవచ్చని, సమాజ మార్పు కోసం సృజనాత్మకతను ఆయుధంగా మలచవచ్చని సాక్షాత్కారంగా నిరూపించింది. ఆయన తెలుగు చలనచిత్ర చరిత్రలోనే కాకుండా ప్రజాస్వామ్య చరిత్రలోనూ చిరస్మరణీయుడు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# "శనీశ్వర పూజతో అంతా శుభమే"

## శివ కేశవులకు ప్రీతి పాత్రం శని త్రయోదశి - శని త్రయోదశి సందర్భంగా

**"నీలాంజన సమాభాసం ! రవిపుత్రం యమాగ్రజంబీ**
**ఛాయా మార్తాండ సంభూతం ! తం నమామి శనైశ్చరమ్" !**

భారతీయుల జ్యోతిషశాస్త్రం ప్రకారం 'శనీశ్వరుడు', నవగ్రహాలలో ఒక గ్రహం. సూర్యుడు, చంద్రుడు, ఛాయా గ్రహాలైన రాహువు, కేతువులతో కలిపి గ్రహాలు తొమ్మిది. గగన మండలంలో ఉన్నగ్రహాలకు భూమితో సంబంధం ఉంది. కాబట్టి తొమ్మిది గ్రహాల ప్రభావం భూమి మీద, భూమిపై ఉన్న ప్రతి చరాచర జీవుల పైన, నిర్జీవ, ఝడ, నిర్లిప్త వస్తువుల మీద వుంటుంది. నవగ్రహాలలో ఒకటైన శని గ్రహం ఇందుకు బిన్నం కాదు. శని, శనిగ్రహం, శనేశ్వరుడు, శనీశ్వరుడు, అని పలు నామములతో పిలువబడి, గ్రహ రూపంలో పూజింపబడే 'శని' ఒక గ్రహదేవుడు. వారంలో ఏడవవారం శనివారం. శనివారానికి అధిపతి శనేశ్వరుడు. శనికి మంద గమనుడు అని కూడా పేరు. శనయే క్రమతి, అనగా అతినెమ్మదిగా కదిలేవాడు అని అర్థం. ఒకసారి సూర్యుని చుట్టి రావడానికి శనికి 30 సంవత్సరాలు పడుతుంది. శానైస్కర్య, అసిత, సప్తర్చి, క్రూరదృష్ట, క్రూర లోచనుడు, పంగు పాదుడు, గృధ్రవాహనుడు మొదలైన పేర్లుకూడా ఉన్నాయి. సంఖ్యలలో 'ఎనిమిది' శనికి ప్రీతికర మయిన సంఖ్య. ఛాయదేవికి పుట్టిన సంతానం శనిదేవుడు. ఆయనకు ఛాయాపుత్రుడు అనే పేరు కూడా ఉంది. జీవుల జాతక చక్రాలపైన తన ప్రభావాన్ని ఎలా చూపబోతున్నాడో అని నిరూపించ డానికి ఆయన జననం సూర్య గ్రహణములో జరిగింది. దేవతల్లో శని దేవుడికి విశిష్టమైన స్థానముంది. జీవులు చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తం కల్పించి, శిక్షించి, ధర్మాన్ని నిలిపే శని భగవానుడు యమధర్మరాజుకు అన్న. యముడు మరణానంతరం దండనలు విధిస్తే, శనిదేవుడు జీవులు బ్రతికి ఉండగానే హింసించి, యాతనలకు గురిచేసి శిక్షిస్తాడు. శనీశ్వరుడు గోచారస్థితి ఫలితంగా ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని, జన్మరాశి నుండి లగ్నశని, మూడు, ఏడు, పదవ స్థానాలపై శనిదేవుని ప్రభావం పడితే అనేక ఇబ్బందులను కలిగిస్తాడు. హిందూ క్యాలెండర్ ప్రకారం వైశాఖ చతుర్దశి అనంతరం వచ్చే అమవాస్య రోజు శని జయంతి జరుపుకుంటారు. వారంలో ఒకరోజు అంటే శనివారం నాడు శనీశ్వరుడు శని గ్రహాన్ని పాలిస్తుంటాడు. సూర్యదేవుని కుమారుడైన శని.. జ్యోతిష శాస్త్రం ప్రకారం మానవుల జీవితంపై తీవ్ర ప్రభావం చూపిస్తాడు. అంతే కాకుండా ఈయన శని గ్రహానికి రాజు. శనీశ్వరుడిని భక్తి శ్రద్ధలతో కొలిచి ఆయన అనుగ్రహం పొందితే కష్టాలు దూరమై.. అదృష్టం కలిసి వస్తుంది. దుష్టశక్తుల నుంచి మనల్ని మనం కాపాడు.కోవడానికి శని దేవున్ని ప్రసన్నం చేసుకోవాలి. అంటే తైలాభిషేకం చేసి శాంతి పూజలు నిర్వహించాలి. బ్రహ్మ వైవర్త పురాణం ప్రకారం, పార్వతీ దేవి, నలుగు పిండి బొమ్మకు ప్రాణం పోసినప్పుడు, వినాయకుడు జన్మించాడు. సకల దేవతలు, నవగ్రహాలు ఆ బాల వినాయకుడిని చూడటానికి వచ్చారు. ఆ ముగ్ధ మోహన బాలుడిని అక్కడకు విచ్చేసిన దేవతలు, మునులు కనులార చూసి, దీవెనలు అందించి, పార్వతీ దేవికి మోదం కలిగించారు. శని భగవానుడు మాత్రం తల ఎత్తి ఆ బాలుని చూడలేదు. అందుకు పార్వతీదేవి కినుక వహించి, తన బిడ్డను చూడమని శనిని ఆదేశించింది. అయినా శని తన దృష్టి, ఆ బాలగణపతి పై సారించలేదు. తన దృష్టి పడితే ఎవరికైనా కష్టాలు తప్పవని ఎంత నచ్చచెప్పినా, మాతృ గర్వంతో శనీశ్వరుడి సదుద్దేశం తెలుసు కోలేక, పార్వతీ దేవి తనకుమారుని చూడమని పదే పదే శనిని ఆదేశించింది. శని తల ఎత్తి చూసిన కారణంగా బాల గణపతి మానవ రూపంలో ఉండే తలను కోల్పోయినాడని పురాణాలు తెలుపు తున్నాయి. శని భగవానుని జన్మ వృత్తాంతం విన్న విక్రమాదిత్యుడు ఆయనను పరిహాస మాడాడట ! ఆ పరిహాసాన్ని విన్న శని కోపగ్రస్తుడై విక్రమాదిత్యుని శపించాడట. శనిని కించపరిచే విధంగా మాటలాడి, అవమానించి నందుకు ఫలితంగా విక్రమాదిత్యుడు అనేక కష్టాలు అనుభవించాడు. రాజ్యాన్ని పోగొట్టుకున్నాడు, చేయని దొంగతనపు నింద మోపబడి, పొరుగు రాజుచే కాళ్ళు, చేతులు నరికివేయ బడ్డాడు. చివరికి, విసిగి వేసారి పోయి, బాధలు ఏమాత్రం భరించే ఓపికలేక, నిర్వీర్యుడై, భ్రష్టుడై, చేసేదిలేక, తనను కనికరింపమని శనిదేవుని అత్యంత శ్రద్ధతో, ఆర్తితో, భక్తితో ప్రార్థించగా, విక్రమాదిత్యుని భక్తికి సంతృప్తి చెందిన శనీశ్వరుడు తిరిగి అతని పూర్వ వైభవం ప్రాప్తింప



చేసాడు. హనుమంతుడు శని దేవుడి లోని ఓంకారాన్ని నాశనం చేసినప్పుడు ఆయన శరీరంపై మచ్చలు గాయాలు అయినాయి. ఆ నొప్పి పోయి, సున్నితంగా తయారవ డానికి, హనుమంతుడు ఇచ్చిన నూనె సాయపడింది. శని దశ దుష్ప్రభావాలతో బాధపడేవారు, భక్తితో శని దేవునికి నూనె సమర్పిస్తే చెడు ఫలితాలు పోతాయని విశ్వాసం. నువ్వుల నూనెతో శనికి అభిషేకం చేయడం, శనిత్రయోదశి రోజున ఉపవాసం ఉండడం, రావిచెట్టుకి ప్రదక్షిణాలు చేసి ఆవనూనె తో దీపం పెట్టడం, నువ్వుల నూనెలో ముఖం చూసుకొని ఆ నూనెను దానం చేయడం. శని దేవతను ప్రతిబింబించే నల్ల వస్తువులను... నల్ల ధాన్యాలు, నల్ల మినపప్పు, నల్ల నూనెలు, నల్ల ఆవులు, నల్ల బట్టలు, నల్లని గొడుగు మొదలైనవి దానం చేస్తే చెడు ప్రభావాలు తొలగి పోతాయి. తాంత్రిక విద్యల ప్రభావం నుంచి రక్షణ కోసం హోమం లేదా యజ్ఞాన్ని జరిపించాలి. చీమలకు బెల్లాన్ని ఆహారంగా ఇస్తే శని సంతుష్టుడై ఉంటాడు. శని స్తోత్రాన్ని నిత్యం పఠిస్తే భగవంతుడి ఆశీర్వాదాలు పొందుతారు. జీవితంలో క్లిష్టమైన పరిస్థితులు ఎదుర్కొంటోన్న సమయంలో సూర్య దేవుడి కుమారుడైన, శని దేవుడికి పూజ చేస్తే మంచి ఫలితాలుంటాయి. శనివారం ఉపవాసం ఉండి, శనీశ్వరుడి అనుగ్రహం పొందితే అదృష్టం కలిసి వస్తుంది. శని మనిషి చేసిన చెడు కర్మ ఫలితాన్ని తొలగిస్తాడు. జాతక రీత్యా శని పన్నెండవ ఇంట, ఒకటవ ఇంట, రెండవ ఇంట సంచరిస్తున్నప్పుడు, దానిని "ఏలినాటి శని" లేదా "సాడే సాతి" అంటారు. అలాగే శని నాలుగవ ఇంట, ఎనిమిదవ యింట సంచరిస్తున్నప్పుడు కూడా చెడు ఫలితాలు ఇస్తాడు. అయితే ఈ సమయంలో శని ఇచ్చే ఫలితం తాత్కాలికంగా చెడు అనిపించినా, అది ఆ వ్యక్తి భవిష్యత్తుకు ఎంతో సహాయకారిగా ఉంటుంది. ఉదాహరణకు ఏ పని లేకుండా, ఖాళీగా తిరుగుతున్న వ్యక్తికి, ఉద్యోగం వస్తే, అది బద్ధకస్తుడు అయిన వ్యక్తికి మొదట కష్టంగా తోచినా, అది మంచి భవిష్యత్తును ఇస్తుంది. కాబట్టి ఆ తర్వాత ఆ కష్టం యొక్క విలువ తెలుస్తుంది. మనం పూర్వ జన్మలో చేసిన పాపాల ప్రయత్నాన్ని కష్టాల రూపంలో శని ఈ సమయంలో తొలగిస్తాడు. తద్వారా ఆ వ్యక్తి కి మంచి భవిష్యత్తు కలుగుతుంది. మనం ఎంత కష్టం చేస్తే శని అంతా సంతృప్తి చెందుతాడు. కాబట్టి జాతకంలో కానీ, గోచారంలో కానీ, శని అనుకూలంగా లేని వ్యక్తులు శారీరకంగా కష్ట పడటం, అంటే ఇతరులకు సహాయం చేయడం మొదలైనవి చేస్తే ఆ చెడు ఫలితం తగ్గిపోయి శుభ ఫలితాలను శని ఇస్తాడు. శనివారానికి స్థితి కారకుడైన శ్రీమన్నారాయణుడు అధిపతి , త్రయోదశికి అధిపతి కామదేవుడు. అంటే శివుడు. అలా శివకేశవుల క్రియలకు శని అధిపతి అయ్యాడు. అందుకే శనిత్రయోదశి శనికి ఇష్టమైన రోజు. త్రయోదశి తిథి శివుడికి ఎంతో ప్రీతికరమైనది. క్షీరసాగర మదనం జరిగి అమృతం ఉద్భవించిన తరువాత, హాలా హలాన్ని దిగమింగి తన కంఠంలో దాచుకొని లోకాలను కాపాడిన శివుడికి కృతజ్ఞతలు చెప్పడానికి దేవతలందరూ ఆయన వద్దకు వెళ్ళినది ఈ త్రయోదశి తిథి నాడే అని పురాణాల ద్వారా తెలుస్తుంది. శని త్రయోదశి ప్రదోష సమయాన శివుడికి అభిషేకం చేయడం చాల విశేషంగా లభిస్తుంది. ఈ సమయంలో శివుడికి చేసే పూజలు అత్యంత ఫలితాలనిస్తా యని శాస్త్రాలు చెబుతున్నాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ప్రపంచ అంతరిక్ష వారం - మానవజాతి ఆకాశయానం

## అంతరిక్షంలో మానవజాతి భవిష్యత్తు దృక్పథం - అక్టోబరు 4 నుండి 10 వరకు ప్రపంచ అంతరిక్ష వారం




ప్రపంచ అంతరిక్ష వారం ప్రతి సంవత్సరం అక్టోబరు 4 నుండి 10 వరకు ఘనంగా జరుపుకుంటారు. ఇది మానవజాతి అంతరిక్షంలో సాధించిన విజయాలను గుర్తుచేసే, భవిష్యత్తులోని అంతరిక్ష పరిశోధనలకు ప్రేరణనిచ్చే శాస్త్రోత్సవంగా నిలిచింది. ప్రపంచం మొత్తం అంతరిక్ష సాంకేతికత, విజ్ఞాన పరిపక్వత, శాస్త్రీయ ఆవిష్కరణల వైభవాన్ని ఈ వారంలో స్మరించు కుంటుంది. 1957 అక్టోబర్ 4న సోవియట్ యూనియన్ "స్పుట్నిక్-1" అనే తొలి కృత్రిమ ఉపగ్రహాన్ని విజయవంతంగా భూమి చుట్టూ ప్రవేశ పెట్టింది. కేవలం 83 కిలోల బరువున్న ఈ ఉపగ్రహం మానవ చరిత్రలో అంతరిక్ష యుగానికి నాంది పలికింది. ఆ తర్వాత 1967 అక్టోబర్ 10న అంతరిక్ష వినియోగంపై ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో "Outer Space Treaty" అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం అంతరిక్షం మానవజాతి సమష్టి ఆస్తి, దానిని కేవలం శాంతి ప్రయోజనాలకే వినియోగించు కోవాలని నిర్ణయించారు. ఈ రెండు ఘట్టాలను గుర్తు చేసుకోవడమే కాకుండా భవిష్యత్తు తరాలకు అంతరిక్ష పరిశోధన ప్రేరణను ఇచ్చే సందర్భంగా అక్టోబరు 4 నుండి 10 వరకు ప్రపంచ అంతరిక్ష వారం జరుపుకుంటారు. 1999లో ఐక్యరాజ్య సమితి ఈ వారాన్ని అధికారికంగా గుర్తించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక అంశాన్ని కేంద్రబిందువుగా తీసుకుని వివిధ దేశాలు వేల సంఖ్యలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. 2024లో ప్రపంచ వ్యాప్తంగా 80 దేశాల్లో 6,500కి పైగా కార్యక్రమాలు జరిగాయి. వీటిలో అంతరిక్ష ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లు, వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్‌లు, శాస్త్రీయ చర్చలు మరియు అంతరిక్ష శాస్త్రవేత్తల ప్రసంగాలు ప్రధానంగా జరిగాయి. విద్యార్థులు, పరిశోధకులు, సామాన్య ప్రజలు సమానంగా ఈ వారంలో పాల్గొని శాస్త్రీయ ఆవిష్కరణల పట్ల అవగాహన పెంపొందించారు. 2025 సంవత్సరానికి ఎంపికైన థీమ్ "%ూఱఙఱఅస్త్ర ఱఅ ూజూఝఛఎవ%". దీని ద్వారా భవిష్యత్తులో మానవ జీవితం భూమి పైనే కాకుండా అంతరిక్షంలో సుస్థిరంగా కొనసాగగలదా అనే ప్రశ్నకు దారితీస్తుంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం లో ఇప్పటి వరకు 19 దేశాల 280 మందికి పైగా వ్యోమగాములు వివిధ ప్రయోగాలను నిర్వహిస్తూ నెలల తరబడి జీవన అనుభవం పొందారు. ఒకేసారి ఆరు నుంచి పది మంది వ్యోమగాములు ISSలో ఉంటారు. గురుత్వాకర్షణ లేమి కారణంగా శరీరంలో కండరాలు, ఎముకలు బలహీన పడటం, హృదయ సంబంధ సమస్యలు, రక్త ప్రసరణలో మార్పులు, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు తలెత్తుతాయి. వీటిని అధిగమించడానికి ప్రత్యేక పరిశోధనలు జరుగు తున్నాయి. ISSలో ఆక్సిజన్ ఉత్పత్తి, నీటి రీసైక్లింగ్, కృత్రిమ ఆహారం తయారీ వంటి సాంకేతిక పరిష్కారాలు నెలకొన్నాయి. భవిష్యత్తులో చంద్రుడు, మార్స్ వంటి గ్రహాలపై శాశ్వత నివాసాలు ఏర్పాటు చేయాలన్న ప్రణాళికలు ఇప్పటికే నాసా, ఇస్రో, ఈసా వంటి అంతరిక్ష సంస్థల ప్రణాళికల్లో ఉన్నాయి. ఈ పరిశోధనలు భవిష్యత్తు తరాల జీవన విధానాలను భూ వ్యాప్తి చేసే విధంగా రూపకల్పన చేస్తున్నారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో 1975లో ఆర్యభట ఉపగ్రహం ప్రయోగంతో ప్రారంభమై, నేటి వరకు అద్భుతమైన విజయాలను సాధించింది. 100కి పైగా ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించడం, అత్యల్ప ఖర్చుతో గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందడం ఇస్రో ప్రత్యేకత. 2013లో మంగళయాన్ మిషన్ ద్వారా భారత్ మంగళ గ్రహాన్ని చేరిన తొలి ఆసియా దేశంగా నిలిచింది. 2023లో చంద్రయాన్-3 విజయవంతంగా చంద్రుని దక్షిణ ధ్రువంపై ల్యాండింగ్ చేయడం ద్వారా భారత్‌కు అంతర్జాతీయ కీర్తి లభించింది. అదే సంవత్సరం ఆదిత్య-L1 మిషన్ సూర్యుని అధ్యయనం కోసం ప్రవేశించింది. రాబోయే గగన యాన్ మిషన్ ద్వారా భారత్ తన తొలి మానవ అంతరిక్ష యాత్రను జరపడానికి సిద్ధమవుతోంది. ఈ విజయాలు భారత శాస్త్రవేత్తల ప్రతిభ, సంకల్పాన్ని ప్రపంచానికి చూపుతున్నాయి. ప్రస్తుతం భూమి చుట్టూ 9,000కి పైగా ఉపగ్రహాలు కక్ష్యలో తిరుగు తున్నాయి. వీటిలో 60 శాతం కమ్యూనికేషన్, 20 శాతం భూమి పరిశీలన, మిగతావి శాస్త్రీయ, సైనిక, వాతావరణ పరిశోధనలకు వినియోగించ బడుతున్నాయి. గ్లోబల్ స్పేస్ ఎకానమీ విలువ 2024లో 546 బిలియన్ డాలర్లు, 2030 నాటికి 1 ట్రిలియన్ డాలర్లకు చేరనున్నదని అంచనాలు ఉన్నాయి. ఈ గణాంకాలు అంతరిక్ష పరిశోధన భవిష్యత్తులో మానవజాతికి ఎంత కీలకమో స్పష్టంగా చూపుతున్నాయి. అంతరిక్ష పరిశోధన కేవలం శాస్త్రవేత్తల కల మాత్రమే కాదు, భవిష్యత్తులో మానవ జీవనానికి ఆధారం. భూమిపై వనరులు తగ్గిపోతున్న సందర్భంలో చంద్రుడు, మార్స్ వంటి గ్రహాల్లో వనరుల అన్వేషణ అత్యవసరమవుతోంది. గ్రహాంతర ఖనిజ సంపద వినియోగం, అంతరిక్ష పర్యాటకం, శాశ్వత నివాసాల నిర్మాణం వాస్తవ రూపం దాల్చబోతున్నాయి. ఈ పరిశోధనలు భవిష్యత్తు తరాలకు సుస్థిర జీవనావకాశాలను అందించ నున్నాయి. ప్రపంచ అంతరిక్ష వారం 2025 థీమ్ "Living in Space" ద్వారా మానవజాతి భవిష్యత్తు సవాళ్లను ముందుకు తెస్తుంది. భూమిని కాపాడుకుంటూనే అంతరిక్షాన్ని మానవ సమష్టి ఆస్తిగా వినియోగించడం, శాంతి, శాస్త్రీయ పురోగతి, అభివృద్ధి కోసం ఉపయోగించడం మనందరికీ స్పష్టంగా గుర్తుచేస్తుంది. ఇది యువతలో శాస్త్రీయ ఆవిష్కరణలకు, అంతరిక్ష పరిశోధనలో భాగస్వామ్యానికి ప్రేరణనిచ్చే ఘన ఉత్సవంగా నిలుస్తుంది.

**రామ కిష్టయ్య స ంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

చురకలు

# సంపాదకీయం

## భారత్ పై ట్రంప్ పగటి కలలు ఎప్పటికీ నెరవేరవు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్, రష్యా దేశాల మధ్య చమురు వ్యాపారంపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. రష్యాకు పెద్ద కొనుగోలుదారు అయిన భారత్ ఆ దేశానికి దూరమైందని ట్రంప్ పేర్కొన్నారు. కానీ, గణాంకాలు మాత్రం దీనికి విరుద్ధంగా ఉన్నాయి. జాతీయ ప్రయోజనాల ఆధారంగా భారత్ తన విధానాలను రూపొందించుకుంటుందనే వాస్తవాన్ని ఈ వ్యాఖ్యలు విస్మరించాయి.

**ట్రంప్ వ్యాఖ్యలు...** ట్రంప్ తన ఒక ఇంటర్వ్యూలో "భారత్ రష్యాకు పెద్ద మద్దతుదారు కాదు, రష్యా తన అతిపెద్ద వినియోగదారుని కోల్పోయింది" అని వ్యాఖ్యానించారు. పుతిన్‌తో జరగబోయే శిఖరాగ్ర సమావేశానికి ముందు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అంతేకాకుండా, అవసరమైతే "సెకండరీ టారిఫ్‌లు" విధించడానికి వెనుకాడబోనని, అది "వినాశకరమైన" నిర్ణయం అయినప్పటికీ అమెరికా ప్రయోజనాల కోసం అమలు చేస్తామని హెచ్చరించారు.

**వాస్తవాలు...** ట్రంప్ వ్యాఖ్యలకు విరుద్ధంగా, భారత్ రష్యా నుండి చమురు కొనుగోలును తగ్గించలేదు. కెప్లెర్ నివేదికల ప్రకారం, జూలైలో భారత్ రోజుకు 16 లక్షల బ్యారెళ్ల చమురు కొనుగోలు చేయగా, ఆగస్టులో అది 20 లక్షల బ్యారెళ్లకు పెరిగింది. ఇది భారత్ తన జాతీయ ప్రయోజనాల ఆధారంగా వ్యవహరిస్తుందనే వాస్తవాన్ని స్పష్టం చేస్తుంది. రష్యా నుండి చమురు కొనుగోలు చేయడం భారత్‌కు ఆర్థికంగా లాభదాయకం. అంతేకాక, చమురు సరఫరాదారుల జాబితాలో అమెరికా ఐదవ స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో, ట్రంప్ మాటలు వాస్తవాలకు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయి.

**- అంతర్జాతీయ సంబంధాలు, జాతీయ ప్రయోజనాలు...** ప్రతి దేశం తన జాతీయ ప్రయోజనాల ఆధారంగా విదేశాంగ విధానాన్ని రూపొందించుకుంటుంది. ముఖ్యంగా అంతర్జాతీయంగా చోటు చేసుకునే పరిణామాలు, యుద్ధాలు, ఆర్థిక పరిస్థితులు ఆయా దేశాల నిర్ణయాలపై ప్రభావం చూపుతాయి. ఈ విషయంలో భారత్ కూడా అదే చేసింది. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా నుండి రాయితీ ధరల వద్ద చమురు లభించడం భారత్‌కు ఒక గొప్ప అవకాశం. ఇది భారత్ తన ఇంధన భద్రతను బలోపేతం చేసుకోవడానికి, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుంది.

**భవిష్యత్తు సవాళ్లు...** ట్రంప్ "సెకండరీ టారిఫ్‌లు" విధించే హెచ్చరిక ఒక తీవ్రమైన సవాల్. అయినప్పటికీ, అంతర్జాతీయ చట్టాలు, వాణిజ్య ఒప్పందాలను పరిగణనలోకి తీసుకుంటే అటువంటి చర్యలు అంత తేలిక కాదు. ఒకవేళ అమెరికా ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే అది ప్రపంచ వాణిజ్య వ్యవస్థపై, ముఖ్యంగా అమెరికా ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ వంటి సంస్థలు ఇటువంటి ఏకపక్ష నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తాయి. డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు అతని రాజకీయ ఆలోచనలకు, అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా ఉండవచ్చు. కానీ అవి వాస్తవాలను, గణాంకాలను ప్రతిబింబించడం లేదు. భారత్ వంటి దేశాలు కేవలం ఇతర దేశాల ఒత్తిళ్లకు తలొగ్గకుండా తమ జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ నిర్ణయాలు తీసుకుంటాయనేది స్పష్టం. కాబట్టి, భారత్‌పై ట్రంప్ చూస్తున్న 'పగటి కలలు' ఎప్పటికీ నెరవేరవు.

# సకల దోషాలను తొలగించే ప్రదోష వ్రతం



ప్రదోషమంటే అది ఒక కాల విశేషము. దోషాలను హరించే ప్రశస్తమైన కాలాన్ని ప్రదోషకాలం అంటారు. ప్రదోషమంటే పాప నిర్మూలన అని అర్థము. ప్రతిరోజూ సూర్యాస్తమయ సమయములో చంద్రుడి కదలికల వలన ఏర్పడునది ప్రదోషము."ప్రదోషో రజనీ ముఖం" అంటారు. అంటే ప్రదోషకాలం రాత్రికి ప్రారంభం వంటిది. ఈ సమయం లో పరమశివుడు పార్వతీదేవితో కలిసి అర్ధనారీశ్వర రూపంగా దర్శనమిస్తాడు. చంద్రుడి గతి వలన, ఏర్పడే తిథుల సంధులలో సూర్యాస్తమయము అయితే, అప్పుడు ప్రదోషము అంటారు. త్రయోదశినాడు కలిగే ప్రదోషాన్ని 'మహా ప్రదోషం' అంటారు. ప్రదోష సమయం రోజు వస్తున్న త్రయోదశి నాడు వచ్చే ప్రదోష సమయం చాలా పవిత్రమైనది. త్రయోదశి వ్రతం శివుడు ప్రధాన దేవునిగా ఆచరించే వ్రతం. త్రయోదశి నాడు చేస్తారు కనుక త్రయోదశి వ్రతం అని, శివపూజ, రాత్రి భోజనం చేయడం వల్ల ప్రదోష వ్రతం అని అంటారు. త్రయోదశి వ్రతం ఆచరించడం వల్ల మహాశివుడు ప్రసన్నం అవుతాడు. సకల సుఖాలు, సర్వ సంపదల కోసం ఈ వ్రతం చేస్తారు. ప్రదోషం అంటే దోషాలను తొలగించేది అని అర్థం. ప్రతి రోజూ సూర్యాస్తమయ కాలంలో దాదాపు ఆరు ఘడియల అంటే రెండు గంటల 24 నిమిషాల సమయాన్ని ప్రదోష కాలంగా పరిగణిస్తారు. ప్రదోష కాలములో త్రయోదశి తిథి ఉంటే దానిని మహా ప్రదోషం అంటారు. మహా ప్రదోషం రోజున శివ భక్తులు ప్రదోష వ్రతాన్ని ఆచరిస్తారుస్కంద పురాణంలో ప్రదోష మహత్య కథ కూడా వివరింపబడింది. రెండు త్రయోదశి తిథులలో (శుక్ల పక్షము/ కృష్ణ పక్షము) ప్రదోష వ్రతాన్ని ఆచరిస్తారు. కొన్ని ప్రాంతాలలో మాత్రం కేవలం కృష్ణ పక్ష ప్రదోషం రోజును మాత్రమే పాటిస్తారు. అన్ని పూజలు, వ్రతాల వలె త్రయోదశి వ్రతాన్ని ఉదయం వేళ కాకుండా, సూర్యాస్తమయం నుండి రాత్రి రెండు ఘడియల లోపు ఈ పూజ చేస్తారు. ఏ నెలలో అయినా త్రయోదశి నాడు ఈ వ్రతం చేసుకోవచ్చు. అయితే ఇది సుదీర్ఘకాలంపాటు చేయాల్సిన వ్రతం. ప్రతినెలలో వచ్చే రెండు త్రయోదశుల్లోనూ త్రయోదశి వ్రతం చేయాలి. అలా 11 సంవత్సరాల పాటు ఆచరించాలి. ఏదయినా ఆటంకం వచ్చి మధ్యలో చేయలేకపోతే ఉద్యాపన చేసి ప్రతిమను విసర్జించవచ్చు.

ప్రదోషకాలంలో పరమేశ్వరుడు ఏకకాలంలో రెండు రూపాల్ని ప్రదర్శిస్తూ ఎడమభాగాన పార్వతి రెండవ భాగమున పరమేశ్వర రూపంగా "అర్ధనారీశ్వరుడుగా" దర్శనమిచ్చేకాలం. ప్రదోష సమయంలో శివుడు అర్ధనారీశ్వర రూపంలో ఆనంద తాండవ నృత్యం చేస్తాడని నృత్యరత్నావళి లో చెప్పబడింది. ప్రదోష సమయంలో సమస్త దేవతలందరూ శివుడిని అర్చిస్తారని భావిస్తారు. ప్రదోష సమయంలో చేసే శివారాధన ఉత్తమమని చెప్పబడుతుంది. ఈ సమయంలో శివారాధన చేయటాన్ని సమస్త దేవతలను పూజించటంతో సమానంగా భావిస్తారు. మహాశివుడు అభిషేక ప్రియుడు కనుక మంత్రోక్తంగా పంచామృతాలతో ఆయనను అభిషేకించాలి. వీలు పడని వారు ఆలయానికి వెళ్ళి ప్రదోష సమయం లో అభిషేకం చేయించవచ్చు. ప్రదోషకాలం లో శివప్రదోష స్తోత్రాన్ని పఠించడం వలన విశేష ఫలితాలు పొందవచ్చు. ప్రదోష సమయంలో శివాలయాలలో జరిగే అభిషేకాలను దర్శించే వారికి సకల సంపదలు సిద్ధిస్తాయని భావిస్తారు. ఈ సమయంలో శివుడితో పాటు నందీశ్వరుడిని కూడా ఆరాధిస్తారు. నందీశ్వరుడు నాలుగు వేదాలు, 64 కళలను అభ్యసించిన నిష్ణాతుడైనప్పటికీ, వినయంతో వుండి, శివునికి ఏర్పడిన అనుమానాలను కూడా నివృత్తి చేస్తాడని విశ్వసిస్తారు. అందువల్ల నందీశ్వరుడిని ఆరాధించడం వలన బుద్ధికుశలత, మానసిక ఉల్లాసం లభిస్తాయి. త్రయోదశి తిథి ఆదివారం రోజు వస్తే దానిని రవి ప్రదోషం అని, సోమవారం రోజు వస్తే దానిని సోమ ప్రదోషమనీ, మంగళవారం రోజు వస్తే దానిని భౌమ ప్రదోషమని, బుధవారం రోజు వస్తే దానిని బుధ ప్రదోషమని, గురువారం రోజు వస్తే దానిని గురు ప్రదోషమని, శుక్రవారం రోజు వస్తే దానిని శుక్ర ప్రదోషమని, శనివారం రోజు వస్తే దానిని శని త్రయోదశి అనీ, శని ప్రదోషమని పిలుస్తారు. దేవ దానవులు క్షీర సాగరాన్ని మథించినప్పుడు వెలువడిన హాలాహలం నుండి శివుడు ప్రపంచాన్ని రక్షించిన రోజుగా శనిప్రదోషం రోజును చెబుతారు. శని కర్మకారకుడు, శివుడు సంహార కారకుడు కావున శని ప్రదోష సమయాన శివారాధన చేయడం ఉత్తమంగా పరిగణిస్తారు. సోమవారం శివుడికి ప్రీతికరమైనది. కాబట్టి ఆ రోజున వచ్చే సోమ ప్రదోషమును ప్రశస్తమైనదిగా భావిస్తారు. ఈ రోజున ప్రదోష వ్రతము ఆచరించటం వలన మనసులోని మలినాలన్నీ తొలగిపోతాయి . త్రయోదశీ ప్రదోషము గురువారం వస్తే ఆ రోజును గురు త్రయోదశిగా భావిస్తారు. గురు ప్రదోష పూజ వలన విద్యాబుద్ధులు, సంపదలు కలుగుతాయని చెబుతారు. జాతకములో ఉండే గురు దోషములకు రుద్రారాధన విరుగుడుగా భావిస్తారు. ప్రదోషం రోజు ఉదయమే స్నానం చేసి తెల్లని వస్త్రాలను ధరించి, శరీరంపై విభూతిని, రుద్రాక్షమాలను కూడా ధరించటం మంచిది. ఆ రోజులో వీలైనప్పుడల్లా పంచాక్షరి మంత్రాన్ని (ఓ నమ:శివాయ) జపం చేయాలి. ప్రదోషం రోజున నిశ్శబ్దంగా ఆరాధించటాన్ని శివుడు ఇష్టపడతాడని చెబుతారు. కఠిన ఉపవాసం చేయలేనివారు పండ్లు, పాలు లాంటివి తీసుకోవచ్చు. ఉడికించిన పదార్థాలను తీసుకోకూడదు. సాయంకాలం ప్రదోష సమయంలో స్నానమాచరించి శివ షోడశోపచార పూజ జరపాలి. ప్రదోషం రోజు ఆ పరమ శివుడికి నేతి దీపారాధన, ఆవుపాలతో అభిషేకం అభిషేకం చేయటం, బిల్వ పత్రాలు మరియు శంఖుపూలతో అర్చించటం శ్రేయస్కరం. మహా మృత్యుంజయ మంత్రాన్ని ...ఓం త్రయంబకం యజామహే, సుగంధిం పుష్టి వర్ధనం, ఊర్వారుకమివ బంధనాత్, మృత్యోర్ముక్షీయ మామృతాత్....మహా మృత్యుంజయ మంత్రము పఠించాలి.... 108 సార్లు జపించి ప్రదోష కథను వినటంగానీ చదవటం గానీ చేయాలి. ఇంటిలో పూజ ముగించిన అనంతరం శివాలయాన్ని దర్శించాలి. వీలైనవారు ప్రదోష స్తోత్రం, శివ స్తోత్రములను కూడా పఠించాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


# అక్టోబర్ 4... ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవం




వాస్తవానికి మనిషి కంటే ముందే జంతువులు భూమి మీద జీవించాయని సైన్స్ చెబుతోంది. అయితే భూమి ఆవిర్భవించిన తరవాత పుట్టిన చాలా జంతు జాతులు ఇప్పుడు లేవు. ఈ ఆధునిక యుగంలోనూ మనకు తెలిసిన ఎన్నో జంతు జాతులు కనుమరుగైపోతున్నాయి. ఇలా జంతువుల జాతులు అంతరించి పోకుండా, వాటిని పరిరక్షించడమే 'ప్రపంచ జంతు దినోత్సవం' ముఖ్యోద్దేశం. ఏటా అక్టోబర్ 4న ఈ జంతు దినోత్సవాన్ని అంతర్జా తీయంగా నిర్వహిస్తున్నారు. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధి చేయడం, జంతువుల హక్కులను కాపాడటం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. ప్రపంచ వ్యాప్తంగా వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థక మవుతున్న నేపథ్యంలో.. వాటి సంరక్షణ ప్రాధాన్యతను గుర్తుచేస్తూ ప్రతీ ఏటా అన్ని దేశాలు దీన్ని ప్రపంచ జంతు దినోత్సవాన్ని జరుపు తున్నాయి. ప్రపంచ జంతు దినోత్సవాన్ని సైనాలజిస్ట్ హెన్రిచ్ జిమ్మెర్మాన్ ప్రారంభించాడు. ఆయన మొదటి ప్రపంచ జంతు దినోత్సవాన్ని 24 మార్చి 1925 న జర్మనీలోని బెర్లిన్‌లోని స్పోర్ట్ ప్యాలెస్‌లో నిర్వహించాడు. దీనికి 5,000 మందికి పైగా ప్రజలు హాజరయ్యారు. అనంతరం ఇది 1929లో అక్టోబరు 4కు మార్చ బడింది. ప్రారంభంలో అతను జర్మనీ, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ మరియు చెకోస్లోవేకియాలో మాత్రమే పాటించారు. చివరగా, మే 1931 లో ఫ్లోరెన్స్ ఇటలీలో జరిగిన ఇంటర్నేషనల్ యానిమల్ ప్రొటెక్షన్ కాంగ్రెస్ సమావేశంలో, అక్టోబర్ 4 ప్రపంచ జంతు దినోత్సవాన్ని సార్వత్రికం చేయాలన్న ఆయన ప్రతిపాదనను ఏకగ్రీవంగా అంగీకరించి తీర్మానంగా ఆమోదించారు. హీన్రిచ్ జిమ్మెర్మాన్ చేసిన కార్యక్రమాల, ప్రచారం కారణంగా 1931, మే నెలలో ఇటలీలోని ఫ్లోరెన్స్లో జరిగిన అంతర్జాతీయ జంతు రక్షణ సదస్సులో అక్టోబరు 4ను అంతర్జాతీయ జంతు దినోత్సవంగా ఏకగ్రీవంగా అమోదించడం జరిగింది. ప్రపంచ జంతు దినోత్సవం 2003 నుండి యునైటెడ్ కింగ్డమ్ ఆధారిత జంతు సంక్షేమ స్వచ్ఛంద సంస్థ నేచర్ వాచ్ ఫౌండేషన్ నేతృత్వంలోని మరియు స్పాన్సర్ చేసిన జంతు సంరక్షణ ఉద్యమాన్ని ఏకం చేసే ప్రపంచ కార్యక్రమంగా పెరుగుతోంది. జాతీయత, మతం, విశ్వాసం లేదా రాజకీయ భావజాలంతో సంబంధం లేకుండా అనేక దేశాలలో విస్తృతంగా అంగీకరించ బడింది మరియు వివిధ రకాలుగా జరుపు కుంటారు. దినోత్సవం రోజున జంతు సంక్షేమ ప్రచారంతో పాటుగా జంతు పరిరక్షక శిబిరాలను ప్రారంభించడం, జంతు సంరక్షణకు నిధులు సేకరించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. వన్య ప్రాణుల సంరక్షణ కోసం మన ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. అయితే స్మగ్లర్లు, వేటగాళ్లు.. వన్యప్రాణులు, అరణ్యాల పాలిట శాపంలా తయారయ్యారు. వీళ్ల దెబ్బకు కీకరారణ్యాలు సైతం మైదానాలుగా మారుతున్న పరిస్థితి. పరిశ్రమల స్థాపన పేరిట పెద్ద ఎత్తున అటవీ భూముల్లో పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహిస్తుండటం కూడా వన్యప్రాణుల మనుగడుకు ముప్పుగా మారింది. దీంతో గూడు చెదిరిన వన్యప్రాణుల జనారణ్యం లోకి వస్తున్న పరిస్థితి. దేశంలోని జంతు సంపదను పరిరక్షించడానికి మొట్టమొదటి సారిగా 1898లో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం మొదటి పక్షుల అభయారణ్యాన్ని తమిళనాడు లోని వేదాంతంగల్‌లో ఏర్పాటు చేసింది. ఆ తర్వాత 1935లో మొదటి వన్య ప్రాణి జాతీయ పార్కు 'హేలీ'ని ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేశారు. ఇదే పార్కును ఇప్పుడు జిమ్ కార్బెట్ పార్కు అని పిలుస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న మొత్తం జాతీయ పార్కుల సంఖ్య 102. 1976లో జరిగిన రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 51(ఎ) ప్రకారం వన్యప్రాణి సంరక్షణ పౌరుల ప్రాథమిక విధి. ఆదేశిక సూత్రాల్లో కూడా కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు విధిగా వన్యప్రాణులను సంరక్షించాలని పేర్కొన్నారు. జాతీయ వన్యప్రాణి చట్టం 1972, వన్యప్రాణులను వేటాడటాన్ని పూర్తిగా నిషేధించింది. ఆనాటి ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ 1972లో వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం వన్య ప్రాణుల వేట నిషేధం. ఈ చట్టం అమలులోకి వచ్చాక.. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 23 టైగర్ ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ప్రస్తుతం దేశంలో 441వన్య ప్రాణి సంరక్షణ కేంద్రాలు ఉండగా.. వీటిల్లో 28 టైగర్ జోన్స్ ఉన్నాయి. అంతర్జాతీయంగా పులి చర్మానికి, గోళ్లకు, ఎముకలకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో.. వేటగాళ్ల చేతిలో చిరుతల బలైపోతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశవ్యాప్తంగా ఉన్న అడవుల్లో దాదాపు నలభై వేలకు పైగా ఉన్న పులులు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. కానీ 1972 నాటికే ఆ సంఖ్య మూడు వేలకు పడిపోయిందంటే.. అప్పటి ప్రభుత్వాలు ఎంతటి నిర్లక్ష్య వైఖరి అవలంభించాయో స్పష్టంగా అర్థమవుతోంది. సాధారణంగా పులుల జనాభాను లెక్కించేందుకు ఇంతకు ముందు పాదముద్రలను గుర్తించడం ఒక్కటే మార్గం. అవి సంచరించే ప్రాంతాల్లో రహస్య కెమెరాలను ఏర్పాటు చేసి.. వాటి పాదముద్రలను సేకరించేవారు. అయితే ఇది చాలా కష్టంతో కూడుకున్న పని. కచ్చితమైన లెక్కకు ఆస్కారం కూడా తక్కువే. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) పులుల మలం ద్వారా వాటిని లెక్కించే పద్ధతిని ఆవిష్కరించింది. 20వ శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు లక్ష పైచిలుకు పులులు ఉండేవి అని అంచనా. 2014 లెక్కల ప్రకారం ప్రపంచంలో 3891 పులులు ఉండగా వాటిలో 2226 మన దేశంలోనే ఉన్నాయి. భారత్‌లో 2011 లెక్కల ప్రకారం 1706, 2014 ప్రకారం 2226 ఉండగా 2018 పులుల గణన ప్రకారం మన దేశంలో 2967 పులులున్నాయి. ప్రపంచంలో ఉన్న మొత్తం పులుల్లో 70శాతం పైగా మనదేశం లోనే ఉన్నాయి. గడిచిన కొన్నేళ్లలో ఒక్క మధ్య ప్రదేశ్‌లోనే 19 పులులు మృత్యువాత పడ్డాయి. మహారాష్ట్రలో 9, ఉత్తరాఖండ్‌లో 9 మృత్యువాత పడ్డాయి. 2016లో దేశవ్యాప్తంగా74 పులులు మరణించినట్టు లెక్కలు చెబుతున్నాయి. 2006లో పులులను స్మగ్లర్ల బారి నుండి కాపాడటానికి టైగర్ టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశారు. భారత దేశంలో పశ్చిమ కనుమలు, నల్లమల కొండలు, శేషాచలం కొండలు, హిమాలయాలు, దేశ ఈశాన్యప్రాంతం విభిన్న జంతు జీవజాలానికి నిలయంగా ఉన్నాయి. మానవుడికి, జంతువులకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ దినోత్సవం తెలియ జేస్తుంది. ఈ రోజున జంతు సంక్షేమ ప్రచారాలతో పాటు జంతు పరిరక్షక శిబిరాలను ప్రారంభించడం, జంతు సంరక్షణకు నిధులు సేకరించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. దేశంలో అడవులు అన్యాక్రాంతమవుతున్నాయి. ఒకప్పుడు విశాలంగా ఎక్కడ చూసినా పచ్చదనంతో బాసిల్లే అటవీ ప్రాంతాలు రాను రాను కనుమరుగై పోతున్నాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ అటవీ ప్రాణుల వేట యధేచ్ఛగా జరుగుతుంది. వాస్తవానికి మనం జంతువుల ఆవాసాలను నాశనం చేస్తున్నాం. విచక్షణా రహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను, మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం. అందుకే అడవి జంతువులు గ్రామాల్లోకీ, పట్టణాల్లోకి వస్తున్నాయి. ఆహారం కోసం మనుషులపై దాడులు చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిని మార్చడం కూడా ఈ జంతు దినోత్సవం లక్ష్యాల్లో ఒకటి. జంతువులకు సహజ సిద్ధమైన ఆవాసాలను కల్పించడం, జంతు జాతులను రక్షించడం, వాటి సంక్షేమాన్ని కాపాడటం ఇవే ప్రధానం. ఈరోజును జంతు ప్రేమికుల దినోత్సవంగా కూడా పిలుస్తారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# పౌరాణిక చిత్రాల బ్రహ్మ కమలాకర కామేశ్వరరావు - అక్టోబర్ 4... కామేశ్వర రావు జయంతి



తెలుగు సినిమా ప్రపంచంలో ప్రత్యేక స్థానం కమలాకర కామేశ్వరరావు ది. పౌరాణిక సినిమాలకు కేరాఫ్ అడ్రస్ ఆయనదే. తెలుగు సినిమా ప్రేక్షకుల హృదయాలలో దైవ స్వరూపునిగా సుస్థిర స్థానం సంపాదించుకుని, పాత తరానికి చెందిన కొందరిచే చిత్ర పట పూజలు సైతం అందుకున్న ఎన్టీఆర్, పౌరాణిక హీరోగా వెలుగు వెలగడానికి కారణం కమలాకర కామేశ్వరరావు తీసిన సినిమాలే. తెలుగు పౌరాణిక చిత్రాలకు సాటి రాగల పౌరాణికాలు యావద్భారత దేశంలోనే మరే భాషలో లేవు. తెలుగు పౌరాణికాలకు ఆ ఘనతను సాధించి పెట్టిన చిత్రాలు చాలానే ఉన్నాయి. నర్తనశాల, పాండవ వనవాసం లాంటివి ఆయన దర్శకత్వ ప్రతిభకు నిదర్శనంగా మిగిలి పోయాయి. వాస్తవానికి తెలుగు ప్రేక్షకులకు తన సినిమాలతో భక్తి మార్గం పట్టించిన ఘనుడాయన. ఆయన తీసిన సినిమాలు.. ఒక్కొక్కటి ఒక్కొక్క ఆణిముత్యం. కమలాకర కామేశ్వరావు 1911 అక్టోబర్ 4న మచిలీపట్నంలో జన్మించారు. అక్కడే బి.ఎ పూర్తి చేశారు. మొదట్లో కృష్ణా పత్రికలో 'సినీఫాన్' అన్న పేరుతో సినిమా రివ్యూలు వ్రాసేవారు. విడుదలైన తెలుగు సినిమాలనుబీ న్యూ థియేటర్స్, ప్రభాత్ వారి హిందీ సినిమాలనూ కూలంకషంగా పరిశీలిస్తూ నిశితంగా విమర్శించేవారు. సినిమాల్లో కథ, కథాసంవిధానం ఎలా వున్నాయి? ఆ సినిమాలు టెక్నికల్ గా ఎలా వున్నాయి? అన్న విషయాల మీద ఆయన విమర్శలు సాగేవి. తెలుగు, హిందీ సినిమాలే గాక ఆంగ్ల చిత్రాల గురించి కూడా వ్రాసేవారు.1931లో నోబెల్ బహుమతి గ్రహీత పెరల్ బక్ రాసిన 'గుడ్ ఎర్త్' నవలను 1937లో సిడ్నీ ఫ్రాంక్లిన్ దర్శకత్వంలో ఇర్వింగ్ తాల్ బర్గ్ సినిమాగా నిర్మించగా, అందులో పాల్‌ముని, లూసీ రైనర్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఆస్కార్‌ను గెలుచుకుంది. ఈ సినిమా గురించి కమలాకర నాలుగు వారాలు సమీక్షలు రాశారు. నిశిత దృష్టితో రాసిన ఆ సమీక్షలు పాఠకులను విపరీతంగా ఆకర్షించాయి. ఆయన సినిమా విమర్శలకు ఎంతో విలువ ఉండేది. ఆ విమర్శలు విజ్ఞులందరికీ ప్రామాణికంగా ఉండేవి. ఆ విమర్శల్ని చదివి, వాటిలో 'బాగుంది' అని వ్రాస్తేనే ఆ సినిమాలను చూసేవాళ్ళు, బాగలేదని వ్రాస్తే చూడని వాళ్ళు కూడా ఉండేవారు. ఆయాన విమర్శలను నార్ల వెంకటేశ్వరరావు, గూడవల్లి రామబ్రహ్మం లాంటి ప్రముఖులందరూ ప్రశంసించారు. 'వస్త్రాపహరణం', 'మానసంరక్షణం' చిత్రాల మీద వ్రాసిన విమర్శలే కామేశ్వర రావును సినిమా రంగంలోకి అడుగులు వేసేలా చేశాయి. 1936లో ఆయన సినిమాల మీదున్న మక్కువతో మద్రాస్ చేరారు. స్క్రిప్ట్ మీదున్న పట్టువల్ల. మొదట్లో రచయితగా పని చేశారు. అదే సమయంలోనే కె.వి. రెడ్డి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశారు. ఆయనతో కలిసి అనేక సినిమాలకు స్క్రిప్ట్ వర్క్ కూడా చేశారు. వాహినీ వారి దేవత చిత్రం నుంచి కామేశ్వరరావు అసోసియేట్ గా పనిచేశారు. ఆసియాలోకెల్లా అతిపెద్ద స్టూడియోగా పేరుపొందిన వాహినీ స్టూడియోకు శంకుస్థాపన జరిగినప్పుడు మట్టి వేసిన వారిలో కామేశ్వరరావు ఒకరు. బందరులో కామేశ్వరరావుకు పింగళి నాగేంద్రరావుతో ఉన్న పరిచయంతో, కామేశ్వరరావు ఆయనను కె.వి.రెడ్డికి, బి.ఎన్.రెడ్డికి పరిచయం చేశారు. అలా తెలుగు సినిమా చరిత్రలో అత్యంత ప్రతిభా వంతమైన రచయితను పరిశ్రమకు పరిచయం చేసింది కూడా కామేశ్వరరావే. కమలాకర కామేశ్వరావు దర్శకత్వం వహించిన మొదటి సినిమా 'చంద్రహారం'. ఇది జానపద సినిమాగా తెరకెక్కింది. ఇదే సినిమాను తమిళ వెర్షన్‌లో కూడా చేశారు.ఆ తర్వాత తీసిన 'పెంకి పెళ్లాం' సినిమా చేశారు. ఎన్టీఆర్‌తో కలిసి 'పాండురంగ మహాత్మ్యం' అనే పౌరాణిక సినిమా చేసిన కామేశ్వరరావుకు ఊహించని పేరు వచ్చింది. ఈ సినిమా అప్పటి వరకు గ్లామర్ హీరోగా వెలిగిన ఎన్టీఆర్ ఈ సినిమాలో మరో కోణంలో చూపించి సక్సెస్ అందుకున్నారు. తర్వాత వరుసగా 'శోభ', 'రేచుక్క పగటి చుక్క', 'మహాకవి కాళిదాసు' 'మహామంత్రి తిమ్మరుసు' లాంటి సినిమాలు ఆయన దర్శకత్వంలో వచ్చి హిట్స్ అందుకున్నాయి. 'మహాకవి కాళిదాసు', 'మహామంత్రి తిమ్మరుసు' సినిమాలకు రాష్ట్రపతి పురస్కారం అందుకున్నారు కామేశ్వరరావు. 1962లో వచ్చిన 'గుండమ్మకథ', 'మహామంత్రి తిమ్మరుసు' వంటి వరుస సక్సెస్‌లతో బాక్సాఫిస్ దగ్గర కామేశ్వరావు పేరు మారుమ్రోగి పోయింది. 'గుండమ్మ కథ' సినిమా కుటుంబ కథా చిత్రంగా కామేశ్వరరావుకు మంచి పేరు తెచ్చుకుంది. కామేశ్వరరావు దర్శకత్వంలో వచ్చిన మరో హిట్ మూవీ 'నర్తనశాల'. ఈ సినిమాతోనే ఎస్.వి.రంగారావుకు ప్రపంచ వ్యాప్తంగా పేరొచ్చింది. జకార్తాలో జరిగిన ఆఫ్రో ఏషియన్ ఫిలిం ఫెస్టివల్‌లో పాల్గొని ఉత్తమ నటుడిగా ఎస్వీఆర్ అవార్డు అందుకున్నారు. అంతకు ముందు కమలాకర దర్శకత్వంలో వచ్చిన 'పాండవ వనవాసం' సినిమా కూడా కామేశ్వరరావుకు మంచి పేరు తీసుకొచ్చింది. పౌరాణిక సినిమాల్లో అదే ఆయన ఫస్ట్ మూవీ. ఆ తర్వాత 'శకుంతల', 'శ్రీకృష్ణ తులాభారం', 'కాంభోజరాజు కథ', 'శ్రీకృష్ణావతారం', 'కలిసిన మనసులు', 'వీరాంజనేయ' లాంటి సూపర్ హిట్ సినిమాలు దర్శకుడిగా ఆయన ఖ్యాతిని పెంచాయి. పౌరాణికాల మీదున్న పట్టుతో 1972లో కామేశ్వరరావు పిల్లలతో 'బాల భారతం' సినిమా తీసి ప్రేక్షకులను మెప్పించారు. 1970 ద్వితీయార్థానికి తెలుగులో పౌరాణికాలకు ఆదరణ పెరిగింది. ఒక రకంగా ఎన్టీఆర్ పౌరాణిక హీరోగా ఒక వెలుగు వెలగడంలో కమలకర కామేశ్వరరావు తీసిన సినిమాలే కీ రోల్ పోషించాయి. రామారావు కూడా కమలకర కామేశ్వరరావును తన గురువుగా భావించేవారు. 'కురుక్షేత్రం', అంతగా విజయవంతం కాకున్నా, తర్వాత ఆయన దర్శకత్వంలో వచ్చిన 'సీతారామ వనవాసం', 'వినాయక విజయం', 'వాసవీ కన్యకా పరమేశ్వరి మహాత్మ్యం', 'సంతోషిమాత వ్రత మహాత్మ్యం', 'శ్రీదత్త దర్శనం', 'అష్టలక్ష్మి వైభవం', 'ఏడుకొండల స్వామి' లాంటి పౌరాణిక సినిమాలెన్నో బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్‌గా నిలిచాయి. దర్శకుడిగా కమలాకర కామేశ్వరరావు పౌరాణిక, చారిత్రాత్మక, జానపద, సాంఘిక సినిమాలు చేసినా%ౌ% ఆయనకు పేరు సంపాదించి పెట్టినవి మాత్రం పౌరాణికాలే. అందుకే ఆయన్ని అందరు తెలుగు వెండితెర పౌరాణిక బ్రహ్మగా కీర్తిస్తారు. ఎన్నో అపురూపమైన చిత్రాలలో ప్రేక్షకుల మనసు దోచుకున్న కామేశ్వర రావు 1998 జూన్ 29న కన్ను మూశారు. గ్లాస్గో పంచె, తెల్లని మల్లెపూల వంటి జబ్బా, నెరసిన జుట్టు, నుదుట కుంకుమ బొట్టు... జీవితంలో ప్యాంటు వేయని మూర్తీభవించిన తెలుగుదనానికి ప్రతీకగా నిలిచిన కమలాకర కామేశ్వరరావు మన మధ్య లేకపోయినా. ఆయన సినిమాలతో ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో చిరంజీవిగా నిలిచే ఉన్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



# భారం లేదిక.. భరోసా ఉందిగా

హైదరాబాద్: విధి నిర్వహణలో మరణించే పారిశుద్ధ్య కార్మికులకు రూ.30లక్షలు, పూర్తిస్థాయి ఉద్యోగులకు గరిష్ఠంగా రూ.1.25కోట్ల బీమా సదుపాయాన్ని కల్పిస్తూ జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. రూపాయి ఖర్చు లేకుండానే కార్మికుల కుటుంబాలకు ధీమా కల్పించేట్టుగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ.కర్ణన్ పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)తో ఒప్పందం చేసుకున్నారు. ఇటీవలి గణపతి నిమజ్జన వేడుకల్లో వాహనం ఢీకొని పారిశుద్ధ్య కార్మికురాలు రేణుక మృతిచెందిన నేపథ్యంలో బీమా సౌకర్యంపై కమిషనర్ నిర్ణయం తీసుకున్నారు. నిత్యం చెత్తతో సావాసం చేస్తూ, అనారోగ్యం, రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతోన్న కార్మికుల



కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇవ్వాలని నిశ్చయించారు.

**రాష్ట్రంలో మొదటిసారి..:** సింగరేణి బొగ్గు గనుల్లో పనిచేస్తోన్న కార్మికులకు బీమా చెల్లిస్తోన్న విధానం గురించి పీఎన్‌బీతో చర్చించారు. అదే విధానాన్ని హైదరాబాద్‌లో అమలు చేయాలని కోరారు. రూ.25వేల లోపు జీతం ఉన్న వారికి రూ.30లక్షలు, రూ.25వేల నుంచి రూ.75వేల మధ్య వేతనం ఉన్న వారికి రూ.50లక్షలు, రూ.75వేల నుంచి రూ.1.5లక్షల జీతం ఉన్న వారికి రూ.కోటి, అంతకు మించి జీతం తీసుకునే వారికి రూ.1.25కోట్ల బీమా సదుపాయం చెల్లించేలా పీఎన్‌బీని ఒప్పించారు. ఉద్యోగులు, కార్మికులు విమాన ప్రమాదంలో మరణిస్తే రెట్టింపు బీమా, శాశ్వత అంగ వైకల్యానికి సగం బీమా అందుతుందని అధికారులు తెలిపారు.

# చర్లపల్లిలో రైలెల్లిపోతోంది

హైదరాబాద్ : చర్లపల్లి నుంచి సుమారు 130 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. దాదాపు 55 వేల మందికిపైగా ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. దక్షిణ మధ్య రైల్వే అనేక రైళ్లను ఈ టెర్మినల్‌కు మళ్లించగా.. తాజాగా పండగ ప్రత్యేక రైళ్ల సంఖ్య పెరిగింది. సరైన ప్రజా రవాణా సదుపాయాలు కల్పించకుండా రైళ్లను పెంచుకుంటూ పోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరం నుంచి చర్లపల్లికి.. అక్కడి నుంచి గమ్యస్థానాలకు చేరేందుకు అయ్యే ఖర్చు ఒకేలా ఉంటోందని వాపోతున్నారు. ప్రస్తుతం నగరం మీదుగా విశాఖకు రెండు, తిరుపతి, బెంగళూరు, నాగ్‌పూర్‌కు ఒకటి చొప్పున మొత్తం 5 వందేభారత్ రైళు నడుస్తుండగా.. కొత్తగా చర్లపల్లి – నాందేడ్, నాంపల్లి – పుణె త్వరలోనే ప్రారంభిస్తామని దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది.



**ఇదీ పరిస్థితి..**

పంజాగుట్ట నుంచి చర్లపల్లి టెర్మినల్‌కు 24 కిలోమీటర్లు. రాత్రి 9.30 గంటలకు రైలు అందుకోవాల్సి ఉండగా.. స్థానిక ప్రయాణికుడు రాత్రి 8 గంటలకు ప్రైవేటు క్యాబ్ బుక్ చేసేందుకు ప్రయత్నించారు. పంజాగుట్ట నుంచి చర్లపల్లి టెర్మినల్‌కు చేరుకునేందుకు ద్విచక్ర వాహనం రూ.350, ఆటోకు రూ.450, నాన్ ఏసీ కారుకు రూ.600, ఏసీ కారు రూ.650, పెద్ద పరిమాణంలో ఉండే వాహనం రూ.900 అని చూపించడంతో అవాక్కయ్యారు.

చర్లపల్లికి ఒకటే ఎంఎంటీఎస్ అందుబాటులో ఉండడం, రెండు లేదా మూడు బస్సులు మారి సమయానికి చేరుకునే అవకాశాలు తక్కువగా ఉండటంతో ఎక్కువ మంది క్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు.

చర్లపల్లి టెర్మినల్‌కు రెండు మార్గాల ద్వారా ప్రయాణికులు చేరుకుంటున్నారు. మల్లాపూర్ మార్గంలో ప్రతి 40 నిమిషాలకు, మహాలక్ష్మినగర్ వైపు నుంచి ప్రతి 10 నిమిషాలకో బస్సులున్నాయని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. మహాలక్ష్మినగర్ వైపు చేరుకోవాలంటే చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రయాణ సదుపాయాలు పెంచాలి.. లేదంటే అందుబాటులో ఉండే స్టేషన్లకు కొన్ని రైళ్లను మళ్లించాలని కోరుతున్నారు.

# భీమేశ్వరుడి సన్నిధే బాలాలయం

వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ప్రధాన ఆలయ విస్తరణ పనుల కారణంగా.. భక్తుల దర్శనాలు భీమేశ్వరాలయంలో ఏర్పాటు చేయనున్నారు. దీనినే బాలాలయంగా మార్చుతున్నారు. రాజన్న ప్రధాన ఆలయంలో స్వామి వారికి నిత్య పూజలు యథావిధిగా కొనసాగుతాయి. భీమేశ్వరాలయంలో రూ.3.44 కోట్లతో కల్యాణ మండపం, హెూమ, వ్రత మండపాలు, క్యూలైన్లు, సీసీ ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయి. రాజరాజేశ్వరస్వామి ఆలయం కంటే ముందే వేములవాడలో భీమేశ్వరాలయం నిర్మించినట్లు శాసనాల ఆధారంగా తెలుస్తోంది. వేములవాడ చాళుక్యుల రాజు బద్దెగుడు క్రీ.శ.850–895 కాలంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. పూర్తిగా నల్లరాతితో ఉన్న ఆలయ గోడలపై దశావతారాలు, పంచతంత్ర కథలతో గొప్పశిల్పాలు ఉన్నాయి. ఇది అప్పటి చాళుక్యుల కళా నైపుణ్యం.. సాంస్కృతిక చైతన్యానికి నిదర్శనం. గర్భగుడిలో మూడు అడుగుల వ్యాసంతో ఉన్న శివలింగాన్ని భీమేశ్వరుడిగా కొలుస్తారు. దక్షిణ భారతదేశంలోని పురాతన శివాలయాల్లోకెల్లా అతిపెద్ద శివలింగంగా ప్రసిద్ధి. వేములవాడ భీమకవి.. భీమేశ్వరుడి అనుగ్రహంతో అనేక గ్రంథాలు రచించారని.. అందుకే ఆయన ఆంధ్రకవి శేఖరుడు అనే బిరుదు పొందినట్లు చరిత్రకారులు చెబుతుంటారు. పురావస్తుశాఖ పరిధిలోని భీమేశ్వరాలయం దశాబ్దాలుగా కనీస మరమ్మతులకు నోచుకోలేదు కానీ.. రాజరాజేశ్వరస్వామి ఆలయ పునరుద్ధరణతో ఈ ఆలయాన్ని బాలాలయంగా మార్చుతుండటంతో కొత్తరూపు సంతరించుకోనుంది.

# 'స్థానిక సంస్థల' పోరు షురూ..



హైదరాబాద్: రంగారెడ్డి జిల్లాలో స్థానిక సంస్థల పోరు మొదలైంది. ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదల చేసిన నేపథ్యంలో.. కలెక్టర్ సి.నారాయణరెడ్డి సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల తేదీలు ప్రకటించారు. అక్టోబరు 23, 27 తేదీల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు.. అక్టోబరు 31, నవంబరు 4న సర్పంచుల ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికల కోడ్ సోమవారమే ప్రారంభమవడంతో.. కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తొలివిడతలో కందుకూరు, చేవెళ్ల, రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్లు, మలివిడతలో ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్ డివిజన్లలో నిర్వహించాలని ఆదేశించారు.

**మహేశ్వరం నుంచే జడ్పీ ఛైర్‌పర్సన్!**

రంగారెడ్డి జడ్పీ పీఠాన్ని ఎస్సీ మహిళకు కేటాయించారు. మొత్తం 21 జడ్పీటీసీ స్థానాలుండగా.. ఇద్దరు ఎస్సీ మహిళలు జడ్పీటీసీ సభ్యులుగా ఎన్నికవనున్నారు. వీరిద్దరూ మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు, షాబాద్ మండలాల నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. దీంతో ఆయా పార్టీల నేతలు ప్రయత్నాలు ప్రారంభించాయి.ఎస్సీ మహిళలు ఎక్కడున్నా సరే.. పోటీ చేయించి జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఎంపిక చేయాలని యోచిస్తున్నారు. లేనిపక్షంలో అన్‌రిజర్వ్‌డ్ మహిళా స్థానాలైన అబ్దుల్లాపూర్‌మెట్, నందిగామ మండలాల నుంచి పోటీ చేయించాలని భావిస్తున్నాయి.

**జడ్పీటీసీ సభ్యుల రిజర్వేషన్లు ఇలా...**

ఎస్సీ: శంకర్‌పల్లి, చేవెళ్ల, కందుకూరు(మహిళ), షాబాద్(మహిళ), ఎస్టీ: మంచాల, కొత్తూరు, ఫరూక్‌నగర్(మహిళ), బీసీ: మొయినాబాద్(మహిళ), కొందుర్గు, ఇబ్రహీంపట్నం (మహిళ), కేశంపేట, యాచారం, మహేశ్వరం(మహిళ), తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల్ (మహిళ), జనరల్: అబ్దుల్లాపూర్‌మెట్(మహిళ), జిల్లేడుచౌదరిగూడ, నందిగామ (మహిళ), శంషాబాద్, ఆమన్‌గల్

**ఎంపీపీలు..**

ఎస్సీ: శంకర్‌పల్లి(మహిళ), చేవెళ్ల, షాబాద్, శంషాబాద్(మహిళ), ఎస్టీ: కొత్తూరు(మహిళ), ఫరూక్‌నగర్, తలకొండపల్లి, బీసీ: జిల్లేడుచౌదరిగూడ, మొయినాబాద్, కొందుర్గు, ఇబ్రహీంపట్నం(మహిళ), కేశంపేట(మహిళ), కందుకూరు(మహిళ), యాచారం, మహేశ్వరం(మహిళ), మంచాల, జనరల్: అబ్దుల్లాపూర్‌మెట్(మహిళ), నందిగామ, మాడ్గుల, కడ్తాల్(మహిళ) ఆమన్‌గల్.

**సర్పంచులు..**జిల్లాలో మొత్తం 526 గ్రామపంచాయతీలు, 4668 వార్డుల్లో రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఫరూక్‌నగర్ మండలంలో అత్యధికంగా 47 పంచాయతీలుండగా.. అత్యల్పంగా కొత్తూరు పరిధిలో 12 గ్రామపంచాయతీలున్నాయి. జిల్లాలో మొత్తం 27 మండలాలు ఉండగా.. వాటిల్లో ఆరు జీహెచ్ఎంసీలో విలీనమయ్యాయి.

# ఆరు బయట చెత్త పడేస్తే..మూడో కన్ను పట్టేస్తుంది



కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో ప్రధాన, అంతర్గత రహదారులపై ఎక్కడ పడితే అక్కడ చెత్త పడేయడం ఇక మీదట కుదరదు. నగరవ్యాప్తంగా రద్దీ ప్రాంతాల్లో చెత్త వేసే వారిని గుర్తించేందుకు 22 చోట్ల సీసీ కెమెరాలు బిగించాలని నిర్ణయించి, మొదట 15 చోట్ల అమలు చేస్తున్నారు. అక్కడి సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు. వాహనాలపై వచ్చి చెత్త వేసే వారి ఫొటోలు కమాండ్ కంట్రోల్‌కు చేరుతున్నాయి. తర్వాత వారిపై అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఇటీవల రహదారుల మీద చెత్త పడేసే వారి సంఖ్య పెరగడంతో దుర్గంధంగా మారుతున్నాయి. పారిశుద్ధ్య కార్మికులు ఉదయం శుభ్రం చేసినా.. సాయంత్రం వరకు ఎప్పటిలాగే చెత్త తయారవుతుండటంతో కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తీవ్రంగా పరిగణించారు. ఆయా ప్రాంతాల్లో చెత్త వేసే వారిని గుర్తించేందుకు సీసీ కెమెరాల బిగింపుతోపాటు ప్రత్యేక సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. వాహనాల నంబర్ ఆధారంగా ఎక్కడి నుంచి చెత్తను తీసుకొస్తున్నారనే విషయాన్ని ఆరా తీసి జరిమానా విధించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

**ఇంటికి చలాన్ పంపేలా కసరత్తు**

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా పారిశుద్ధ్య పనుల నిర్వహణను కూడా కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు. వాహనాలపై చెత్త తీసుకొచ్చి బహిరంగ ప్రదేశాల్లో వేస్తున్న వారి ఇళ్లకు నేరుగా చలాన్ పంపించనున్నారు. గుర్తించిన వాహనాలన్నీ పోలీసు శాఖకు పంపించి అక్కడి నుంచి జరిమానా వేయాలని అధికారులు చర్యలు చేపట్టారు. ఇది విజయవంతమైతే చెత్తను పడేసే వారి సంఖ్య పూర్తిగా తగ్గనుంది.

**రూ.10 వేల జరిమానా..**

నగరంలోని బస్టాండ్ వెనుక ఓ హెూటల్ నుంచి మూడు రోజులుగా ఆటోలో చెత్తను తీసుకొచ్చి వేస్తున్నారు. ఆదివారం సాయంత్రం కూడా వచ్చి డంపు చేస్తుండటంతో కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా గుర్తించారు. ఆటో వివరాల ఆధారంగా సోమవారం పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో ఎంహెచ్‌వో డాక్టర్ సుమన్, పర్యావరణ ఇంజినీరు స్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వై.శ్రీనివాస్, డీఆర్ఎఫ్ సిబ్బంది హెూటల్‌కు చేరుకొని వారిపై ఆగ్రహించారు. కమిషనర్ ఆదేశాల మేరకు హెూటల్‌కు రూ.10వేల జరిమానా వేశారు. ఈ ప్రక్రియ రోజూ కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.

# చెరువుల చెర వీడేనా!



మల్యాల : 'చెరువులను చెరబట్టినోళ్లు ఎంత గొప్ప వాళ్లైనా చెరసాలకు పంపిస్తాం. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, నాలాలు ఆక్రమించుకుని చేపట్టిన నిర్మాణాలను వెంటనే తొలగించాలి. రాష్ట్రంలో ఎవరు చెరువులను కబ్జా చేసిన తాట తీస్తాం'. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అన్న మాటలివి. చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందంటూ పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించినా.. గ్రామాల్లో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. జిల్లాలోని పలు చెరువుల్లోనే బహుళ అంతస్తు భవనాలు, ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో మూసీ నది ఉప్పొంగటంతో జనావాసాలు, అధికారిక నివాసాలు, బస్‌స్టేషన్లు నీట మునిగిన సంఘటనలతోనైనా జిల్లా అధికార యంత్రాంగం కళ్లు తెరవాలి.

**నోటీసులతో సరి** మల్యాల మండలం సూరప్ప, మల్యాల, భీమన్న, తుమ్మచెరువుల్లో ఇప్పటికే పలు నిర్మాణాలు వెలిశాయి. నీళ్లు నిలిచే ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో కూడా భవన నిర్మాణాలకు అధికారులు అనుమతిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. గ్రామపంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాల్సిన ఇరిగేషన్ శాఖ అధికారులు నిర్లక్ష్యంతో చెరువుల్లో అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. పత్రికల్లో కథనాలు రాగానే అక్రమ నిర్మాణదారులకు అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకోవటం సాధారణమైంది.

**నీటి నిల్వ సామర్థ్యం తగ్గుదల**

మల్యాల మండలంలోని పలు చెరువుల్లో అక్రమ నిర్మాణాలకు అధికారులు అనుమతులు ఇస్తున్నట్లు స్థానికులు అంటున్నారు. వాస్తవానికి చెరువుల భూముల్లో నీళ్లులేని సమయంలో 'ఏక్ ఫసల్' పేరుతో సాగు చేసుకోవటానికి మాత్రమే వీలుంటుంది. నీళ్లుంటే అవకాశం ఉండదు. అయితే కొనుగోలు చేసిన వ్యక్తులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో ఏకంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. కొన్ని చెరువుల్లో నీళ్లు నిలువకుండా తూములు తెరచి ఉంచుతున్నట్లు సమాచారం. చెరువుల్లో నిర్మాణాలతో నీటి నిల్వ సామర్థ్యం సగానికిపైగా తగ్గిపోవటంతో భారీ వర్షాలకు మత్తడి కింది భాగంలోని జనావాసాల్లోకీ నీరుచేరి కాలనీలు జలమయంగా మారుతున్నాయి. చెరువులకు సంబంధించిన భూముల్లో నిర్మాణాలు చేపట్టిన కొందరూ రైతుబంధు పథకం కింద కూడా లబ్ధి పొందినట్లు సమాచారం.

# ఖాళీ స్థలాలు.. వ్యాధులకు కారకాలు

గోదావరిఖని : నగరంలోని వివిధ కాలనీల్లోని ఖాళీ ప్రదేశాలు(ప్లాట్లు) వ్యాధులకు కారకాలుగా మారుతున్నాయి. వర్షాకాలంలో ఆయా ప్రదేశాల్లో వరద, మురుగునీరు నిలవడం, దోమలు, పందులకు ఆవాసంగా మారడం, పరిసరాల్లో నివసించేవారికి దుర్గంధంతో పాటు వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఖాళీ ప్రదేశాల్లో వరద, మురుగునీరు, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రంగా ఉంచాలని.. లేకపోతే నగరపాలిక ఆధ్వర్యంలో శుభ్రం చేయించి జరిమానా విధిస్తామని పేర్కొనడంతో కొందరు యజమానులు మాత్రమే స్పందించి ఆయా స్థలాలను శుభ్రం చేయించారు. నగరపాలిక నిబంధనల ప్రకారంగా జరిమానాలు విధించేందుకు రంగం సిద్ధం చేసినప్పటికీ వివిధ కారణాలతో ఆచరణకు నోచుకోలేదు.

నగరంలోని కాకతీయనగర్, మార్కండేయకాలనీ, శాంతినగర్, శ్రీనగర్ కాలనీ, ఇందిరానగర్, శివనగర్, రాజ్యలక్ష్మీ తదితర కాలనీల్లో ఖాళీ ప్రదేశాల్లో మురుగు, వరద, చెత్తాచెదారం సమస్య తీవ్రంగా ఉంది. నివాసాల మధ్య ఖాళీ ప్లాట్లలో మురుగునీరు నిలుస్తుండటంతో దానికి ఇరువైపులా ఇళ్లలోని వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బహుళ అంతస్తుల భవనాలున్న కాలనీల్లోనే సమస్య తీవ్రంగా ఉంది. స్థలం ఖాళీగా ఉండటంతో సమీపంలోని వారు చెత్తను అందులోనే



పడేస్తుండటంతో కొన్ని కాలనీల్లో ఖాళీ ప్రదేశాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి.స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించి నోటీసులు జారీ చేస్తామని గతంలో నగరపాలక అధికారులు పేర్కొన్నా ఆచరణకు నోచుకోవడం లేదు. స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న స్థలాల్లోనూ మురుగు, చెత్త సమస్య లేకుండా శ్రద్ధ వహిస్తే అధిక శాతం సమస్య పరిష్కారం కానుంది.అధిక రేటు వస్తే విక్రయిద్దామని, వీలున్నప్పుడు ఇల్లు కట్టుకుంటామని ప్లాట్ల యజమానులు నిశ్చింతంగా ఉండగా, వాటి పక్కన ఇళ్లు కట్టుకొని నివసించే వారు రోగాల బారిన పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నగరపాలక అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి యుద్ధ ప్రాతిపదికన ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన మురుగు, వరద, చెత్త సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.

# కొలువులకు మార్గం

సిరిసిల్ల : జిల్లాలో డిగ్రీలు, ఆపై చదువులు పూర్తిచేసిన యువత చాలా మంది ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. వీరిలో కొందరు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడాలనే ఆకాంక్ష ఉంటే.. మరికొందరు ప్రైవేటు సంస్థల్లోనైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. ఎందులోనూ పూర్తిస్థాయి ఉద్యోగావకాశాలు లభించకపోవచ్చు. అందుకే జిల్లాలోని ఉపాధికల్పన కార్యాలయానికి అనుబంధంగా మోడల్ కెరీర్ సెంటర్ (ఎంసీసీ)ని ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టరేట్లో 2,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో సుమారు రూ.30 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

**అవకాశాలను మెరుగుపర్చేందుకు..**

దేశంలోని ప్రైవేటు సంస్థలతోపాటు విదేశాల్లోనూ విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయి. జిల్లా ఉపాధికల్పనశాఖ కార్యాలయంలో తొమ్మిది వేల మంది నిరుద్యోగులు తమ వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి నెలకు సగటున 30 మంది నిరుద్యోగులు తమకు ఉద్యోగాలు కల్పించాలని దరఖాస్తులతో వస్తున్నారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగులకు దిశానిర్దేశం చేయాల్సిన ప్రభుత్వ వ్యవస్థ (ఉపాధి కల్పన కార్యాలయం) స్థితిగతులు, పనితీరు, లక్ష్యాలను మెరుగుపరిచేందుకు మోడల్ కెరీర్ కేంద్రం ప్రారంభించనుంది.

ఎంసీసీలో ఉద్యోగ సమాచారం, నిరుద్యోగులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వటంతోపాటు ప్రతినెలా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తారు. వాటన్నింటికి అవసరమైన సమాచారం ఎంసీసీలో అందుబాటులో ఉంటుంది. ఉద్యోగమేళాకు హాజరయ్యే అభ్యర్థులు ఆయా సంస్థల్లో అనుసరించాల్సిన తీరు. బృంద చర్చలు, ఆన్‌లైన్ ముఖాముఖిలో పాటించాల్సిన మెలకువలను ఈ కేంద్రంలో తర్ఫీదు ఇస్తారు.

విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే యువతకు తెలంగాణ విదేశీ మానవ వనరుల సంస్థ (టామ్‌కామ్) జిల్లాల వారీగా ఉద్యోగ మేళాలను నిర్వహిస్తోంది. గల్ఫ్ దేశాలతోపాటు జపాన్, యూరప్, మిడిల్‌ఈస్ట్ దేశాలు, ఇంగ్లాండ్, కెనడా, జర్మనీ ఆస్ట్రేలియాతో కలిపి 20 దేశాల్లో ఈ సంస్థ విస్తరించింది. నర్సింగ్, హెూటళ్లు, నిర్మాణరంగం, డ్రైవింగ్,



కేర్‌టేకర్లు వంటి 15 రకాల విభాగాల్లో అవకాశాలు కల్పిస్తుంది. ఆయా దేశాల నిబంధనల ప్రకారం భాషలు, అందుకు అవసరమైన నైపుణ్యాలను నేర్పిస్తారు. ఆయా మేళాలు నిర్వహణ సమయంలో ఎంసీసీలో ప్రత్యేకంగా నిపుణులకు నియమించి శిక్షణనిస్తారు. విదేశీ ఉద్యోగాలకు వెళ్లాలనుకునే జిల్లా యువతకు ఇది మంచి అవకాశం.

**అందుబాటులోకి తీసుకొస్తాం**

జిల్లాలో త్వరలోనే ఎంసీసీ అందుబాటులోకి తీసుకొస్తాం. ప్రతినెలా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నాం. వాటిలోని ప్రైవేటు కార్పొరేట్ సంస్థల్లో తొలుత తక్కువ వేతనాలు ఉంటాయి. హైదరాబాద్ లాంటి నగరాల్లో తక్కువ వేతనాలకు చేయలేమని మధ్యలోనే మానేసి వస్తున్నారు. మరికొందరు ప్రైవేటు సంస్థల్లోనూ క్రమక్రమంగా ఉన్నతస్థాయికి చేరినవారు ఉన్నారు. ఎంసీసీలో ఉద్యోగాల స్థితిగతులు.. కంపెనీలపై అవగాహన కలిగించడటం.. ఈ కేంద్రంలో ఇంటర్‌నెట్తో కూడిన కంప్యూటర్లు, ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులకు అనుమానాలు నివృత్తి చేసేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారు.

రాఘవేందర్, జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి

చురకలు



# పెరిగిన భారం.. మెరుగవని సామర్థ్యం..

కరీంనగర్ :ఈ చిత్రంలోని నియంత్రిక కరీంనగర్ సీతారాంపూర్‌లోనిది. ఈ నియంత్రికపై ఓవర్ లోడ్ ఉందంటూ అదనపు మీటర్లు కనెక్షన్ ఇవ్వకుండా విద్యుత్తు సిబ్బంది తిరస్కరిస్తున్నారు. ఈ ప్రాంతం నగరంలో విలీనమై ఆరేళ్లవుతోంది. పెరుగుతున్న పరిస్థితుల దృష్ట్యా సామర్థ్యం ఎక్కువున్న త్రీఫేజ్ నియంత్రికలను ఏర్పాటు చేయడంలేదు.

గ్రామాల్లో వినియోగించే సింగిల్ ఫేజ్ నియంత్రికలనే ఇప్పటికీ నగరంలో విలీనమైన ప్రాంతాల్లోనూ కొనసాగిస్తున్నారు. అధికారులు ఏర్పాటు చేయడానికి ముందుకొస్తుంటే కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఒప్పుకోవడంలేదు. వినియోగదారులు అదనపు అవసరాలకు విద్యుత్తు సరఫరా కోసం ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో విలీన గ్రామాల్లోనే ఈ పరిస్థితి నెలకొంది.

**విలీన గ్రామాల్లోనే...**

కరీంనగర్ నగరపాలక సంస్థ 2019లో రేకుర్తి, సీతారాంపూర్, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, అల్గునూర్, సదాశివపల్లి, పద్మనగర్, ఆరెపల్లి



గ్రామాలను విలీనం చేసుకుంది. తిరిగి 2025లో కొత్తపల్లి పురపాలక సంఘం, చింతకుంట, మల్కాపూర్-లక్ష్మీపూర్, బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామాలను కలిపారు. అయితే వీటిలో పద్మనగర్ మినహా అన్ని ప్రాంతాల్లో సింగిల్ ఫేజ్ నియంత్రికలనే వినియోగిస్తున్నారు.

**కొత్త కనెక్షన్ ఇవ్వలేని పరిస్థితి**

సింగిల్ ఫేజ్ నియంత్రికల సామర్థ్యం 15 కేవీఏ నుంచి 25 కేవీఏ ఉంటుంది. ఇందులో 15 కేవీఏపై లోడ్ ఎక్కువైతే 25 కేవీఏ ఏర్పాటు చేస్తారు. దీని సామర్థ్యం మించితే 66 కేవీఏ, 100 కేవీఏ నియంత్రికలు ఏర్పాటు చేయాలి. సాధారణంగా 2 కిలోవాట్ల సామర్థ్యం ఉన్న మీటర్లు జారీ చేయాలి. కానీ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కరీంనగర్‌లో 3 కిలోవాట్ల సామర్థ్యం గల కొత్త మీటర్ కనెక్షన్ జారీ చేస్తున్నారు.

అధికారిక రికార్డుల ప్రకారం తక్కువ కనెక్షన్లున్న నియంత్రికపై లోడ్ ఎక్కువగా పడుతోంది. మరి కొన్ని చోట్ల లోడ్ తక్కువగా ఉన్నా వాడకం ఎక్కువగా ఉండి నియంత్రిక సామర్థ్యం మించిపోతోంది. ఏ రకంగానూ కొత్త కనెక్షన్ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీనికి పరిష్కారంగా అధిక సామర్థ్యం ఉన్న త్రీఫేజ్ నియంత్రికలు ఏర్పాటు చేస్తే వినియోగదారుల ఇబ్బందులు తొలగిపోతాయి.

**మా దృష్టికి రాలేదు** ఇప్పటివరకు నియంత్రిక సమస్య నా దృష్టికి రాలేదు. నేను వచ్చిన నాటి నుంచి ఎవరికీ ఓవర్‌లోడ్ ఉందంటూ మీటర్లు నిలిపివేయలేదు. నియంత్రికల ఏర్పాటును స్థానికులు అడ్డుకుంటున్న మాట వాస్తవమే. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతాం. రఘు, ఏడీఈ కరీంనగర్ రూరల్

# పల్లె పోరు షురూ!

కరీంనగర్ : ఎట్టకేలకు స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది.. దీంతో నాలుగు జిల్లాల్లో రాజకీయ సందడి మొదలైంది.. మొదట మండల, జిల్లా పరిషత్తు ఎన్నికలను రెండు దఫాలుగా నిర్వహిస్తామని తేదీలు ప్రకటించడంతో పోటీలో ఉండాలనుకున్నవారు ఆ దిశగా సమాయత్తమవుతున్నారు.. ఇదే సమయంలో గ్రామ పంచాయతీలకు ఎన్నికల తేదీలను ఖరారు చేయడంతో పల్లెల్లో రాజకీయ వేడి నెలకొననుంది. అక్టోబరు 9న మొదలయ్యే ప్రక్రియ నవంబరు 11తో ముగియనుంది.

**కోడ్ అమలుతో..**నాలుగు జిల్లాల పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమలులోకి రావడంతో కలెక్టర్లు యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా అభివృద్ధి పనులకు సంబంధించి కొత్త నిర్ణయాలు వెలువడకుండా చూడటంతోపాటు రాజకీయ పార్టీల వైఖరిపైన కన్నేయనున్నారు. దసరా తరువాత అక్టోబరు 9వ తేదీ నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ చేపట్టనుండటంతో ఈ దిశగా అధికారులకు ఏర్పాట్ల బాధ్యతలు అప్పగిస్తున్నారు. పర్యవేక్షణ కోసం పలు కమిటీలను కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఉన్నతాధికారులకు అప్పగించనున్నారు. ఇప్పటికే రిజర్వేషన్ల ప్రక్రియ ఖరారవడంతో నామపత్రాల స్వీకరణ కేంద్రాలు, బ్యాలెట్ పత్రాలు, సిబ్బందికి శిక్షణల దిశగా వేగాన్ని పెంచనున్నారు.

**సిద్ధంగా పార్టీలు..**మూడు ప్రధాన పార్టీలు స్థానిక పోరు దిశగా సిద్ధమవుతున్నాయి. గ్రామాల్లో పంచాయతీల సర్పంచుల పదవీ కాలం 2024 ఫిబ్రవరి 1వ తేదీతో ముగిసింది. అప్పటి నుంచి పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోంది. సర్పంచులు కావాలని ఆశించిన నాయకులంతా రిజర్వేషన్లు అనుకూలిస్తే పోటీలో ఉంటామంటూ సంకేతాలిస్తూ వచ్చారు. మరోవైపు మండల, జిల్లా పరిషత్తు ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యుల గడువు కూడా 2024 జులై 5తో పూర్తయింది. దీంతో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు పోటీ చేయాలని భావిస్తున్న వారంతా పోటీకి సిద్ధమవుతూ పార్టీల సహకారం దిశగా వేచి చూస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను గెలిపించుకునే దిశగా వ్యూహాలు రచిస్తుండగా సంక్షేమ పథకాలతో పాటు పల్లెల్లో చేసిన అభివృద్ధి వరంగా భావిస్తోంది. భారాస పల్లెల్లో తమకున్న ప్రజాదరణతో మళ్లీ సత్తా చాటే దిశగా అభ్యర్థులను సిద్ధం చేస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా దీటైన అభ్యర్థులను రంగంలో దింపడానికి ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

# పెద్ద చెరువు చిన్నబోతోంది..!.. రావిర్యాలలో 30 ఎకరాల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో వెంచర్లు



హైదరాబాద్ : మహేశ్వరం మండలంలోని పెద్దచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు ఆక్రమణకు గురైనా రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్ఎండీఏ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇక్కడ 30 ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. ఇటీవల వర్షం నీరు లే-అవుట్లలోకి రాకుండా స్థిరాస్తి వెంచర్ ప్రతినిధులు అడ్డుకట్ట వేస్తే పొలాలు నీట మునిగాయి. రైతుల ఆగ్రహంతో అధికారులు అడ్డుకట్ట తొలగించారు. తొలుత హెచ్ఎండీఏ అధికారులే అనుమతులిచ్చారని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. హెచ్ఎండీఏ అధికారులేమో.. 'ఇది ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదు. కలెక్టర్ నుంచి నిరభ్యంతర పత్రం వస్తే లే-అవుట్‌కు అనుమతి ఇస్తాం.' అంటున్నారు. రెవెన్యూ అధికారులు మాత్రం ఎఫ్‌టీఎల్‌పై సంయుక్త సర్వే చేస్తామంటున్నారు.

**పటాన్ని మార్చేసి..**

తుక్కుగూడ సమీపంలోని రావిర్యాల అవుటర్ రింగు రోడ్డు దగ్గరలోని పెద్ద చెరువు భూములు స్థిరాస్తి వెంచర్లకు అనువుగా ఉంటాయని కొందరు అక్రమార్కులు కన్నేశారు. పదేళ్ల క్రితం చెరువు విస్తీర్ణం 1224 ఎకరాల నుంచి 884.20 ఎకరాలకు అధికారులు తగ్గించారు. 2016లో చెరువు చిత్రపటాన్ని మార్చేసి 855 ఎకరాలేనని తేల్చారు. ఇదే అదనుగా స్థిరాస్తి వ్యాపారులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను కలిపేసుకుని రహదారులు నిర్మించి, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయించారు. వర్షం కురిసినప్పుడు చెరువు నీరు ఈ వెంచర్లలోకి రావడంతో కొనుగోలు చేసినవారు ఇళ్లు కట్టుకునేందుకు ముందుకు రావడం లేదు.

**హద్దులు చెరిపేసి..** సర్దార్‌నగర్-రావిర్యాల మధ్య లోని పెద్దచెరువు కింద కొంగర, ఆదిభట్ల, పటేల్‌గూడ గ్రామా ల్లో వందల ఎకరాలు సాగు చేస్తున్నారు. పదేళ్ల క్రితం కొన్ని వెంచర్లకు ప్రయోజనం కల్పించేందుకు ఏకంగా చెరువు హద్దులను అధికారులు మార్చేశారు. బాహ్యవలయ రహదారి లోపల చెరువు ఉండగా, వెలుపల ఉన్నట్టు డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో మార్చారు. తద్వారా 30 ఎకరాల మేరకు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు అక్రమార్కుల ఖాతాలోకి వెళ్లాయి. ఈ భూముల ప్రస్తుత మార్కెట్ ధర రూ.450 కోట్లు ఉంటుంది. చెరువు సరిహద్దు విషయమై ఇరిగేషన్ శాఖ ఏఈఈ గోవింద్ నాయక్‌ను వివరణ కోరగా.. అవుటర్ లోపలే చెరువుందని స్పష్టం చేశారు.

# ధర ఎక్కువ.. స్పందన తక్కువ.. స్థలాల వేలంపై మల్లగుల్లాలు



హైదరాబాద్: హెచ్ఎండీఏ లేఅవుట్లలోని ప్లాట్ల విక్రయాలకు సంబంధించి తాజాగా ఆన్‌లైన్‌లో వేలం వేయగా.. పెద్దగా స్పందన రాలేదు. పలు ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న ధరల కంటే రెండు, మూడు రెట్లు అధికంగా ఆప్‌సెట్(హెచ్ఎండీఏ నిర్ణయించే కనీస ధర) ధరలు నిర్ణయించడం వల్లే ఆసక్తి చూపలేదని ఒక నిర్ణయానికి వచ్చారు.కోకాపేటలో కనీస ధర చదరపు గజానికి ఏకంగా రూ.1.75 లక్షలుగా నిర్ణయించారు. గతంలో రూ.65 వేలుగా అప్‌సెట్ ధర ఉంది. తాజాగా సర్వే నంబరు 144లో 8,591 చదరపు గజాలను వేలంలో పెట్టగా ధర ఎక్కువగా ఉండడంతో ఎవరూ ముందుకు రాలేదు. తుర్కయంజాల్‌లోనూ ఇదే పరిస్థితి.

**చదరపు గజానికి గతంలో నిర్ణయించిన ధర ఇలా...**

తర్కయాంజిల్ (12 ప్లాట్లు)- 60,000

బాచుపల్లి (70 ప్లాట్లు) - 70,000

బైరాగిగూడ- 75,000

కోకాపేట్- 1,75,000

చందానగర్- 1,05,000

పుప్పాలగూడ- 1,20,000

**బెడిసికొట్టిన హెచ్ఎండీఏ వ్యూహం..**

తాజాగా ఆన్‌లైన్ వేలానికి స్పందన లేకపోవడంతో ఆప్‌సెట్ ధరను తగ్గించి మరోసారి వేలం వేయాలని భావిస్తున్నారు. గతంలో మోకిలలో ప్లాట్లను వేలం వేయగా చాలామంది రూ.లక్ష కట్టి వేలంలో పాల్గొన్నారు. చదరపు గజం రూ.లక్ష వరకు పెంచేసి తర్వాత డబ్బులు కట్టడం మానేశారు. తాజాగా డిపాజిట్ మొత్తాలను భారీ ఎత్తున పెంచడం వల్ల అర్హులైన వారే ముందుకొస్తారని భావించినప్పటికీ ఆ వ్యూహం బెడిసికొట్టింది. స్థానికంగా ఉన్న ధరలను పరిశీలించి ఆప్‌సెట్ ధర నిర్ణయించే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు.

# నిబంధనలు గాలికి.. వ్యర్థాలు శివారుకి




హైదరాబాద్: పరిశ్రమల వ్యర్థాలతో జీడిమెట్ల, కాటేదాన్, పటాన్‌చెరు, నాచారం, మల్లాపూర్, పాశమైలారం ప్రాంతాల్లో భూగర్భజలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. గ్రేటర్ పరిధిలోని 185 చెరువులు, కుంటల్లో నీరు మురుగుమయమైంది.జీడిమెట్ల సమీపంలోని ఫాక్స్‌సాగర్, కాటేదాన్ చెంత నూర్‌మహ్మద్‌కుంటతోపాటు అనేక చెరువులు నీరు ఉపయోగించలేని విధంగా మారాయి. పారిశ్రామికవాడల్లోని ఇళ్లలో ట్యాప్ తిప్పితే నురగతో నీరు ఉబుకుతోంది.నిత్యం పరిశ్రమల్లో వెలువడే వ్యర్థాలను జీడిమెట్ల, పటాన్‌చెరు ఈటీపీలతో పాటు నాచారంలోని మన ఈటీపీకి తరలించాన్న నిబంధనలు నిర్వాహకులు విస్మరిస్తున్నారు.

**ట్యాంకర్ మాఫియా..** గతంలో పరిశ్రమల నిర్వాహకులు సమీపంలోని డ్రైనేజీ, నాలాల్లోనే వ్యర్థ జలాలను వదిలేవారు. స్థానికుల్లో అవగాహన పెరగడంతో వాటిని ఇప్పుడు శివార్లకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో జీడిమెట్ల సుభాష్‌నగర్‌లో వ్యర్థాలను తరలించేందుకు సిద్ధం చేస్తున్న డ్రమ్ములు నిబంధనలను కాలరాస్తున్నాయి. ఇందుకు ఓ ట్యాంకర్ల మాఫియానే నడుస్తోంది. కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) నిబంధనల ప్రకారం పరిశ్రమల్లోని కాలుష్యకారక వ్యర్థాలు, జలాలను శుద్ధి చేశాకే బయటకు వదలాలి. ఇది భారీ వ్యయంతో కూడుకున్నది కావడంతో యజమానులు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. ఈ వ్యవహారం అక్రమం కావడంతో వాహనదారులు తక్కువ దూరమైనా ట్రిప్పునకు రూ.60వేల వరకూ డిమాండ్ చేస్తున్నారు. ఒక్కోసారి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు.

**పీసీబీ ఏం చేస్తోంది?..** వ్యర్థ జలాలను ఇష్టారీతిన తరలించకుండా పీసీబీ నిబంధనలున్నాయి. సంబంధిత ట్యాంకరు ముందస్తుగానే అనుమతి తీసుకోవాలి. అందులో ఏముందో పెద్ద అక్షరాలతో రాయాలి. ఉ.6 నుంచి సా.6 గంటల్లోపే రవాణా చేయాలి. పీసీబీ పర్యవేక్షణ లోపం కారణంగా ఇవేవీ అమలుకావడం లేదు.

**శుద్ధి కేంద్రాలకు తరలించడంలో నిర్లక్ష్యం..**

మల్లాపూర్ పారిశ్రామికవాడలో 700 పరిశ్రమలుండగా..స్థానిక వ్యర్థాలను బోడుప్పల్ పరిధిలోని ఈటీపీకి తరలించాలి.ఇక్కడ 200 పరిశ్రమలు నమోదవ్వగా..రోజూ 45 కారా?నాల నుంచి వ్యర్థాల ట్యాంకర్లను పంపుతున్నారు.జీడిమెట్ల ఈటీపీను సేకరణ, శుద్ధి, పారబోత పద్ధతిలో నిర్వహిస్తుండగా..1200 పరిశ్రమల్లో 300 మాత్రమే శుద్ధికి పంపుతున్నాయి.

# ముందు ఒక మురా.. వెనకాలే అసలు ఆట!

సత్తుపల్లి : సత్తుపల్లి నియోజకవర్గంలో ఇసుక దందా జోరుగా సాగుతోంది. అక్రమార్జనే ధ్యేయంగా ఏపీ, తెలంగాణకు చెందిన కొందరు ఏపీలోని కృష్ణా, గోదావరి నదుల నుంచి ఇసుకను సత్తుపల్లికి తరలిస్తున్నారు. వేంసూరు, సత్తుపల్లి, పెనుబల్లి మండలాల పోలీసుల దాడుల్లో లారీలు పట్టుబడుతున్నా ఏమాత్రం లెక్కచేయకుండా నిరంతరం ఇసుక దందా కొనసాగిస్తూనే ఉన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో తరలిస్తున్న ఇసుకనూ ఇతర గుత్తేదార్లు, బిల్డర్లకు రవాణా చేస్తూ భారీగా సొమ్ము దండుకుంటున్నారు.

**అధిక లోడుతో ఇసుక తరలిస్తూ..**

30 టన్నుల సామర్థ్యం ఉన్న టిప్పర్లలో, లారీల్లో 50 టన్నుల వరకూ ఇసుక తరలిస్తున్న వాహనాలను ఇటీవల సత్తుపల్లి, వేంసూరులలో ఎంవీఐ దాడులుచేసి కేసులు నమోదు చేశారు. సత్తుపల్లి, పెనుబల్లి మండలాల్లో 8 లారీలపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అధిక లోడుతో రోడ్లు సైతం శిథిలమవుతున్నాయి.

**అక్కడ 150.. ఇక్కడ 1300**

ఏపీలో ఇసుక టన్ను రూ.150కి కొనుగోలు చేస్తూ సత్తుపల్లి, చుట్టుపక్కల ప్రాంతాల్లో టన్ను రూ.1100 నుంచి రూ.1300 వరకు విక్రయిస్తున్నారు. అక్రమ వ్యాపారంలో లారీల యజమానులకు వినియోగదారులకు మధ్య దళారీలు పుట్టుకురావడంతో దందా మరింత పెరిగిపోయింది. దళారులు ఇసుక లారీలకు ఒక్కో ట్రిప్పునకు రూ.5వేల నుంచి రూ.6 వేల వరకు కమీషన్లు దండుకొంటున్నారు.



**వేంసూరు మీదుగా పలు దారుల్లో..**


ఏపీలోని విజయవాడ నుంచి ఇసుకను పలు మార్గాల ద్వారా వేంసూరు మీదుగా తరలిస్తున్నారు. అడపాదడపా వేంసూరు పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా.. రవాణా ఆగడంలేదు. ఎక్కువగా రాత్రుళ్లు తరలుతున్న లారీలకు ఎస్కార్ట్‌గా కొందరు వ్యక్తులు ముందుగా ప్రయాణిస్తూ పోలీసులు లేరని నిర్ధారించాక రవాణా సాగుతోంది. కేసులు నమోదు చేస్తే పలుకుబడితో కొందరు తప్పించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. పోలీసులు, టాస్క్‌ఫోర్స్ యంత్రాంగం కేవలం లారీలపైనే కాకుండా దళారీ వ్యవస్థనూ నిరోధించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

సత్తుపల్లి సబ్‌డివిజన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచామని, అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలు, టిప్పర్లపై పలుమార్లు కేసులు నమోదు చేశామని ఏసీపీ ఎ.రఘు తెలిపారు. ప్రస్తుతం పలు మార్గాల్లో గస్తీని పెంచి అక్రమ రవాణాను అడ్డుకుంటామన్నారు.

# రెండు దశాబ్దాల ఎదురుచూపులు

ఖమ్మం: పూర్తి మెట్ట ప్రాంతమైన కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో చెరువులు నింపి సుమారు 3వేల ఎకరాల ఆయకట్టుకు నీరందిచేందుకు ఉద్దేశించిన బుగ్గవాగు ప్రాజెక్టు 20 ఏళ్లుగా కాగితాల్లోనే మగ్గుతోంది. ఉన్నత స్థాయిలో హైడ్రాలిక్ క్లియరెన్స్‌లు వచ్చినా ప్రాజెక్టు నిర్మాణం కొలిక్కిరావటం లేదు.

బుగ్గవాగు ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గ్రావిటీ ద్వారా నీరు మళ్లించేందుకు కాలువలు తవ్వాలని, ఇందుకు భూసేకరణ చేయాలని గత ప్రభుత్వ హయాంలో అధికారులు ప్రతిపాదించారు. రూ.40 కోట్ల అంచనాతో టెండర్లు నిర్వహించారు. 25 కి.మీ. పొడవున కాలువలు తవ్వేందుకు సుమారు 100 ఎకరాలకు పైగా భూసేకరణ చేయాల్సి ఉండగా రైతులు అంగీకరించలేదు. భూములివ్వమని ఏజెన్సీలో గిరిజనులు ససేమిరా మొండికేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భూసేకరణకు ప్రత్యామ్నాయంగా పైపులైన్లు నిర్మించి నీటిని తరలించే అవకాశాలు పరిశీలించాలని ఇటీవల ఆదేశించారు. భూమిలో పైపులైన్ నిర్మించి నీటిని మళ్లించేందుకు తాజాగా రూ.97 కోట్ల అంచనాతో ప్రతిపాదన రూపొందించి పంపించారు. **గత ప్రతిపాదనలు రద్దు..** గత ప్రభుత్వ హయాంలో టెండర్లు దక్కించుకున్న ఖమ్మంకు చెందిన గుత్తేదారు ఇటీవల ఒప్పందం రద్దు చేయాలని అధికారులకు లేఖ అందించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ అధికారులు నివేదిక పంపారు. ఇదే సమయంలో ప్రాజెక్టు నూతన ప్రతిపాదనలూ ప్రభుత్వానికి అందించారు. ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణానికి గతంలో మంజూరు చేసిన రూ.40 కోట్లు అందుబాటులో ఉన్నాయి.



**ప్రాజెక్టు స్వరూపం**

సింగరేణి మండలం గేట్ కారేపల్లి సమీపంలో బుగ్గవాగుపై చెక్‌డ్యాం నిర్మించాలి. అక్కడి నుంచి నీటిని కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో 31 చెరువులకు మళ్లించటం ద్వారా సుమారు 3వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ అవుతుంది. కామేపల్లి మండలంలో పింజరమడుగు, నెమలిపురి, గోవింద్రాల, కొమ్మినేపల్లి, రఘునాథపాలెం మండలం కోటపాడు, పాపటపల్లి, కోయచెలక, శివాయిగూడెం, రఘునాథపాలెం, మంచుకొండ, బూడిదంపాడు తదితర గ్రామాల్లోని చెరువుల్లోకి నీటిని మళ్లిస్తారు. ఇందుకు 38 కి.మీ. పొడవైన పైప్‌లైన్ నిర్మించనున్నారు.

**ప్రధానంగా కామేపల్లికి..**

సాగునీటి వసతి లేని రఘునాథపాలెం మండలంలో మంచుకొండ ఎత్తిపోతల రూపంలో 30పైచిలుకు చెరువులకు సాగర్ నీరు అందించే పనులు కొలిక్కి వస్తున్నాయి. ఈ ఎత్తిపోతలలో లబ్ధి పొందే కొన్ని చెరువులు పూర్వ బుగ్గపాడు ప్రాజెక్టు పరిధిలో ఉన్నా రెండు పథకాల రూపంలో కరవు నేలకు రెండు పంటలా నీరందే అవకాశం ఉంది. అంతకంటే ముఖ్యంగా ఎలాంటి నీటి వనరులేని కామేపల్లి రైతులకు బుగ్గపాడు ప్రాజెక్టు ఎంతో అవసరం.

చురకలు



## ఖాళీగా షెడ్లు.. ఇరుకుగా రోడ్లు

కరీంనగర్: జిల్లాలోని నగర, పురపాలికల్లో వీధివ్యాపారుల కోసం సౌకర్యాలు కల్పించి 'ఆత్మనిర్భర్' నింపాలనే లక్ష్యంగా ముందుకెళ్తున్నా.. ఆచరణలో సాధ్యం కావడం లేదు. రహదారులపై చిరు వ్యాపారం సాగించకుండా షెడ్లు నిర్మిస్తున్నా వ్యాపారులు ఆసక్తి చూపడంలేదు. రోడ్లే అడ్డాలుగా మలుచుకోవడం, ఉన్న చోటనే వాటిని నిర్మించాలని కోరుతుండటంతో ప్రాంతాల్లో స్థలం దొరకడంలేదు.

నెరవేరని ప్రభుత్వాల లక్ష్యం

వీధివ్యాపారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ కింద రుణాలు ఇస్తుండగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. పక్కా అడ్డాలు లేకపోవడంతో రోడ్ల మీద దుకాణాలకు ఎదురుగా కూర్చొని అమ్ముతుండగా ప్రైవేటు దుకాణాల యజమానులు అద్దె వసూలు చేస్తున్నారు. పురపాలికలు చూపించే షెడ్లలోకి వెళ్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కానీ వారు వెళ్లడంలేదు. పథకం లక్ష్యం నెరవేరడంలేదు.

**అయిదు చోట్ల ఖాళీ**

పండ్ల మార్కెట్‌కు బస్టాండ్ వెనక రూ.17 లక్షలతో వెండర్ జోన్



ఏర్పాటు చేస్తే అక్కడికి వెళ్లకపోవడంతో ఇతరులకు కేటాయించారు. రూ.30 లక్షలతో ఇందిరానగర్‌లో నిర్మించగా ఒకరిద్దరు మినహాయించి వ్యాపారులు ఎవరూ ఉండటం లేదు.

రూ.23 లక్షలతో చైతన్యపురిలో నిర్మించగా ఒక్కరూ ఉండటం లేదు. బ్యాంకుకాలనీ రహదారిపై దుమ్ము, ధూళిలో కూరగాయలు, పండ్లు అమ్ముతున్నారు. రూ.25 లక్షలతో హౌసింగ్‌బోర్డుకాలనీలో మార్కెట్ నిర్మించగా అది నిరుపయోగంగా ఉంది. వెంకటసాయి థియేటర్ ఎదురుగా, పాతబజారులో కూర్చొనే వీధివ్యాపారులకు దీనిని నిర్మించారు. శ్రీనగర్, సప్తగిరికాలనీలో రూ.40 లక్షలతో నిర్మించగా ఉదయం ఒకరిద్దరు ఉంటున్నారు. టెలిఫోన్ క్వార్టర్స్ రోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా వీధి వ్యాపారం చేస్తున్నారు.

**ఇలా చేస్తే ప్రయోజనం**

ఏ ప్రాంతం వారిని ఆ ప్రాంతంలోనే ఖాళీగా ఉన్న మార్కెట్లు, షెడ్లలోకి పంపించాలి. రహదారులకు ఇరువైపులా చిరు వ్యాపారులు అడ్డాలు పెట్టకుండా కట్టడి చేయాలి. నాలుగు చక్రాలు, తోపుడుబండ్లను కూడా అదే ప్రాంతానికి తరలించాలి. దీ రహదారులపై కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులు దొరకకపోతే ప్రజలు కూడా షెడ్ల వద్దకు వస్తారు.

## దెబ్బతిన్న వంతెన.. నరకయాతన

ముస్తాబాద్: రాజన్న సిరిసిల్ల-సిద్దిపేట జిల్లాల సరిహద్దు గ్రామాలైన మోహినికుంట-రాజక్కపేట మధ్యనున్న వంతెన అంచు కోతకు గురైంది. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గం మీదుగానే రెండు జిల్లాల వాహనదారులు సిద్ధిపేట జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించగా.. బిల్లులు సకాలంలో రాకపోవడంతో మధ్యలోనే నిలిచిపోయాయి. పనులు ముందుకు సాగేలా చొరవ చూపాలని ఇరు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

**రూ.1.80 కోట్ల నిధులు మంజూరు**

రాజక్కపేట కొత్తచెరువు నుంచి వంతెన కిందుగా వాగు ద్వారా నీరు మోహినికుంట, మద్దికుంట చెరువు నిండుకొని.. ముస్తాబాద్ చెరువుల్లోకి చేరుతాయి. అయితే ఇరుగ్రామాల మధ్యనున్న వంతెన శిథిలావస్థకు చేరడంతో ఎంఆర్ఆర్ (మెయింటెనెన్స్ రూరల్ రోడ్డు) ద్వారా దాదాపు రూ.1.80 కోట్లు వరకు మంజూరైనట్లు సమాచారం. సంబంధిత అధికారులు మాత్రం పనుల వివరాలను వెల్లడించడంలేదు. వంతెన మరమ్మతుల కోసం నిధులు విడుదలయ్యాయా లేదా నూతన వారధి నిర్మాణానికి మంజూరయ్యాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

**కోతకు గురైన వారధి రోడ్డు**

నిత్యం లింగన్నపేట నుంచి చిన్నబీకోడ్, మద్దికుంట, మోహినికుంట గ్రామాలతోపాటు సిద్ధిపేట జిల్లా రాజక్కపేట పరిసర గ్రామాల ప్రజలు



ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు వంతెన వద్ద రోడ్డు కోతకు గురవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అలాగే తాత్కాలిక రోడ్డు కోసం వేసిన పైపులు అక్కడే నిరుపయోగంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఇరు జిల్లాల వాహనదారులు కోరుతున్నారు.

**పనులు జరిగేలా చూడాలి**

మెర్గు లింగం, మోహినికుంట

రెండు జిల్లాలకు చెందిన వందలాది వాహనదారులు ఈ రోడ్డు మీదుగా తక్కువ దూరంతో వెంకట్రావుపల్లె మీదుగా సిద్దిపేట జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన ఇప్పటికే శిథిలావస్థకు చేరుకుంది. వెంటనే పనులు జరిగేలా చూడాలి.

**గుత్తేదారుకు సూచిస్తాం**

గత ప్రభుత్వ హయాంలో ఎంఆర్ఆర్ కింద నిధులు మంజూరయ్యాయి. సదరు కాంట్రాక్టర్ పనులు చేయడానికి ముందుకు రావడంలేదు. పనులు చేయాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచిస్తాం.

సుదర్శన్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ

## నిధులు రావు.. నిర్మాణాలు సాగవు



గంగాధర మండలం గర్శకుర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా భవన నిర్మాణానికి రూ.21 లక్షలు కేటాయించగా రూ.6 లక్షలు మాత్రమే బిల్లు చెల్లించారు.

ఉప్పరమల్యాలలో రూ.13 లక్షలతో చేపట్టిన డైనింగ్ హాల్ పిల్లర్లు వేశారు. ఇందుకు రూ.5.50 లక్షలు ఖర్చు చేయగా, నిధులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారు అర్ధాంతరంగా వదిలేశారు.

చొప్పదండి బీసీ బాలికల పాఠశాలలో ఆరేళ్ల కిందట రూ.9 లక్షలతో అదనపు తరగతి గదులు నిర్మించారు. కేవలం రూ.1.50 లక్షలు మాత్రమే ఇవ్వగా మిగతా బిల్లు రాలేదని అర్ధాంతరంగా వదిలివేయడంతో తాత్కాలికంగా గోడలు పెట్టి తరగతులు నిర్వహిస్తున్నారు.

జిల్లాలోని చాలా పాఠశాలల్లో గత ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో చేపట్టిన పనులకు నిధులు కేటాయించకపోవడంతో అర్ధా.ంతరంగా నిలిచిపోయాయి. కొన్నిచోట్ల పూర్తయినా అప్పగించకపోవడంతో పాఠశాలల్లో సమస్యలు కొనసాగుతున్నాయి. అసంపూర్తి పాఠశాలల్లో విద్యార్థుల చదువులు సజావుగా సాగడం లేదు. సదుపాయాలు లేక విద్యార్థులు వెనుకబడిపోతున్నారు.

**పెండింగ్‌లో రూ.3.70 కోట్లు..**

2021-22లో చేపట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమం కింద కరీంనగర్ జిల్లాలో 230 ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పనులకు ఎంపిక చేయగా, 214 పాఠశాలల్లో పనులు చేపట్టారు. వాటికి రూ.31.99 కోట్లు అవసరమని ఇంజినీరింగ్ శాఖల అధికారులు అంచనా వేశారు. 2023 ఆగస్టులోపు ఈ పనులు పూర్తి కావాల్సి ఉంది. బిల్లుల చెల్లింపుల జాప్యంతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 'అమ్మ ఆదర్శ పాఠశాలల' కార్యక్రమంతో పలు పాఠశాలల్లో అభివృద్ధి పనులు మొదలుపెట్టింది. ఈ పనులు పూర్తై విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సదుపాయాలు సమకూరాయి. గత ప్రభుత్వం చేపట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమం కింద ఎంపికైన పలు పాఠశాలల్లో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. అధికారుల లెక్కల ప్రకారం 180 పాఠశాలల్లో పనులు పూరైనట్లు అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. చేసిన పనులకు సుమారు రూ.3.70 కోట్లు రావాల్సి ఉంది. బిల్లుల మంజూరు చేయాలని ఇటీవల జిల్లా కలెక్టర్‌తోపాటు ఇన్‌ఛార్జి మంత్రిని కలిసి గోడు వెళ్లబోసుకున్నారు.

## ఆటల మాస్టారు కొలువుల బాటేశారు



మల్యాల : ఆయన ఓ ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు.. సొంతూరి నుంచి 2 కిలోమీటర్ల దూరంలో విధులు.. నిత్యం బడిలో పిల్లలతో క్రీడా సాధన చేయించడంతోనే సరిపెట్టుకోలేదాయన.. నిత్యం వేకువజామునే లేచి స్వగ్రామంలోని పాఠశాల బాట పడతారు.. యువతకు దేహ దారుఢ్య శిక్షణ ఇస్తూ పోలీసు కానిస్టేబుల్, ఆర్మీలో ఎంపికయ్యేలా సన్నద్ధం చేస్తుంటారు.. తన వద్ద శిక్షణ పొందిన వారిలో ఇప్పటివరకు పదుల సంఖ్యలో కొలువులకు ఎంపికయ్యారు.. మల్యాల మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన గంగాసాగర్ ఇదే మండలంలోని తాటిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఉద్యోగంలో చేరకముందు నుంచే 2016లో గ్రామంలోని యువతకు స్వచ్ఛంద శిక్షణ ప్రారంభించారు. గతంలో తరచూ 'స్వాధ్యాయ పరివార్' తరగతులకు హాజరయ్యేవారు. తోటివారికి సాయం అందించాలన్న ఆలోచనతో స్వగ్రామంలోని స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో వివిధ రకాల వ్యాయామాలు చేయిస్తున్నారు.

**నిత్యం రెండు గంటల తర్ఫీదు**గంగాసాగర్ ప్రతి రోజూ ఉదయం పాఠశాల మైదానంలో రెండు గంటల పాటు యువతీ యువకులకు శారీరక దారుఢ్య శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా ఆర్మీ ఉద్యోగార్థులకు 'పుల్ అప్', 5.30 నిమిషాల్లో 1600 మీటర్ల దూరం పరుగెత్తేలా మెళకువలు నేర్పిస్తున్నారు. కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న వారికి 1600 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్‌లో శిక్షణ ఇస్తున్నారు. మల్యాల, పెగడపల్లి, గొల్లపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల యువత తక్కళ్లపల్లి ఉన్నత పాఠశాలలోని మైదానికి చేరుకొని గంగాసాగర్ శిక్షణలో ఆయా అంశాల్లో రాటుదేలుతున్నారు.

**300 మందికి పైగా శిక్షణ**

ఇప్పటివరకు దాదాపు 300 మందికి పైగా గంగాసాగర్ ఉచిత శిక్షణ అందించగా 53 మంది ఉద్యోగాలు సాధించారు. వీరిలో 30 మంది కానిస్టేబుళ్లుగా, 22 మంది ఆర్మీలో, ఒకరు నేవీలో కొలువులకు ఎంపికవడం విశేషం. శిక్షణకు అవసరమైన హర్డిల్స్, లాడర్, డంబెల్స్‌ను గంగాసాగర్ స్వయంగా సమకూరుస్తున్నారు. ఆర్మీ, కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రకటన వెలువడగానే వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగార్థులు తక్కళ్లపల్లికి వచ్చి ఆయన ఆధ్వర్యంలో శిక్షణ ప్రారంభిస్తారు.

**యువత చెడు దారి పట్టకూడదన్నదే లక్ష్యం**

యువత దురలవాట్ల బారిన పడకుండా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్న ఆలోచనతో ఆర్మీ, కానిస్టేబుల్ నియామక సమయంలో యువతీ, యువకులకు ఉచిత శిక్షణ ఇస్తున్నా. ప్రస్తుతం తాటిపల్లి పాఠశాలలో పీఈటీగా పని చేస్తూనే స్వగ్రామంలోని పాఠశాల మైదానంలో ప్రతి రోజు రెండు గంటలు దేహ దారుఢ్య మెలకువలు నేర్పిస్తున్నా. యువత చెడు దారి పట్టకుండా జీవితంలో స్థిరపడితే సమాజం ప్రశాంతంగా ఉంటుంది.

గంగాసాగర్, వ్యాయామ ఉపాధ్యాయుడు

## నిబంధనలకు తిర'కాసు'

హైదరాబాద్: గ్రేటర్ పరిధిలో 83 లక్షలకుపైగా వాహనాలున్నాయి. వాటిలో 15శాతం అంటే 1.2లక్షల వాహనాలు 15 ఏళ్ల పైబడినవే. గ్రేటర్‌లో 350 కాలుష్య తనిఖీ కేంద్రాలున్నాయి. లైసెన్సు లేనివి రెండు రెట్లు ఉంటాయని అంచనా. నిబంధనల ప్రకారం.. కాలుష్య తనిఖీ కేంద్రాల్లో వాహనాలను భౌతికంగా పరిశీలించి..ఇంజిన్ ఆన్ చేసి ప్రోబ్‌ను ఎగ్జాస్ట్ పైప్‌లో ఉంచి కాలుష్య తనిఖీ చేపట్టాలి. అనేక కేంద్రాల్లో ఇష్టానుసారం డబ్బుల వసూలు చేసి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. కాలం చెల్లిన వాహనాలతో పీఎం 2.5 ఉద్గారాల స్థాయి పెరుగుతోంది. అర్బన్ ఎమిషన్స్ గ్రూపు తెలిపిన వివరాల ప్రకారం..గ్రేటర్‌లో ఏటా 8,250 టన్నుల పీఎం 2.5 ఉద్గారాలు వెలువడుతున్నాయి.


**గ్రేటర్ పరిధిలో..**

ద్విచక్ర వాహనాలు: 55 లక్షలు

కార్లు: 15 లక్షలు

ప్రతి నెల కొత్తగా వచ్చేవి: 2500


"పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ (పీయూసీ) కావాలా..?.డోర్ స్టెప్ సేవలందిస్తాం...మమ్మల్ని సంప్రదించండి' అంటూ ఆన్‌లైన్ ప్రకటన చూసిన సాగర్ అందులో ఉన్న నంబరుకు ఫోన్ చేశాడు. ఓ కారు, 2 ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. అక్కడి వరకు రాలేం.. బేగంపేట్‌కి 5 కిలోమీటర్ల దూరంలో అయితే




వస్తామని సమాధానం వచ్చింది. ఆలోచిస్తున్న క్రమంలోనే..'మీ వాహనాల రిజిస్ట్రేషన్ నంబరు కనిపించేలా ఫొటోలు, రీడింగ్ వివరాలు పంపితే ధ్రువపత్రం జారీ చేసి పంపుతాం' అంటూ సదరు ప్రతినిధి ఆఫర్ ప్రకటించాడు. వాహనాలు తనిఖీ చేయకుండా ఎలా అని ప్రశ్నించగా అదంతా మేం చూసుకుంటామని ఫోన్ పెట్టేశాడు"ఆర్టీఏ అధికారుల కళ్లు గప్పి సంచార కాలుష్య తనిఖీ కేంద్రాల్లో ధ్రువపత్రాల జారీ ఎలా జరుగుతుందో సాగర్ అనుభవమే నిదర్శనం.

## ఇందిరమ్మ ఇల్లు.. చిత్రాలతో బిల్లు

నాంపల్లి,: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించిన యాప్‌లో కొత్త ఐచ్ఛికం వచ్చింది. బిల్లుల కోసం ప్రతిపాదనలు పంపడంలో ఎదురవుతున్న జాప్యాన్ని నివారించేందుకు లబ్ధిదారులకే చిత్రాలను అప్‌లోడ్ చేసే అవకాశాన్ని కల్పించింది. లబ్ధిదారుల ఇంటి నిర్మాణ చిత్రాలను నేరుగా యాప్‌లో పంపించే సదుపాయం కల్పించడంతో ఇకపై అధికారుల కోసం నిరీక్షించాల్సిన అవసరం లేదు. ఇల్లు నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి నిర్మాణ దశలను గ్రామ పంచాయతీ కార్యదర్శి చిత్రాలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అవి గృహనిర్మాణశాఖ ఏఈ లాగిన్‌కు అటు నుంచి డీఈ, పీడీ తర్వాత కలెక్టర్‌కు వెళ్తాయి. బేస్‌మెంట్ పూర్తయితే రూ.లక్ష, గోడల దశలో మరో రూ.లక్ష, స్లాబు పూర్తయితే రూ.2 లక్షలు, నిర్మాణం పూర్తయి రంగులు వేశాక మరో రూ.లక్షల చొప్పున మొత్తం రూ.5 లక్షలు విడతల వారీగా లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో జమవుతాయి. ఈ ప్రక్రియలో ఆలస్యం కావడం, కొందరు అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో చిత్రాలను అప్‌లోడ్ చేసే అవకాశం లబ్ధిదారులకే ఇచ్చారు. కాకపోతే పైఅధికారులు ఆయా చిత్రాలు నిజమైనవేనా అని క్షేత్రస్థాయిలో విచారణ చేపడతారు.




లబ్ధిదారులు చరవాణిలో ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. లాగిన్‌కు వెళ్లి తమ పేరు, చరవాణి నంబరు, గ్రామం వివరాలను నమోదు చేయాలి. ఇంటి నిర్మాణం ఏ దశలో ఉందో చిత్రం తీసి అప్‌లోడ్ చేయాలి. నిర్మాణ దశలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానం ఇస్తే ప్రక్రియ పూర్తవుతుంది.

**వాస్తవ ఫొటోలే అప్‌లోడ్ చేయాలి**

కె.నాగేందర్‌గౌడ్, డీఈ, గృహనిర్మాణ శాఖ

ఇళ్ల యాప్‌కు సంబంధించి లబ్ధిదారులకు త్వరలో అధికారులు అవగాహన కల్పిస్తారు. ఇందులో వాస్తవ చిత్రాలే నమోదు చేయాలి. తప్పుడు వివరాలు నమోదు చేస్తే విచారణలో బయటపడుతుంది. ఏవైనా సమస్యలుంటే టోల్‌ఫ్రీ నంబరు 1800 5995 991కు తెలియజేయవచ్చు.

## విధులకు వి'ముఖం'..!

సూర్యాపేట : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వ అధికారులు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. గ్రామం నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు తమకు కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తేనే లక్ష్యం నెరవేరుతుంది. కాగా కొందరు ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఆలస్యం అవుతోంది. గ్రామాల్లో, మండలాల్లో ఉద్యోగులు ఇలా వ్యవహరిస్తేనే శాఖాపరంగా చర్యలు తీసుకుంటున్నారు. అలాంటిది ఏకంగా కలెక్టర్ నిత్యం అందుబాటులో ఉండే కలెక్టరేట్‌లోనే ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల పలు శాఖలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేయగా ఆలస్యంగా వచ్చిన పలువురు ఉద్యోగులను సస్పెండ్ చేయడంతో మిగతారు అప్రమత్తమయ్యారు.

**సమయ పాలన కరవు...**

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కొందరు ఉద్యోగులు ఇష్టానుసారంగా విధులకు హాజరవుతుండటంతో ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని ప్రవేశపెట్టారు. అందులో పని చేసే ప్రతి ఒక్కరూ




ఈ విధానం ద్వారా హాజరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ పలుమార్లు ఆదేశాలు జారీచేశారు. అంతే కాకుండా తమ శాఖ కార్యాలయంలోనూ రిజిస్టర్‌లో సంతకం చేయాల్సి ఉంటుంది. రిజిస్టర్ విధానం ద్వారా ఇష్టానుసారంగా హాజరైన ఉద్యోగులు ముఖ గుర్తింపు విధానాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. సమయానుకూలంగా విధులకు హాజరయ్యేందుకు చాలామంది సానుకూలత చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కొందరు ఉద్యోగులు నేటికీ ముఖ గుర్తింపు విధానాన్ని నమోదు చేసుకోవడం లేదని తెలుస్తోంది. కేవలం రిజిస్టర్‌లోనే సంతకం చేస్తుండగా విధుల్లో సమయపాలన పాటించడం లేదు. ఈ విషయమై ఆ శాఖ ఉన్నతాధికారులు సైతం పట్టింపు లేకుండా వ్యవహరిస్తుండటం గమనార్హం. ఇప్పటికైనా తమ పంథాను మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ తెలిపారు. తనిఖీల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిని సస్పెండ్ చేస్తూ హెచ్చరికలు జారీ చేశారు.

# మాయ చేస్తారు.. లాగేస్తారు

భీమవరం : భీమవరం ఒకటో పట్టణ పోలీసులు వలపన్ని పట్టుకున్న చరవాణుల అపహరణ ముఠా గుట్టురట్టుతో ఆసక్తికర విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఒక్క ప్రాంతానికే ముఠాలు పరిమితం కావని, రాష్ట్రంలోని పలుచోట్ల బృందాలుగా ఉంటూ చోరీలు చేయిస్తూ.. అపహరించిన చరవాణులను సేకరించుకుంటాయని విచారణలో వెల్లడైంది. ఇలాంటి ముఠాల ఆటకట్టించేందుకు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీసు బృందాలను నియమించారు. తెర వెనుక ఉంటూ చరవాణుల్లోనే కథ నడిపిస్తున్న ముఠా నాయకులను పట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. చరవాణులు పోతే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్‌లో నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులను ఆదేశించారు.

ఒడిశా ముఠాలు చిన్నారులను పావులుగా వాడుకుంటాయి. వాళ్లతో దొంగతనం చేయించాక వస్తువును ముఠా సభ్యులు తీసుకెళ్లిపోతారు. ఒక్కోసారి పిల్లలు దొరికిపోతే కొందరు దెబ్బలు కొట్టి వదిలేస్తారు. ఒకవేళ పోలీసులకు అప్పగించినా.. సముదాయించే వ్యక్తి ఒకరు వచ్చి.. నచ్చజెప్పి తీసుకెళ్లిపోతారు. పట్టుబడిన పిల్లలెవరూ ముఠా నిజాలు బహిర్గతం చేయకపోవడం విశేషం. భీమవరం, తణుకు ప్రాంతాల్లో ఇటీవల ఇద్దరిని పోలీసులు విడిచిపెట్టకుండా జువెనైల్



హోంకు పంపించారు.

**క్షణాల్లో పని కానిచ్చి..**

ఆకివీడు, గోకవరం, తాడేపల్లిగూడెం యాగర్లపల్లి, విజయనగరం జిల్లా చింతలవలస, తూర్పుగోదావరిలోని బిక్కవోలు తదితర ప్రాంతాలకు చెందిన ఒకే తెగకు చెందిన ముఠాలు ఇలాంటి చోరీల్లో ఎక్కువగా పాల్గొంటాయి. పురుషులు, మహిళలు పిల్లల్ని వెంటబెట్టుకుని వస్తారు. క్షణాల్లో పని కానిచ్చేసి తప్పించుకుంటారు.

**ఇతర రాష్ట్రాలకు ఎగుమతి**

దొంగిలించిన చరవాణులతో వేర్వేరు చోట్ల ఉన్నవాళ్లంతా ఓ చోటకు చేరతారు. వాటిని ప్రధాన సూత్రధారి అనుచరులు సేకరించి దొంగలకు నగదు ఇస్తారు. వాటిని కేరళ, పశ్చిమ బెంగాల్, గుజరాత్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు.

**మోసాల్లో అనేక రకాలు** జనం ఎక్కువగా ఉన్నచోట ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోతున్నట్టు నటిస్తాడు. ఆ సమయంలో సాయం చేసేందుకు వచ్చినవారికి తెలియ కుండా చరవాణి కొట్టేస్తాడు. ఒక్కోచోట రూ.50, రూ.100 పడేస్తాడు.. నడిచి వెళ్తున్న వారిని పిలిచి మీ జేబులో డబ్బులు పడిపోయాయి అనగానే అతడు వంగి తీసుకునేంతలో చరవాణి లాగేస్తారు. రద్దీగా ఉండే మార్కెట్‌లో దృష్టి అంతా సరకులపై ఉన్నవారిని, బస్సు ఎక్కే సమయంలో హడావుడిగా ఉన్నవారిని గుర్తించి అపహరిస్తారు. బాధితు డికి ఏమాత్రం అనుమానం రాకుండా అపహరించేందుకు, తీస్తున్నది కనిపించకుండా కాగితం, తువ్వాలు, పాలిథిన్ సంచో అడ్డం పెట్టుకుంటారు.

# నిధులు రాక.. సమస్యలు తీరక

గజపతినగరం : గత ప్రభుత్వ నిర్వాకం నేటికీ శాపంలా వెంటాడుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విద్యుత్తు, తాగునీరు, రన్నింగ్ వాటర్, పైకప్పు మరమ్మతులు, అవసరాల మేరకు చిన్న నిర్మాణాలు చేసుకునేందుకు నాడు- నేడు పథకంలో పనులు మంజూరు చేశారు. జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 16 పీహెచ్‌సీలకు రూ.5.62 కోట్లు విడుదలయ్యాయి. కొంతమేర పనులు చేసిన అనంతరం నిధులు రాకపోవడంతో గుత్తేదార్లు మధ్యలో వదిలేశారు.

భవనాలు కారిపోతున్నాయ్..

మూడు నుంచి ఆరు వరకు పనులను ఒక ప్యాకేజీగా పనులు అప్పగించారు. ముందుగా ప్రారంభించిన గుత్తేదారులు రంగులు వేశారు. అనంతరం విద్యుత్తు, రన్నింగ్ వాటర్, పైకప్పు శ్లాబు పనులు చేయించారు. మరుపల్లి, దత్తిరాజేరు, కె.కొత్తవలస, బొండపల్లి పీహెచ్‌సీల పైకప్పులు బాగులేవు. దీంతో పై పొర పనులు చేయించారు. నిర్మాణాల్లో నాణ్యత లోపించడంతో వర్షం కురిస్తే కారిపోతున్నాయి. దేవుపల్లి, మెంటాడలో సామగ్రి భద్రపర్చేందుకు, అత్యవసర సమయాల్లో



రోగులను వేరుగా ఉంచి వైద్యం చేయించేందుకు షెడ్లు నిర్మించారు. వీటికి విద్యుత్తు సౌకర్యం లేదు. తలుపులు వేయలేదు. కేంద్రాల్లోని మరుగుదొడ్లకు నీరు రాని పరిస్థితి.

సౌకర్యాల ఊసేలేదు..

నాడు- నేడులో పీహెచ్‌సీల్లో అదనపు గదుల ఏర్పాటును ఎక్కడా ప్రారంభించలేదు. ముందుగా మరమ్మతులు మాత్రమే చేశారు. మంచాలు, పరుపులు, ఇతర సౌకర్యాల విషయం పట్టించుకోలేదు. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. పేరుకే నిధులు వెచ్చించారని, వసతులు ఏమాత్రం పెరగలేదని సిబ్బంది, వైద్యులు అంటున్నారు. నిధులు రాకపోవడంతోనే పనులు నిలిపివేసినట్లు గుత్తేదారులు చెబుతున్నారు.

కొత్తగా మంజూరు కావాల్సిఉంది..నాడు- నేడు పథకంలో పీహెచ్‌సీలకు మంజూరు చేసిన నిధుల్లో మరమ్మతుల పనులు చేయించాం. మిగలినవి రద్దయ్యాయి. గుత్తేదారులకు నిధులు చెల్లింపులు చేశాం. కొత్త మంజూరులు వస్తే తప్ప మిగిలిన పనులు చేసే అవకాశం లేదు. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

# వేగ నిరోధకం.. వెన్నుపోటు



నంద్యాల : సాఫీగా సాగిపోయే ప్రయాణం.. ఒక్కసారిగా ఊహించని కుదుపులు.. ఇంకేముంది.. గాల్లో తేలినట్లుందే.. గుండె జారినట్లుందే అన్న రీతిన వాహనచోదకులు అడుగు ఎత్తులేచి రోడ్డుపై పడుతున్నారు.. ఆ వెంటనే అదుపుతప్పి బోల్తా కొడుతున్నారు. వెన్నుపూస దెబ్బతిని ఆసుపత్రి పాలవుతున్నారు.. ప్రమాణాలు పాటించకుండా.. సూచికలు ఏర్పాటు చేయకుండా వేస్తున్న వేగనిరోధకాలతో బళ్లూ, వాహనదారుల దేహాలు.. రెండూ గుల్లవుతున్నాయి.

**కట్టల్లా కట్టేస్తున్నారు**

వేగ నిరోధకాల నిర్మాణం ఇష్టారాజ్యంగా, నిబంధనలు పాటించకుండా ఎత్తుగా నిర్మిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 60 శాతం వరకు ఇలానే ఉన్నాయని ఇటీవల అధికారులు నిర్వహించిన సర్వేలో తేలింది. పట్టణ వీధుల్లో సీసీ రహదారులపై ఈ పరిస్థితి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఎవరి ఇళ్లముందు వాళ్లు అనధికారికంగా ఏర్పాటు చేసుకొంటున్నారు. జాతీయ రహదారులపై ఎక్కడా వేగ నిరోధకాలు ఏర్పాటు చేయకూడదు. కానీ కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం, బొగ్గులైన్, కలెక్టరేట్ వద్ద వీటిని నిర్మించారు.

ఎక్కడ నిర్మించాలంటే..

ప్రధాన రహదారిలో చిన్న మార్గాలు కలిసే చోట, జంక్షన్ల వద్ద విద్యా సంస్థలు, వైద్యశాలలు, వంతెనలు, మలుపులున్న ప్రాంతంలో నివాసాలెక్కువగా ఉండి పాదచారులు తిరిగే చోట

బళ్లూ.. ఒళ్లూ హూనం

ఎత్తుగా నిర్మించిన వేగ నిరోధకాలపై వెళ్తే కుదుపులకు శరీరభాగాలు దెబ్బతింటున్నాయి. లావుగా ఉన్నవారికి మరింత ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

అతివేగంగా వెళ్తూ ఒక్కసారిగా వేగ నిరోధకం ఎక్కించి బ్రేక్ వేయడంతో మెడ, వెన్నెముకపై ప్రభావం పడుతుంది. వెన్నుపూసలో కాట్‌జల్, డిస్క్‌లు దెబ్బతింటాయి. సయాటికాకు గురవుతున్నారు. ఇలాంటి బాధలతో నెలకు వంద మంది రోగులు కర్నూలు వైద్యాశాలకు వస్తుంటారని న్యూరో ఫిజీషియన్ విభాగం వైద్యులు చెబుతున్నారు.

వాహనాల ఇంజిన్లు వేగ నిరోధకాలకు తగిలి పగులుతున్నాయి. షాక్ అబ్జార్స్ విపరీతంగా దెబ్బతింటున్నాయి. టైర్లు అరిగిపోతున్నాయి.. బ్రేకుల సమస్య తలెత్తుతోంది.

నిబంధనలు ఏం చెబుతున్నాయి

ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ)) విధానం కచ్చితంగా పాటించాలి.

వాహనాల బంపర్లకు తగలకుండా ఉండాలి.

10 సెం.మీ. ఎత్తు, 3.7 మీటర్ల పొడవు, 1.7 మీటర్ల రేడియస్ (వ్యాసార్థం)తో నిర్మించాలి. ఫలితంగా గంటకు 25 కి.మీ. వేగాన్ని నిరోధకాలు అదుపు చేసేందుకు వీలుంటుంది.

వేగ నిరోధకానికి 40 మీటర్ల ముందే సూచికలు పెట్టాలి.

ఒకే రహదారిలో రెండు వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాల్సి వస్తే వాటి మధ్య దూరం 100-150 మీటర్లు కచ్చితంగా ఉండాలి.

# పండగ వంట.. కల్తీల తంట



కర్నూలు: దసరా పండగ వచ్చిందంటే.. ప్రతి ఇంటా సందడి నెలకొంటుంది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన కుమార్తెలు, అల్లుళ్లు.. బంధువులు వస్తారు. దీంతో ప్రతి కుటుంబంలో తమ స్థాయికి తగ్గట్టు పిండివంటలు చేసుకుని సంతోషంగా ఆరగిస్తారు. పండగ సమీపించడంతో చాలామంది మార్కెట్‌కు వెళ్లి అవసరమైన సరకులు కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు కల్తీ వస్తువులతో మార్కెట్‌ను నింపేశారు. నూనెలు, బెల్లం, మసాలా దినుసులు, నెయ్యి.. ప్రతీది కల్తీ చేసి విక్రయిస్తున్నారు. వీటితో తయారు చేసిన వంటలను తింటే అనారోగ్య సమస్యల బారినపడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో వినియోగదారులు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే.. కల్తీలను కనిపెట్టొచ్చని ఆహార నిపుణులు సూచిస్తున్నారు.

**రంగు మారుతోంది**

మార్కెట్‌లో కల్తీ చేసే వాటిలో నూనెలు మొదటి వరుసలో ఉంటాయి. హోల్‌సేల్ వ్యాపారులు నూనె ట్యాంకర్లను తెప్పించుకొంటున్నారు. వాటితో పాటు పత్తిగింజల నూనె, పామాయిల్, ఇతర నాసిరకం నూనెలు కలిపి ఆకర్షణీయమైన ప్యాకింగ్ చేసి మార్కెట్‌లోకి వదులుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రతినెలా సుమారు 8 వేల టన్నుల నూనెల విక్రయాలు జరుగుతున్నాయి. ఇందులో కల్తీ నూనెలే సుమారు 2 వేల టన్నుల వరకు ఉంటాయని అంచనా. 70 శాతానికి పైగా హోటళ్లలో నాణ్యమైన నూనె వాడటం లేదు.కల్తీని కనిపెట్టాలంటే.. కొద్దిగా నూనెను తీసుకుని 5 మి.లీ గాఢ హైడ్రోక్లోరిక్ ఆమ్లం, కాస్త చక్కెర కలిపితే అడుగున గులాబీ లేదా ఎరుపు రంగు ఏర్పడుతుంది. అలా జరిగితే అది నాసిరకమని గుర్తించాలి.

**బెల్లం.. అంతా మోసం**

పండగ వచ్చిందంటే చాలు ప్రతి ఇంట్లో బెల్లం ఉండాల్సిందే. నాణ్యమైన బెల్లం కిలో రూ.80- 120 ధర పలుకుతోంది. చక్కెరను కిలో రూ.40-45తో విక్రయిస్తున్నారు. దీంతో కొందరు చక్కెరతో అచ్చులను తయారుచేసి బెల్లం రంగు పూత పూస్తున్నారు. పంచదారతో చేసిన ఈ బెల్లం అచ్చులను కిలో రూ.50- 60తో విక్రయిస్తున్నారు. తక్కువ ధరకు లభిస్తుందని చాలామంది దీన్నే కొనుగోలు చేస్తున్నారు.

ఈ నాసిరకం బెల్లాన్ని గ్లాసు నీటిలో వేస్తే రంగుపోయి పంచదార అచ్చు ముద్దగా మారుతుంది. చక్కెర, కృత్రిమ రంగులతో తయారు చేసిన దీన్ని తినడం వల్ల క్యాన్సర్ బారినపడే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**తింటే వికారం**

రోజువారీ వంటల్లో తప్పనిసరిగా వాడే పదార్థాల్లో కారంపొడి ముఖ్యమైంది. రకరకాల పదార్థాలు, రసాయనాలు కలిపి నకిలీ కారం పొడులు తయారు చేస్తున్నారు. ఇందుకోసం మిరపకాయల తొడిమలు, చెక్క పిండి, రెడ్ ఆక్సైడ్, ఇతర ప్రమాదకరమైన రంగులు వినియోగిస్తున్నారు. వీటిని రకరకాల బ్రాండ్లతో విక్రయిస్తున్నారు. నాణ్యమైన కారం కిలో రూ.250 నుంచి రూ.300 ధర పలుకుతోంది. నాసిరకం కారం మాత్రం కిలో రూ.150- 200లోపే విక్రయిస్తున్నారు. దీంతో హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో దీన్నే ఎక్కువ వినియోగిస్తున్నారు. కిరాణా దుకాణాల్లో సైతం ఈ నాసిరకం కారం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

**ఫిర్యాదు చేయండి**

నాణ్యత లేని ఆహార పదార్థాలు, నకిలీ ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు తెలిస్తే.. 9441439787 నంబరుకు ఫోన్‌చేసి అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు. ఆహార భద్రతాధికారి ఫుడ్ ఇన్‌స్పెక్టర్లతో తనిఖీలు చేయించి బాధ్యులైన వారిపై చర్యలు చేపడతారు.

**మెరుపు ముంచేస్తుంది**

కొందరు వ్యాపారులు కంది, పెసర, మినుము వంటి పప్పు దినుసులకు మెరుపు వచ్చేలా నూనె పూస్తుంటారు. కేసరి పప్పునకు మెటానిల్ ఎల్లో రంగు కలుపుతారు. భూతద్దం సాయంతో దీనిని గుర్తించవచ్చు. పరీక్ష నాళికలో కొద్దిగా పప్పును తీసుకొని అందులో నీరు కలపాలి. వాటికి 5 మి.లీ గాఢ హైడ్రోక్లోరిక్ ఆమ్లం కలపాలి. పది నిమిషాల తర్వాత గులాబీ రంగులోకి మారితే అది కల్తీ అయినట్లు లెక్క. శనగపిండిలో బఠానీల పిండి కలిపేస్తున్నారు.

**నూనెలతో నెయ్యి**

నెయ్యిలో కొన్ని రకాల నూనెలు కలుపుతున్నారు. మంచి వాసన వచ్చేందుకు రసాయనాలు, సెంటు కలిపి తక్కువ ధరలకు అంటగడుతున్నారు. **అరటి బోదెల గుజ్జుతో అల్లం వెల్లుల్లి పేస్ట్**

ప్రస్తుతం మార్కెట్‌లో అల్లం, వెల్లుల్లి మిశ్రమం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో అక్రమార్కులు అల్లం, వెల్లుల్లితో పాలు అరటి కాండంతో చేసిన గుజ్జును కలిపి నాసిరకం మిశ్రమం తయారు చేస్తున్నారు.

# లస్కర్ల కొరత.. సాగునీటికి అవస్థ

రేగిడి : మడ్డువలస జలాశయం పరిధిలో లస్కర్ల వ్యవస్థ పటిష్ఠంగా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువల ద్వారా ఆయకట్టు శివారు భూములకు నీరు చేరేందుకు కీలకపాత్ర వహించే లస్కర్ల కొరతతో సాగునీరు చౌర్యానికి గురవుతోంది. ఎగువన ఉండే కర్షకులు నీటిని నిలిపివేస్తే.. కింద ఉండేవారికి అవస్థలు తప్పడంలేదు. లస్కర్లు ఉంటే వారబందీ ప్రకారం నీటిని మళ్లించేలా చూడటం, ఎక్కడ సమస్య ఉన్నా ఉన్నతాధికారులకు చేరవేసేందుకు వీలుంటుంది.

40 వేల ఎకరాల ఆయకట్టు..

జలాశయం నుంచి నీటిని విడుదల చేసిన తర్వాత ప్రధాన కాలువ నుంచి ఉప కాలువలకు అక్కడి నుంచి చిన్న కాలువలకు నీరుచేరేలా చూడాలి. మడ్డువలస కుడి ప్రధాన కాలువ 52.7 కిలోమీటర్ల పొడవున ఉండేది. దీనిపై ఆధారపడి 40 వేల ఎకరాలపైనే ఆయకట్టు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రతి 2 లేదా 3 మీటర్లకు ఒక లస్కర్ ఉండాలి. ఈ లెక్కన జలాశయం వద్ద, కాలువల పరిధిలో మొత్తం 32 మంది అవసరం. ప్రస్తుతం 8 మంది మాత్రమే ఉన్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ప్రతిపాదనలతో సరి

ఏటా లస్కర్ల విషయమై ప్రతిపాదనలు పంపుతున్నట్లు సమాచారం. కాలువల లైనింగ్, గట్లు పటిష్ఠ పర్చడం, ఉప కాలువల్లో పూర్తిస్థాయిలో పూడికలు తొలగించడం వంటి పనులకు వీరు అవసరం. లస్కర్లు కొరత వాస్తవమేనని మడ్డువలస డీఈ నాగేశ్వరరావు తెలిపారు. వారబందీ సమయంలో ఇబ్బందులు ఉంటున్నాయన్నారు. ప్రతిపాదనలు పంపుతున్నట్లు చెప్పారు.

# పరికరాలున్నాయ్.. సిబ్బందే లేరు

భీమవరం : పేద, మధ్య తరగతి వర్గాలకు అన్ని వైద్య సేవలు అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం ఖరీదైన అధునాతన వైద్య పరికరాలను సమకూర్చింది. వాటిని వినియోగించేవారు లేకపోవడంతో రోగులు ఆర్థిక ఇబ్బంది పడుతున్నారు. వైద్యులు రాసిచ్చిన చీటీ తీసుకుని ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. ల్యాబ్ పరీక్షలన్నా, ఎక్స్‌రే తీయించాలన్నా.. స్కానింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నా.. ప్రైవేటుగా రూ.1,200 నుంచి రూ.3,500కు పైగా ఖర్చవుతోంది. జిల్లాలోని ప్రాంతీయ ఆసుపత్రుల్లో వైద్య పరికరాల వినియోగంపై 'న్యూస్‌టుడే' పరిశీలించగా.. పలు విషయాలు బహిర్గతమయ్యాయి. వీరంతా భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలో ఎక్స్‌రే కోసం వేచి ఉన్నవారు. ఇక్కడకు గాయపడినవారు, ఇతరత్రా కారణాలతో ఎముకలు చిట్లినవారు ఎక్స్‌రే పరీక్షలకు రోజూ 15 నుంచి 23 మంది వస్తున్నారు. ఎక్స్‌రే తీసే రేడియోగ్రాఫర్ పోస్టు ఖాళీగా ఉండటంతో పరీక్షలు నిలిచిపోయాయి. ఎక్స్‌రే తీసేవారు వస్తారనుకుంటూ నొప్పి భరిస్తూనే ఆశతో రోగులు ఎక్స్‌రే గది దగ్గర ఇలా ఎదురుచూస్తున్నారు.

ప్రాంతీయ ఆసుపత్రిలో స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి. రేడియాల



జిస్ట్ లేకపోవడంతో గర్భిణులు, ఇతరత్రా సమస్యలతో వచ్చిన రోగులు స్కానింగ్‌కు ప్రైవేటు పరీక్ష కేంద్రాల వైపు వెళ్తున్నారు.

నరసాపురంప్రాంతీయ ఆసుపత్రిలోని వెంటిలేటర్ కొన్నేళ్లుగా ఉపయోగించడంలేదు. సాంకేతికంగా ఉపయోగించే సిబ్బంది లేరంటూ మూలకు చేర్చారు.

**అయిదేళ్లుగా గాలికొదిలేశారు**

గత తెదేపా ప్రభుత్వ హయాంలోనే ఆయా ఆసుపత్రులకు అధునాతన వైద్య పరికరాలు సమకూర్చారు. వాటి నిర్వహణను వైకాపా హయాంలో విస్మరించారు. పరికరాలు ఉపయోగించాల్సిన వైద్య, సిబ్బంది పోస్టులు ఖాళీ అయితే పట్టించుకోలేదు. సాంకేతిక సమస్యలు వస్తే వాటికి కనీసం మరమ్మతులు చేయించకుండా వినియోగం మరిచారు.

జిల్లాలో ప్రాంతీయ ఆసుపత్రులు- భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు

రోజూ ఆయా ఆసుపత్రులకు వైద్య పరీక్షలకు వచ్చే రోగుల సంఖ్య- 1250కుపైగాల్యాబ్, ఎక్స్‌రే ఇతరత్రా పరీక్షలు అవసరం ఉన్నవారు- 1050 మందికి పైగా**వినియోగంలోకి తీసుకొస్తాం..: డాక్టర్ పి.సూర్యనారాయణ, డీసీహెచ్‌ఎస్**


ప్రాంతీయ ఆసుపత్రుల్లో సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం. పరికరాలు వినియోగంపై అనుభవం ఉన్న వైద్యులకు పరికరాల బాధ్యత అప్పగించాలని సూచించాం. మరమ్మతులు వస్తే వెంటనే బాగు చేయించి వినియోగంలో ఉంచాలని ఆసుపత్రుల పర్యవేక్షకులకు చెప్పాం. సిబ్బంది కొరత ఉన్నచోట సమీపంలోని ఆసుపత్రుల నుంచి సర్దుబాటు చేస్తాం.

# అదిగో రబీ.. విత్తన రాయితీ ఏదీ!

కడప : రబీ పంట కాలం అక్టోబరు 1 నుంచి ప్రారంభం కానుంది. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు రాయితీలో విత్తనాలను పంపిణీ చేయాలని అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. అయితే ధరలు ఇంకా ఖరారు చేయలేదు. సేకరణ ప్రక్రియ కూడా ప్రారంభించలేదు. దీంతో అదునులో నాణ్యమైన విత్తనం అందుతుందా అనే అనుమానాలు అన్నదాతల్లో రేకెత్తుతున్నాయి.

**ప్రతిపాదనలతో సరిపుచ్చారు**

ఈ ఏడాది రబీ సీజన్‌లో వ్యవసాయ శాఖ ద్వారా అయిదు రకాల విత్తనాలను కర్షకులకు 45,758 క్వింటాళ్లు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సేకరణ, సరఫరా బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థకు అప్పగించారు. క్వింటా పూర్తి ధర, రాయితీ శాతం, రైతు ఎంత చెల్లించాలని ఇంకా ఖరారు చేయలేదు. ఇంతవరకు వంగడాలే ఆర్‌ఎస్‌కేలకు చేరలేదు. ముందస్తుగా ఇస్తే సాగుదారులకు



ఉపయుక్తంగా ఉంటుంది.

**అన్నదాతల ఎదురుచూపు**

కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, ముద్దనూరు, పులివెందుల, పోరుమామిళ్ల డివిజన్ల పరిధిలో నల్లరేగడి, మెట్ట భూములు అధికం. శనగ పంటను ఏటా 75 వేల హెక్టార్లకు పైగా సాగు చేస్తుంటారు. ఆ మేరకు ఇప్పటికే సేద్యపు పనులు ముమ్మరం చేశారు. మినుము, పెసర, వేరుసెనగ, నువ్వు పంటను కూడా ఎక్కువగానే పండిస్తుంటారు. రాయితీ వంగడాల కోసం ఎదురుచూస్తున్నారు.

**విత్తన పంపిణీకి ఇబ్బందులు రానీయం**

రబీలో రాయితీపై విత్తనాలు పంపిణీ చేయాలని నిర్ణయించాం. సేకరణ, సరఫరా బాధ్యతలను ఏపీ సీడ్స్‌కు అప్పగించాం. ధరలు ఖరారవ్వగానే తెప్పిస్తాం. రైతులు ఆర్‌ఎస్‌కేలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలి. ఇబ్బందులు రాకుండా ప్రత్యేకంగా దృష్టిసారిస్తాం. - చంద్రానాయక్, జిల్లా వ్యవసాయాధికారి

చురకలు



# టోకెన్లు దొరక్క.. ఇక్కట్లు తప్పక!

తిరుపతి : తిరుమల శ్రీవారి భక్తులకు జారీ చేసే సర్వదర్శన టోకెన్ల విషయంలో అనేక లోటుపాట్లు కనిపిస్తున్నాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. టోకెన్లు లేని వారంతా నేరుగా తిరుమల వైకుంఠం-2 కాంప్లెక్స్ వద్దకు చేరుకుని సాధారణ క్యూలైన్‌లో గంటల తరబడి నిరీక్షిస్తూ.. స్వామిని దర్శించుకుని వస్తున్నారు.

గతంలో ఉదయం నుంచి వేచి ఉన్న వారికి అర్ధరాత్రి 12 గంటలకు టోకెన్లు ఇచ్చేవారు. ఆ తర్వాత సాయంత్రం నాలుగు గంటలకు ఇవ్వడం ప్రారంభించారు. అయితే ఒకరోజు ముందుగానే టోకెన్లు జారీ చేయడంతో వృద్ధులు, పిల్లాపాపలతో వచ్చిన భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ఇలా చేస్తే మేలు..!**

టోకెన్ల సంఖ్యను బట్టి భక్తులను అనుమతించాలని, లేదా ముందుగా వచ్చిన వారికి జారీ చేసినా బాగుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. టోకెన్లు పొంది, మరుసటి రోజు ఉదయం దర్శనానికి



వేచి ఉండే భక్తుల వసతిపైనా తితిదే దృష్టి సారించాల్సి ఉంది.

శ్రీవారి మెట్టు మార్గంలో రోజూ 2 వేల నుంచి 3 వేల టోకెన్లు జారీ చేస్తున్నారు. పరిమితికి మించి భక్తులు క్యూలైన్‌లో వేచి ఉంటూ, ఆ తర్వాత టోకెన్లు దక్కకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలా కాకుండా టోకెన్ల సంఖ్యకు తగ్గట్టుగానే భక్తుల్ని క్యూలైన్‌లోకి అనుమతిస్తే ఇబ్బంది ఉండదు.

తిరుపతి నుంచి శ్రీవారి మెట్టు మార్గంలో తెల్లవారుజాము నుంచి ధర్మ రథాలతో పాటు ఆర్టీసీ సర్వీసులు అందుబాటులో ఉంచాలని, సర్వీసులు పెంచాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

# పారిశ్రామిక ప్రగతి.. యువతకు ఉపాధి

పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లాలో ప్రగతి ఊపందుకుంటోంది. తెదేపా హయాంలో పెనుకొండ మండలంలోని ఎర్రమంచి గ్రామ పరిధిలో కియా కార్ల పరిశ్రమ ప్రారంభమైంది. ప్రస్తుతం ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మంది ఉపాధి పొందుతున్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా 2019 నుంచి 2024 వరకు పరిశ్రమల ఏర్పాటును విస్మరించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో మళ్లీ పారిశ్రామిక కళ ఉట్టిపడుతోంది. పలు పరిశ్రమలు వస్తున్నాయి. రూ.21,168 కోట్లతో 30 భారీ పరిశ్రమల ఏర్పాటుతో ప్రత్యక్షంగా 35,126 మందికి ఉపాధి కల్పించేలా జిల్లా ఉన్నతాధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దల, పెనుకొండ మండలం అమ్మవరిపల్లి, గుడిపల్లి వద్ద పరిశ్రమలు త్వరలో ఉత్పత్తి ప్రారంభించనున్నాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి.



**అప్పుడు బెదిరింపు.. ఇప్పుడు పెద్దపీట**

నాడు వైకాపా ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు వచ్చేవారికి ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వలేదు. భూముల కేటాయింపు, అనుమతుల మంజూరు గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. ఎవరూ ఇటువైపు రాలేదు. కొన్నిటికి అనుమతులు వచ్చినా.. యజమానులను బెదిరింపులకు గురిచేయడంతో వారు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సంపద సృష్టికి పెద్దపీట వేయడంతో పారిశ్రామికవేత్తలను ఉత్తమ విధానాల ద్వారా ఆకట్టుకుంటోంది. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారికి సింగిల్ డెస్క్ పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. పెండిగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తోంది. దీంతో పరిశ్రమలు వరుసకడుతున్నాయి.

# వైకాపా విస్మరించింది.. కూటమి సర్కారు చక్కదిద్దింది

తనకల్లు : తనకల్లు, నల్లచెరువు మండలాలకు ప్రధాన నీటి వనరులైన చెన్నరాయస్వామిగుడి (సీజీ ప్రాజెక్టు)ని వైకాపా ప్రభుత్వం విస్మరించింది. కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని సీజీ ప్రాజెక్టు మరమ్మతులకు రూ. 34 లక్షల నిధులు మంజూరు చేయడంతో పలు మరమ్మతు పనులు ఊపందుకున్నాయి. కుడి, ఎడమ సాగునీటి కాలువల్లో పది కిలోమీటర్ల మేర ఏపుగా పెరిగిన ముళ్ల



పొదలను తొలగించి శుభ్రం చేయించారు. గేట్లకు పాత గ్రీజ్‌ను తొలగించి కొత్తగా వేశారు. కొన్నేళ్లుగా పేరుకున్న విద్యుత్తు బకాయిలు, ప్రాజెక్టు మరమ్మతులకు ఈ నిధులు వెచ్చించనున్నట్లు ఇరిగేషన్ ఏఈ బయప్ప తెలిపారు. గత వైకాపా పాలనలో ఆయకట్టు రైతులే సాగునీటి కాలువలను శుభ్రం చేసుకునే పరిస్థితి ఉండేది. గేట్లు తదితర మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయాలని అనేకమార్లు అధికారులు నివేదికలు పంపినా స్పందించిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# వెంటిలేటర్లపై పెద్దాసుపత్రులు



గుత్తి: గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి పట్టణాల్లోని ఆసుపత్రులు పేరుకే పెద్దాసుపత్రులు. తాడిపత్రి, గుంతకల్లులో ప్రాంతీయ ఆసుపత్రులు ఉన్నాయి. ఈ రెండు పురపాలికల్లోని ఆసుపత్రుల్లో వంద పడకలున్నాయి. గుత్తిలో మాత్రమే 52 పడకలున్నాయి. ఇక్కడ మాత్రం పడకల సంఖ్య పెరగడం లేదు. కేవలం సీహెచ్‌సీగానే కొనసాగుతోంది. రోజు వారి ఓపీ వందల్లో ఉంటోంది. రోగుల సంఖ్యకు తగ్గట్టుగా వైద్యులు లేరు.

**వందేళ్లుగా.. చిన్న ఆసుపత్రిగానే..**

గుత్తిలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో ఈసీజీ, ఎక్స్‌రే, రక్తపరీక్షల విభాగాలు ఉన్నాయి. ఇక్కడ బ్రిటీష్ హయాంలోనే సర్ థామస్ మన్రో పేరుతో ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. వందేళ్ల కిందట చిన్న డిస్పెన్సరీగా ఉన్న ఆసుపత్రి ఇప్పటికీ ఎదుగూ బొదుగులేకుండా ఉంది. నాడు-నేడు కింద గత ప్రభుత్వ హయాంలో రూ.2.50కోట్లతో ఓపీ బ్లాక్‌ను నిర్మించారు. ఇక్కడ రోగులు వేచి ఉండేందుకు తగినన్ని కుర్చీలు లేవు. వైద్యం కోసం గంటలు తరబడి నిరీక్షించాల్సి ఉంది.

**ఉన్న సిబ్బందితో.. ఇబ్బందిగా**

గుంతకల్లులోని ఏరియా ఆసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. 24మంది వైద్యులకు గాను కేవలం 15 మంది మాత్రమే ఉన్నారు. అత్యవసర విభాగానికి కూడా వైద్యుల కొరత ఉంది. స్టాఫ్‌నర్సులు తగినంత లేరు. ఉన్నసిబ్బంది పనిభారంతో అవస్థ పడుతున్నారు. ఇక్కడ వంద పడకలున్నాయి. దుప్పట్లను సరఫరా చేయడం లేదు. అల్ట్రా సౌండ్ స్కానింగ్‌యంత్రం ఉన్నా మహిళలకు మాత్రమే వినియోగిస్తున్నారు.

**రూ.కోట్ల ఖర్చు.. పాతభవనాలే దిక్కు**

తాడిపత్రిలో గత ప్రభుత్వం రూ.24 కోట్లతో నాడు-నేడు కింద ఆసుపత్రి భవనాలను చేపట్టింది. ఇప్పటికీ పూర్తికాకపోవడంతో పాత భవనాలలోనే వైద్య సేవలందిస్తున్నారు. వంద పడకల ఆసుపత్రి అయినా వైద్యసేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వైద్యుల కొరత ఉంది. ఉదయం,సాయంత్రం ఆసుపత్రికి అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారు.

**మెరుగైన సేవలు అందిస్తాం**

డాక్టర్ ఎల్లప్ప, వైద్యాధికారి ,గుత్తి

రోగులకు మెరుగైన వైద్యసేవలందిస్తాం. రోగులకు సౌకర్యాలు, వసతులు మెరుగుపరిచేందుకు రూ.1.24కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. గుత్తి ఆసుపత్రిలో వైద్యసేవలను మరింతగా మెరుగుపరిస్తే ప్రభుత్వం సౌకర్యాలు, వసతులు పెంచనుంది. 2014లోనే గుత్తి ఆసుపత్రిని వంద పడకలకు పెంచినా అప్పట్లో ఎవరూ పట్టించుకోకపోవడంతో రద్దు చేశారు.

# సొమ్ము పోయే.. ఇల్లు రాకపాయే.. టిడ్కో కష్టాలు అన్నీ ఇన్నీ కావు



హిందూపురం : జగన్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు సామాన్యులకు కలిగించిన కష్టాలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తీరడం లేదు. వారి వేదన అరణ్య రోదనగానే మిగులుతోంది. పేదల సొంతింటి కలను నిజం చేయాలని చంద్రబాబు ప్రభుత్వం 2017లో టిడ్కో ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణాలను చేపట్టింది. లబ్ధిదారులను ఎంపిక చేసి, ఇంటి నిర్మాణానికి వారి వాటా సొమ్ముగా 300 చదరపు అడుగుల ఇంటికి రూ.500, 365 చదరపు అడుగులకు రూ.50వేలు, 430 చదరపు అడుగులకు రూ.లక్ష చెల్లించాలని కోరింది. పేదలు ఒకేసారి చెల్లించలేరని భావించి విడుతల వారీగా రూ.12,500, రూ.25వేల చొప్పున చెల్లించడానికి అవకాశం కల్పించింది. ప్రభుత్వ వాటా, లబ్ధిదారులు చెల్లించిన సొమ్ముతో కలిపి జిల్లాలో హిందూపురం, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి పట్టణాల్లో వేగంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న సమయంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

**వైకాపా ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపేసి..**టిడ్కో ఇళ్లను వైకాపా ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపేసింది. లబ్ధిదారుల కు వారు చెల్లించిన సొమ్మును వాపసు ఇస్తామని, జగనన్న కాలనీల్లో ఉచితంగా స్థలాన్ని ఇచ్చి ఇళ్లు ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందని ప్రకటించింది. అయితే ఐదేళ్లు పాలన పూర్తయినా వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వలేదు. వారు చెల్లించిన సొమ్ము వాపసు ఇవ్వలేదు. జగనన్న కాలనీల్లో స్థలాలు కేటాయించి చేతులు దులుపుకొంది.

**పదివేల మందికి రూ.3.74 కోట్లు**

జిల్లాలోని నాలుగు పట్టణాలకు సంబంధించి 10 వేల మంది లబ్ధిదారులు తమ వాటా సొమ్ముగా రూ.3.74 కోట్ల సొమ్మును 2017 సంవత్సరంలో చెల్లించారు. అప్పు చేసి చెల్లించి వడ్డీలు కడుతున్నారు. జగన్ ప్రభుత్వం నిర్వాకం కారణంగా పేదలు అప్పుల పాలయ్యారు. ఆదుకోవాల్సిన కూటమి అదిగో ఇదిగో అంటూ పొద్దు పుచ్చుతోంది.

**వివరాలు సేకరిస్తున్నాం** మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్

టిడ్కో ఇళ్లకు తమ వాటా సొమ్ము చెల్లించిన వారికి బకాయిలు ఉన్న మాట నిజమే. వారి వివరాలు, చెల్లించిన సొమ్ము ఎంత, ఎవరెవరికి జగనన్న కాలనీల్లో ఇంటి స్థలాలు ఇచ్చారు తదితర వివరాలను సేకరించాలని ఉన్నతాధికారుల నుంచి మున్సిపాలిటీలకు ఆదేశాలు వచ్చాయి. దీంతో వివరాల సేకరణ చేస్తున్నాం. త్వరలో బకాయిలు చెల్లించే అవకాశం ఉంది.

# ఆలయాల ముట్టడి.. ఎలా చోరుల కట్టడి?

అనంతపురం : ఉమ్మడి జిల్లాలోని దేవాలయాల్లో రక్షణ కొరవడింది. భద్రతా లోపాలను అనుకూలంగా మలుచుకుంటున్న దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల బుక్కరాయసముద్రం మండలం ముసలమ్మ దేవాలయంలో హుండీలను పగలగొట్టి రూ.రెండు లక్షలుపైగా దోచుకెళ్లారు. కొన్నిరోజుల తర్వాత దొంగలు ఆలయం వద్ద నగదు పడేసి వెళ్లడం చర్చనీయాంశమైంది.

ఉమ్మడి జిల్లాలోని ఆలయాల నుంచి ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా.. రక్షణ చర్యలు తీసుకోవడంలేదు. భక్తుల తాకిడి అధికంగా ఉండే పుణ్యక్షేత్రాల్లోనూ సీసీ కెమెరాలు పనిచేయకపోవడం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కుందిర్పి మండలం కరిగానిపల్లి సమీపాన శశిమాకులమ్మ దేవాలయంలో ఈనెల 7న అర్ధరాత్రి దొంగలుపడి 3 తులాల బంగారు మాంగళ్యం గొలుసు, ఆరు తులాల వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. ఎర్రగుంట మారెమ్మ ఆలయంలో ఈనెల 9న దొంగలు ఐదు తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు.

దుండగులు చోరీలకు లక్ష్యంగా చేసుకుంటున్న ఆలయాలు గ్రామ శివారు ప్రాంతాల్లో ఉంటున్నా కొన్ని మాత్రం దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నాయి. నిఘా లేకపోవడం, అర్చకులు స్థానికంగా లేకపోవడం దొంగలకు కలిసివస్తోంది. జులై 27న కంబదూరు మండల పరిధి తిమ్మాపురం శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో దుండగులు హుండీ ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లారు.

**నలభై గుడుల్లోనే..**

ఉమ్మడి జిల్లాలో గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రధాన ఆలయాలన్నింటిలో సీసీ కెమెరాలు, ప్రత్యేక నిఘా ఉండేవి. 170 ఆలయాల్లో సీసీ కెమెరాలను అప్పట్లో ఏర్పాటు చేశారు. తర్వాత వైకాపా ప్రభుత్వం



గాలికొదిలేయడంతో ప్రస్తుతం కేవలం నలభై ఆలయాల్లో మాత్రమే సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలోని పురాతన ఆలయాల్లో గుప్త నిధుల తవ్వకాలు రహస్యంగా జరుగుతూనే ఉన్నాయి. ప్రతి ఏటా కేసులు నమోదవుతున్నా.. నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదు. మడకశిర, పెనుకొండ, ఉరవకొండ, కళ్యాణదుర్గం, పుట్టపర్తి, హిందూపురం, గుత్తి, గుంతకల్లు, రాయదుర్గం ప్రాంతాల్లోని పాత దేవాలయాలను లక్ష్యంగా చేసుకుంటున్న దుండగులు గుప్తనిధుల కోసం ఆలయాలను ధ్వంసం చేస్తున్నారు. పలుచోట్ల విగ్రహాలను ఎత్తుకెళ్తున్నారు.

**భద్రతా చర్యలు చేపట్టాం..**

పి.జగదీశ్, ఎస్పీ, అనంతపురం

ప్రతి ఆలయంలో సీసీ కెమెరాలు ఉండాలి. ఇప్పటికే కొన్ని ఆలయాల్లో మరమ్మతులు చేయించాం. పనిచేయని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

# ఉర్దూవిద్యకు గ్రహణం

ఆళ్లగడ్డ : మైనార్టీల విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నా క్షేత్ర స్థాయిలో సత్ఫలితాలు అగుపించడం లేదు. మైనార్టీ విద్యార్థులకు విద్య, నైపుణ్యాభివృద్ధి, స్వయం సంవృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 2018లో 'ప్రధానమంత్రి జన వికాస్ కార్యక్రమ్' పేరిట పథకాన్ని ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో ఆరు మండలాలు ఈ పథకం కింద ఎంపికవ్వగా వాటిలో రెండు మండలాలు ఆళ్లగడ్డ నియోజకవర్గంలోనే ఉండడం విశేషం. మైనార్టీలు అధికంగా ఉన్న శిరివెళ్ల, చాగలమర్రి మండలాలు ఈ పథకం కింద ఎంపికయ్యాయి. క్షేత్ర స్థాయిలో పనులు పూర్తికాక మైనార్టీ విద్యార్థుల చదువులు కుంటుపడుతున్నాయి.

**వైకాపా హయాంలో నిర్లక్ష్యం**

మైనార్టీల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పీఎం జన వికాస్ కార్యక్రమ్ కింద శిరివెళ్ల, చాగలమర్రి మండలాల్లో రూ.6 కోట్ల నిధులతో ఐటీఐ, ఉర్దూ ఉన్నత పాఠశాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. చాగలమర్రి మండలం పెద్దవంగలి వద్ద రూ.3.99 కోట్లతో ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులకు ఇప్పటి వరకు రూ.2.5కోట్ల పనులు పూర్తికాగా, మిగిలిన పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. కేవలం భవన నిర్మాణం మాత్రమే పూర్తయింది. ఈ ప్రాంతంలో పది పూర్తి చేసిన మైనార్టీ విద్యార్థులకు



ఐటీఐ కళాశాల ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుంది.

శిరివెళ్లలో రూ.1.99కోట్లతో ఉర్దూ మాధ్యమ ఉన్నత పాఠశాల నిర్మాణం చేయాల్సి ఉన్నా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. నిధులను సద్వినియోగం చేసి మైనార్టీల సంక్షేమానికి కృషి చేయాలని ముస్లింలు కోరుతున్నారు.

**మిథ్యగా కళాశాల విద్య**

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మైనార్టీ జనాభా 80వేల దాకా ఉంది. ఇక్కడ ఉర్దూ మాధ్యమంలో కళాశాల విద్యకు అవకాశమే లేని పరిస్థితి నెలకొంది. ఉర్దూ మాధ్యమంలో పది వరకు చదువుకున్న విద్యార్థులు ఇంటర్మీడి యట్ చదవాలంటే నంద్యాలకు వెళ్లాల్సిందే. 30 నుంచి 70 కి.మీ. రాకపోకలు సాగించే పరిస్థితి ఉండడంతో చాలా మంది ఉర్దూ మాధ్యమ విద్యార్థులు పదితోనే చదువు ఆపేస్తు న్నారు. ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

# స్త్రీనిధి.. పేదింటి పెన్నిధి!

ఆకివీడు : ఆకివీడుకు చెందిన లక్ష్మి తన కుమారుడిని విశాఖపట్నంలోని ఒక యూనివర్సిటీలో చదివిస్తున్నారు. దానికయ్యే ఖర్చుల కోసం గతంలో వెలుగు అధికారులను రుణం ఇప్పించాలని కోరగా అటువంటి అవకాశం లేదని చెప్పడంతో బయట రూ.50వేలు అధిక వడ్డీకు రుణం తీసుకుని అవసరాలు తీర్చారు. అప్పట్నుంచి నెలనెలా వడ్డీ కడుతూ వస్తున్నారు. పిల్లల చదువుల నిమిత్తం ఇకపై అధిక వడ్డీలకు బయట అప్పులు చేయనవసరం లేకుండా పావలా వడ్డీకే స్త్రీనిధి రుణం ఇవ్వనుండటంతో ఆ రుణం తీసుకుని బయట అప్పు తీర్చేయాలని లక్ష్మి భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక తోడ్పాటును అందిస్తుంది. ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి పథకాలను ప్రకటించడం ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలవనుంది. వీటిని వచ్చే నెలలో అమల్లోకి తీసుకురానుంది. జిల్లాలో పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు వివాహాల నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నవారికి ఆయా పథకాలు భరోసా కల్పించనున్నాయి.

**30 వేల సంఘాలకు లబ్ధి**

జిల్లాలో 30,120 స్వయం సహాయక సంఘాలుండగా 3 లక్షల మందికి పైగా సభ్యులున్నారు. ఏటా రూ.వెయ్యికోట్లకు పైబడి రుణ లక్ష్యం ఉంటుంది. అత్యధికంగా యలమంచిలి, పాలకోడేరు, మొగల్తూరు మండలాల్లో మహిళలు సరాసరిన రూ.90 కోట్ల చొప్పున బ్యాంకు రుణాలు పొందుతున్నారు. ఇకపై వీరందరికీ చదువుకునే పిల్లలున్నా వివాహాలు కుదిరిన సంతానమున్న స్త్రీనిధి నుంచి అదనపు రుణాలు అందనున్నాయి.

ఈ ఏడాది రుణ లక్ష్యం- రూ.220.39 కోట్లు, ఇంత వరకు ఇచ్చింది- రూ.80.16 కోట్లు, లబ్ధిదారుల సంఖ్య- 9,086

**ఇదే తొలిసారి** గతంలో బ్యాంకు రుణాలకు బ్యాంకులు సాధారణ వడ్డీ వసూలు చేసినా ప్రభుత్వం పావలా వడ్డీ, సున్నా వడ్డీ వర్తింపజేసి రాయితీ చెక్కులను 6 నెలలకోసారి అందించేవారు. స్త్రీనిధి రుణాలకు మాత్రం పావలా వడ్డీ వర్తింపజేయడం ఇదే ప్రథమం. రూ.10 వేలు నుంచి రూ.లక్ష వరకు పావలా వడ్డీ అంటే పేద కుటుంబాలకు చాలా ఊరట లభిస్తుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. దీనిపై స్త్రీనిధి జిల్లా ఇన్‌ఛార్జి ఏజీఎం రమణమ్మ స్పందిస్తూ పూర్తి మార్గదర్శకాలు వచ్చాక అవసరం ఉన్న ప్రతి మహిళకు పావలా వడ్డీపై రుణాలు అందిస్తామన్నారు.

# ఈ గోడకు దయ ఎక్కువ

బొబ్బిలి : అది పేదల అవసరాలు తీర్చుతున్న దయగల గోడ.. ఒక్క రూపాయి తీసుకోకుండా సేవలు అందిస్తోంది. ఈ గోడ బొబ్బిలి పట్టణంలోని పాత బొబ్బిలి కూడలిలో ఉంది. సాధారణంగా ఉద్యోగులు, సంపన్న వర్గాల వారు ఇళ్లలో పాత బడిన వస్తువులు, సైజు తేడాఉన్న దుస్తులు.. తదితరాలను విసిరేస్తుంటారు. బొబ్బిలి పట్టణవాసులు మాత్రం అలాంటి వాటిని'దయగల గోడ' వద్ద ఉంచుతారు. వాటిని పేదలు ఉచితంగా తీసుకెళ్తున్నారు. నాలుగేళ్ల క్రితం పాత బొబ్బిలికి చెందిన ఉపాధ్యాయుడు ఎం.విజయ మోహనరావు బస్టాండు పక్కన దీనిని ఏర్పాటు చేశారు. 'అవసరం లేని వస్తువులు ఇక్కడ పెట్టండి.. అవసరమైన వాటిని తీసుకెళ్లండి' అని అవగాహన కల్పించే విధంగా రాశారు. ఈ ప్రయత్నం మంచి ఫలితాలనిస్తోంది. చాలా మంది ద్విచక్ర వాహనాలు, కార్లలో వచ్చి అక్కడ వస్తువులు ఉంచేస్తున్నారు. అలా దినసరి కూలీలు, కార్మికులు, ఎలాంటి భరోసా లేని వారికి కల్పతరువుగా మారింది. రోజుకు 100 నుంచి 120 రకాల దుస్తులు, పదుల సంఖ్యలో చెప్పులు, బ్యాగులు, వంట సామగ్రి, అరుదుగా ఎలక్ట్రానిక్ వస్తువులు వస్తున్నాయి. విజయమోహనరావు స్నేహితులు కృష్ణదాసు, ఎస్.వి.రమణమూర్తి కొన్నిసార్లు వాటిని సమీప గిరిజన గ్రామాల్లోకి తీసుకెళ్లి పంపిణీ చేస్తున్నారు. ఒకరికి వృథా అయినది.. మరొకరి అవసరంగా మారుతుందని, ఆ ఉద్దేశంతోనే దయగల గోడను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.

# కొత్త కోర్సులొచ్చాయి.. చేరగ రారండి..!

గాజువాక : కాలం చెల్లిన కోర్సుల స్థానంలో గాజువాక స్టీల్‌సిటీ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) కొన్నేళ్లుగా కొత్త కోర్సుల కోసం సాగిస్తున్న ప్రయత్నాలు ఇప్పుడు ఫలప్రదమయ్యాయి. ప్రభుత్వ ఉపాధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ ఐటీఐకి తాజాగా మూడు కోర్సులు మంజూరయ్యాయి. యువత ఉపాధికి ఇవి ఎంతగానో ఉపయోపడతాయని చెబుతున్నారు.

**పరిశ్రమల డిమాండ్‌కు అనుగుణంగా..:** గాజువాక ఐటీఐలో ప్రస్తుతం 13 ట్రేడ్లు ఉండగా, 800 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ రెండు దశాబ్దాలుగా పాత కోర్సులే నడుస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఫార్మాసిటీ, హెచ్‌పీసీఎల్, కోరమండల్, ఎస్‌ఈజెడ్, పలు ప్రైవేటు పరిశ్రమల యాజమాన్యాలు తరచూ రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, ఎలక్ట్రానిక్ మెకానిక్, అటెండెంట్-కెమికల్ ట్రేడ్ల అభ్యర్థులను అడుగుతున్నా వాటిని అందించలేని పరిస్థితి. గత ప్రభుత్వంలో పలుమార్లు ఉన్నతాధికారులకు కొత్త కోర్సుల అవసరాలపై నివేదికలు పంపినా పట్టించుకోలేదు.

**అధ్యయనం చేసి..:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక బృందం అధ్యయనం చేసి గాజువాక స్టీల్‌సిటీ ఐటీఐకి రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, ఎలక్ట్రానిక్ మెకానిక్, అటెండెంట్-కెమికల్ ట్రేడ్లు అత్యవసరమని తేల్చింది. దీంతో సుమారు రూ.2 కోట్ల విలువైన పరిశోధన పరికరాలు, శిక్షణకు అవసరమైన యంత్ర సామగ్రి, నూతన భవన సముదాయాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఒక్కో కోర్సుకు 40 మంది చొప్పున ఏటా తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులను తీసుకుంటారు. ప్రత్యేక ట్రైనింగ్ ఆఫీసర్లు సంబంధిత వృత్తి నైపుణ్య



శిక్షకులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. కొత్త భవనంలో ఆయా యూనిట్లకు పరికరాలను సమకూర్చారు. ప్రస్తుతం అసెంబ్లింగ్, టెస్టింగ్ పనులు, విద్యుత్తు సదుపాయ కల్పనలో సిబ్బంది బిజీగా ఉన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

**నిపుణులకు మంచి అవకాశాలు**

– కె.ఎస్.శ్రీనివాసరావు, గాజువాక మోడల్ ఐటీఐ ప్రిన్సిపల్

వృత్తివిద్యా కోర్సులను పూర్తి చేసిన వారికి పారిశ్రామిక రంగంలో మంచి అవకాశాలు ఉన్నాయి. పరిశ్రమలు ఆయా కోర్సుల్లో నైపుణ్యం సాధించిన వారిని ఉద్యోగాలకు తీసుకుంటున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని కొత్త కోర్సులను సాధించాం. ఇప్పటికే అభ్యర్థులు చేరడానికి సిద్ధంగా ఉన్నారు.

## ఆక్రమించి.. ఆయకట్టును ముంచి

ఎమ్మిగనూరు : నేతల అండదండలతో పలువురు రెచ్చిపోతున్నారు. విలువైన స్థలాలను ఆక్రమించేస్తున్నారు. చివరికి కాలువ స్థలాలను సైతం వదలడం లేదు. ఏకంగా కాలువలను పూడ్చేస్తున్నా అధికారులు తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. తుంగభద్ర దిగువ కాలువ పరిధిలోని ఆయకట్టు భూములకు నీరందించేందుకు గాను డిస్ట్రిబ్యూటరీ పరిధిలో కాలువలు నిర్మించారు. ముగతి ఫారం సమీపంలో ఆయకట్టు పొలాలకు సాగు నీరు అందేలా పట్టణం మధ్యన కాలువలో ఏర్పాటుచేశారు. చివరికి అది కబ్జాకు గురైంది. ఫలితంగా



సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది.

**దుకాణాలు ఏర్పాటుచేసుకుని..**

కాలువ స్థలంలోనే అక్రమంగా కట్టడాలు నిర్మించి వివిధ వ్యాపారాలు చేసుకునేందుకు అనుకూలంగా మార్చుకున్నారు. ఇక్కడ సెంటు స్థలం రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలకుపైగా ఉంది. కాగా కాలువ పొడవునా 250కిపైగా దుకాణాలు, పక్కా కట్టడాలు నిర్మించారు. 50 సెంట్లకుపైగా స్థలం ఆక్రమణలకు గురైంది. దీని విలువ రూ.కోట్లలో ఉంది. ఓంశాంతి సర్కిల్ ప్రాంతంలోనూ కాలువ పొడవునా ఆక్రమించేశారు. అప్పట్లో వైకాపా నేతలు కొందరి వద్ద డబ్బులు తీసుకొని డబ్బాలు వేయించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

**ఇష్టానుసారంగా పూడ్చేసి..**

తుంగభద్ర దిగువ కాలువ పరిధిలో 79 డిస్ట్రిబ్యూటరీ కాలువ ఐదు కిలోమీటర్ల మేర ఉంది. దీని కింద 200 ఎకరాలకుపైగా ఆయకట్టు విస్తరించి ఉంది. సులువుగా నీరు ప్రవహించేలా 40 నుంచి 80 అడుగుల వెడల్పుతో కాలువ కోసం స్థలం సేకరించారు. కొన్ని దశాబ్దాలపాటు ఈ కాలువ ఉండేది. పంట పొలాలు సాగయ్యేవి. పట్టణంలోని లక్ష్మణ్ టాకీస్ ఏరియా నుంచి దాదాపు 2.5 కిలోమీటర్లకు పైగానే కాలువ ఉంది. విద్యుత్తు సబ్‌స్టేషన్ ఎదురుగా సుమారు 80 అడుగుల మేర వెడల్పు ఉంది. ఓ వైకాపా నేత దీనిపై కన్నేసి కొద్దిదూరం పూడ్చేశాడు. వంతెన నిర్మించి ఇక్కడ ఫ్లాట్లు విక్రయించేందుకు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు.

## దారిన పడుతున్నాయ్

బేతంచెర్ల : ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె నుంచి డోన్ సమీపంలో గుత్తి జాతీయ రహదారి వరకు రూ.650 కోట్లతో 340బి హైవే నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. బేతంచెర్ల మండల సమీపంలో గొరుమానుకొండ, సీతారాంపురం, చిన్నమల్కాపురం, డోన్ కొండపేట కాలనీలోని అటవీ ప్రాంతం తదితర ప్రాంతాల్లో పనులు చేపట్టేందుకు అనుమతులు లేకపోవడంతో గత కొన్ని రోజులుగా ఆగిపోయాయి. గొరుమానుకొండ మెట్ట వద్ద రోడ్డు సరిగా లేకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. మలుపు ఉండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరిగేవి. ఈ మలుపుల్లో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. అనుమతులు రావడంతో.

ఎట్టకేలకు అటవీ శాఖ అనుమతులు రావడంతో కొండను తొలిచే పనులు చేపట్టారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో యంత్రాలతో రహదారి పనులు వేగంగా చేస్తున్నారు. ఆర్.కొత్తపల్లె సమీపంలో టోల్‌గేట్ పనులు పూర్తయ్యాయి. ప్రయాణికుల సౌకర్యం మెరుగైన సేవలు అందించే ఉద్దేశంతో టోల్‌గేట్ నిర్మాణం, ప్రయాణికుల సౌకర్యార్థం మూడు విశ్రాంతి గదులు నిర్మించారు. గ్రామ కూడలి ప్రాంతాల్లో పేర్లను చూపే సూచిక బోర్డుల ఏర్పాటు, ప్రమాదకరంగా ఉన్న రహదారి పక్కన వేగ నిరోధకాల ఏర్పాటును పూర్తి చేసినట్లు హైవే అధికారులు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 44 కి.మీ. మేర రహదారి నిర్మాణ పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు. 9 కి.మీ. మేర రహదారి పనులను ఆగస్టు చివర వారంలో ప్రారంభించారు. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తయితే వాహన చోదకులకు సౌకర్యంగా ఉంటుంది.

# పట్టణాభివృద్ధికి.. బృహత్ అడుగులు



చిత్తూరు : పట్టణాలకు వలసల తాకిడి పెరుగుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా సౌకర్యాలు ఉన్నాయా? అంటే లేవనే సమాధానమే వస్తోంది. ఈ నేపథ్యంలోనే పెరగనున్న జనాభా, ప్రజల అవసరాలు దృష్టిలో ఉంచుకుని పట్టణాభివృద్ధి సంస్థల్లో (యూడీఏ) బృహత్ ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) ఆధారంగా తయారు చేయనున్నారు. కొత్త నిర్మాణాలకు అనుమతులు మొదలు అభివృద్ధి పనుల నిర్వహణ వరకు మాస్టర్‌ప్లానే ఆధారం. జీఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్‌లో 100 లేయర్లలో సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది.

**చుడాలో 3,450 చ.కి.మీ.** చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ (చుడా) పరిధిలో 23 మండలాలున్నాయి. ప్రస్తుతం చిత్తూరు నగరం వరకే మాస్టర్‌ప్లాన్ ఉంది. 2041 అవసరాలు దృష్టిలో ఉంచుకుని అప్పట్లో రూపొందించారు. చుడా.. ఇప్పుడు పూతలపట్టు, గంగాధరనెల్లూరు, పీలేరు నియోజకవర్గాలను కలిపి బృహత్ ప్రణాళిక తయారు చేయనుంది. కుప్పం, పలమనేరు నియోజకవర్గాలు పీకేఎం ఉడాలో ఉన్నందున ఆ పట్టణాభివృద్ధి సంస్థ ప్రస్తుతం ఇదే పనిలో ఉంది. నెలాఖరుకు ఏజెన్సీలు ఖరారు కానున్నాయి.

**తుడాలో 1,100 చ.కి.మీ.**

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) పరిధిలో 39 మండలాల్లో 25 లక్షల జనాభా ఉంది. తుడా పరిధి 8,353 చ.కి.మీ. ఉంది. ఇందులో గతంలో 1,100 చ.కి.మీ. వరకే మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బృహత్ ప్రణాళిక రూపొందించాలని ప్రైవేటు ఏజెన్సీలను ఆహ్వానించడంతో తుడా అధికారులు ఈ అంశంపై కసరత్తు చేస్తున్నారు. 6000 చ.కి.మీ. వరకు తుడా, మిగతా విస్తీర్ణంలో ఆయా మున్సిపాలిటీలే మాస్టర్‌ప్లాన్ తయారుచేస్తాయి. టెండర్లు ఖరారైన తర్వాత పనులు మొదలుపెట్టనున్నారు. చివరగా ప్రజల అభ్యంతరాలు స్వీకరించనున్నారు. మొత్తంగా 18 నెలల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**ప్రతిఒక్కరికీ స్పష్టత ఉంటుంది** మాస్టర్‌ప్లాన్ తయారీతో పట్టణాలు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడానికి ఆస్కారం ఉంటుంది. ప్రభుత్వం ఏదైనా ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలంటే అక్కడ అవసరమైన భూమి ఉందా? లేదా? అనేది సులభంగా తెలుసుకోవచ్చు.
శుభం భన్సల్, తుడా వీసీ

# ఆక్రమణల చెరలో.. జలవనరులు



పుంగనూరు : జిల్లాలో సాగునీటి వనరుల ఆక్రమణలకు అడ్డుకట్ట పడడం లేదు. మట్టి మాఫియా, స్థిరాస్తి వ్యాపారులు, రైతులు వాటిని ఎడాపెడా కబ్జా చేస్తున్నారు. జిల్లాలో 4,303 చెరువులు, కుంటలు ఉండగా వాటి పరిధిలో 46,900 హెక్టార్ల సాగు భూములు ఉన్నాయి. కొన్నేళ్లుగా ఆక్రమణలు కొనసాగుతుండటంతో విస్తీర్ణం సగానికి సగం పడిపోయింది. గతంలో తెదేపా ప్రభుత్వం చెరువులు, కుంటలు సర్వేచేసి కందకాలు తవ్వడానికి శ్రీకారం చుట్టింది. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆక్రమణలను అడ్డుకోవడంపై దృష్టి సారించకపోగా అక్రమార్కులకు వెన్నుదన్నుగా నిలిచినట్లు ఆరోపణలున్నాయి. పుంగనూరు నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలకు, వ్యవసాయ భూములకు డిమాండు ఉండటంతో ఆక్రమణదారులు చెరువులు, కుంటలు, కాలువలు, ప్రభుత్వ భూములను చెరబడుతున్నారు.

పట్టణాలు, మండల కేంద్రాలు విస్తరిస్తుండటంతో ప్రభుత్వ పరిధిలోని చెరువులు, కుంటలు, కాలువలు, ప్రభుత్వ స్థలాలు దురాక్రమణకు గురవుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వంలో దూసుకొచ్చిన ఈ ఆక్రమణలు కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతున్నాయి. కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ ఆస్తులు అక్రమార్కుల పాలవుతున్నాయి. రాయలచెరువు, పుంగమ్మ చెరువుల కాలువలు పుంగనూరు పట్టణ నడిబొడ్డున ఉండటంతో అక్రమార్కులు వాటిని ఆక్రమిస్తున్నారు. పట్టణ పై భాగంలో రాయలచెరువు సుమారు వంద ఎకరాల్లో ఉంది. చెరువు కింద 135 ఎకరాల సాగుభూమిలో 50 ఎకరాలను ఇళ్లస్థలాలుగా మార్చేసి భవనాలు నిర్మించారు. సాగుభూమికి నీరందించే రాజుకాలువ చెరువు తూము నుంచి సుమారు కిలోమీటరు పొడవున 6 నుంచి 10 అడుగుల వెడల్పుతో వెళ్లే కాలువ స్థానిక ఎన్టీఆర్ కూడలి మీదుగా వెళ్తోంది. ఈ కాలువను తమ భూమిలోకి కలుపుకోవడానికి ఆక్రమణదారులు పోటీ పడుతున్నారు. చెరువుకింద గల రాజుకాలువ, ఉపకాలువల పూడికతీత చేపడితే భవిష్యత్తులో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉండదు.

చౌడేపల్లె మండలం పెద్దయల్లకుంట్లకు చెందిన తుమ్మచెరువును ఆక్రమించి ముళ్లకంచె వేశారు. అలాగే కాటిపేరి గ్రామ పంచాయతీ పరిధిలో, సదుం మండలంలో గాండ్లపల్లె వద్ద చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయి.

**సర్వే చేయిస్తాం**

రాయలచెరువు రాజుకాలువ సర్వేచేసి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం. రైతులు సైతం అధికారులకు సహకరించాలి.
రాము, తహసీల్దారు, పుంగనూరు.

# పట్టాలెక్కిన పారిశ్రామిక ప్రగతి



అచ్యుతాపురం : వైకాపా సర్కారు హయాంలో నిర్లక్ష్యానికి గురైన పరిశ్రమలు కూటమి ప్రభుత్వ పాలనలో గాడిలో పడుతున్నాయి. నష్టాలు భరించలేక పరిశ్రమలను మూసివేస్తున్నా ఐదేళ్లపాటు జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ అనకాపల్లి జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహించినా పరిశ్రమలను తెరిపించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు చర్యలు తీసుకుంది. అచ్యుతాపురం సెజ్‌లో రెండు పెద్ద పరిశ్రమలు పునఃప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. సెజ్ పరిధిలో ఖాళీగా ఉన్న భూముల్లో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఇప్పటికే సెజ్‌లో పర్యటించి ఖాళీస్థలాలు, తీసుకోవాల్సిన పరిశ్రమలు, మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని భూములు తీసుకుని ఏర్పాటు చేయని సంస్థలకు నోటీసులు జారీ చేశారు. అభిజీత్ అనుబంధ సంస్థ అయిన కైజాన్ పవర్ లిమిటెడ్‌కు కేటాయించిన 150 ఎకరాలను వెనక్కు తీసుకుంటామని నోటీసులు జారీ అయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏఐ ఆధారిత పరిశ్రమకు 40 ఎకరాలు కేటాయించారు. ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. సెజ్‌లో ఖాళీగా ఉన్న భూముల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో ఎలక్ట్రికల్ ఇన్సులేటర్లు తయారుచేసే డబ్ల్యూఎస్ కంపెనీ గతంలో మూతపడింది. దీనికి ఎదురుగా ఉండే సదరన్ బయోడీజిల్ కంపెనీ, కాన్ఫిడెన్షియల్ గ్యాస్ లిమిటెడ్ కంపెనీలకూ తాళాలు వేశారు. డబ్ల్యూఎస్ కంపెనీ మూత పడటంతో వెయ్యి మంది, సదరన్ బయోడీజిల్‌లో 200 మంది, కాన్ఫిడెన్షియల్ గ్యాస్ లిమిటెడ్ కంపెనీలో 120 మందికి ఉపాధి లేకుండా పోయింది. వీరంతా వేర్వేరు ప్రాంతాలకు వలసపోయారు. ఇప్పుడు ఈ మూడు పరిశ్రమలు తిరిగి ఉత్పత్తిని ప్రారంభించనున్నాయి. డబ్ల్యూఎస్ కంపెనీ స్థానంలో విన్ విన్ స్పెషాలటీ ఇన్సులేటర్ కంపెనీ ఉత్పత్తిని ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది. సదరన్ బయోడీజిల్ కంపెనీ స్థానంలో సోలన బయో ఫ్యూయల్ కంపెనీ ఏర్పాటు కానుంది. కాన్ఫిడెన్షియల్ గ్యాస్ కంపెనీని పూర్తిగా తొలగించి గతంలోనే రాజరాజేశ్వరీ లలిత త్రిపుర సుందరీదేవి ఫెర్రో కంపెనీని నెలకొల్పారు.

# సేద్యానికి 'సౌర'భం

ఒంగోలు : 'పీఎం కుసుమ్' పథకం అమలులో భాగంగా జిల్లాలోని ఉచిత వ్యవసాయ కనెక్షన్లకు సౌర విద్యుత్తు సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆ మేరకు తయారీ ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన భూముల గుర్తింపు ప్రక్రియ తుది దశకు చేరింది. అత్యధిక కనెక్షన్లు ఉన్న పుల్లలచెరువు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం, దర్శి, దొనకొండ, పొదిలి, కొండపి, పీసీపల్లి, పామూరు, కనిగిరి, ముండ్లమూరు, కురిచేడు తదితర మండలాల్లో ప్లాంట్ల ఏర్పాటుకు ప్రాధాన్యమిచ్చారు. ఈ నిర్మాణ పనుల టెండర్‌ను హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ దక్కించుకుంది. తాజాగా 70 ఎకరాల ప్రభుత్వ భూములు కేటాయిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. భూ సేకరణ విషయమై ఆయా మండలాల తహసీల్దార్లు, విద్యుత్తు అధికారులతో ఇప్పటికే జేసీ గోపాలకృష్ణ సమీక్షించి... రైతుల సుముఖతతో 200



ఎకరాల ప్రైవేటు స్థలాలను గుర్తించారు. లీజు ఒప్పందం పూర్తయితే పనులు ప్రారంభించేందుకు విద్యుత్తు, నెడ్‌క్యాప్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**కార్యాచరణ ఇలా...**

జిల్లాలో మొత్తం 278 ఉప కేంద్రాలు ఉండగా... 41 కేంద్రాల పరిధిలో సౌర విద్యుత్తు ప్లాంట్లు నెలకొల్పి వాటికి అనుసంధానించనున్నారు. తద్వారా పంపిణీ వృథా తగ్గడంతో పాటు... సరఫరా నాణ్యత మెరుగు పడుతుందని భావిస్తున్నారు.

మొత్తం 109 మెగావాట్ల తయారీ లక్ష్యం కాగా ఇందుకు 499.75 ఎకరాలు అవసరమని గుర్తించారు. 250 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండగా... మిగతా 249.75 ఎకరాలు రైతుల నుంచి సేకరించాల్సి ఉంది. సేకరించిన భూములకు సంబంధించి రైతులతో 25 ఏళ్లకు లీజు ఒప్పందం చేస్తారు. ప్రారంభ సంవత్సరం ఎకరానికి రూ.30 వేలు... తరువాత ప్రతి రెండేళ్లకోసారి 5 శాతం పెంచి కౌలు రూపంలో చెల్లిస్తారు.

# మళ్లీ మొదలెట్టారు!

మద్దిపాడు : మద్దిపాడులో ఇసుక మాఫియా చెలరేగుతోంది. గుండ్లకమ్మ పరీవాహకంలో యంత్రాలతో యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తూ వివిధ ప్రాంతాలకు రవాణా సాగిస్తున్నారు. సెలవు రోజుల్లో అధికారులు రారని మరింత బరితెగిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. వాహనాలు జప్తు చేసినా...: గత ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ రవాణాలో చక్రం తిప్పిన ఓ ద్వితీయ శ్రేణి నాయకుడి జేసీబీ, ట్రాక్టర్లను ఇటీవల జేసీ గోపాలకృష్ణ జప్తు చేశారు. మరో ఇసుకాసురుడి డంప్‌లను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. అప్పటి నుంచి స్తబ్దుగా ఉన్న వీరు... తాజాగా అధికార పార్టీ నాయకుల మధ్య తలెత్తిన విభేధాలను ఆసరాగా చేసుకుని మళ్లీ దందా సాగిస్తున్నట్లు సమాచారం. మరికొందరు స్థానికంగా పలుకుబడి కలిగిన వారిని మచ్చిక చేసుకుని దందా సాగిస్తున్నారు. **అంతటా ఇదే తీరు...** మల్లవరం, కొలచనకోట, వెల్లంపల్లి వంతెన దిగువన, కీర్తిపాడు, రాచవారిపాలెంలో జేసీబీతో తవ్వకాలు సాగుతున్నా యి. దూరాన్ని బట్టి ట్రాక్టర్‌కు రూ.2,500 నుంచి రూ.3,500 వరకు వసూలు చేస్తున్నారు. గుండ్లకమ్మ నుంచి రోజుకు 70 ట్రాక్టర్ల మేర రవాణా సాగుతోంది. ఇనమనమెళ్లూరులో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన డీకే పట్టాలను కొనుగోలు చేసి... ఆయా ప్రాంతాల్లోనూ తవ్వకాలు సాగిస్తు న్నారు. టిప్పర్లతో రవాణాకు డంప్‌లు సిద్ధం చేస్తున్నారు. ఈ కారణంగా భూగర్భజలాలు పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఉద్యోగం వల.. చదువరులు విలవిల

భీమవరం: ప్రభుత్వ కార్యాలయంలో ఉన్నతాధికారి మా బంధువు.. ఫలానా ప్రజాప్రతినిధి మా చుట్టం.. ఉద్యోగం గ్యారంటీ.. అంటూ కేటుగాళ్లు విసిరే వలలో చదువరులు సైతం చిక్కుకుంటున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన కొందరు అప్పులు చేసి మరీ సొమ్ములిచ్చి మోసపోతున్నారు. చేసేది లేక బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసే ఉద్యోగ ప్రకటనల్లో.. నిబంధనల మేరకు విద్యార్హతలు, ప్రతిభావంతుల జాబితాననుసరించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. అడ్డదారిలో ప్రభుత్వ ఉద్యోగం ఎలా వస్తుందని ఒక్క క్షణం ఆలోచించకుండా రూ.లక్షల్లో ముట్టజెబుతూ మోసపోతున్నారు. దళారులకు డబ్బులిచ్చి మోసపోవద్దంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

**కొన్ని ఉదంతాలు..** ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి భీమవరం రెండో పట్టణానికి చెందిన ఓ మహిళ నుంచి ప్రసాద్‌రాజు అనే వ్యక్తి ఆగస్టు నెలలో రెండు విడతలుగా రూ.9.80 లక్షలు తీసుకొని ఉద్యోగం ఇప్పించలేదు.

ప్రభుత్వ ఉద్యోగం ఎరవేసి తాడేపల్లిగూడేనికి చెందిన వ్యక్తి రూ.10 లక్షలు చొప్పున వసూలు చేశాడని తాడేపల్లిగూడెం పట్టణం, పెంటపాడు, తణుకు గ్రామీణ ప్రాంతాలకు చెందిన బాధితులు 'మీ కోసం'లో ఫిర్యాదు చేశారు.

రైల్వేలో ఉద్యోగం పేరుతో మోడి గ్రామానికి చెందిన యువకుడి నుంచి రూ.30 లక్షలను హైదరాబాద్‌కు చెందిన ముఠా మోసగించింది.

సచివాలయ ఉద్యోగాలు ఇప్పిస్తామని మొగల్తూరు మండలం కొత్తోటకు చెందిన ఇద్దరు యువకుల నుంచి రూ.12 లక్షలు తీసుకొని మోసగించారు. మంగళగిరి బెటాలియన్‌లో కానిస్టేబుల్‌నని, హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానంటూ నరసాపురానికి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.8.5 లక్షలు తీసుకొని మోసగించాడు.

తన కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.8 లక్షలు ఓ వ్యక్తి తీసుకుని మోసం చేశాడని భీమవరానికి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు.

**ఫిర్యాదులు తక్కువ..** రాజీలే ఎక్కువ.. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లకు నెలలో 10కిపైగా ఇలాంటి ఫిర్యాదులొస్తున్నా వాటిలో ఒకటి, రెండు మాత్రమే కేసులు నమోదవుతున్నాయి. ప్రతి సోమవారం నిర్వహించే 'మీ కోసం'లో పలు ప్రాంతాల నుంచి వచ్చే అర్జీల్లో వాటి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. రాజీ చేసుకుంటే కొంత సొమ్ము అయినా తిరిగొస్తుందనుకుంటూ కొందరు ఫిర్యాదులకు వెనుకాడుతున్నారు.

# గవిమఠం.. అభివృద్ధి శూన్యం

ఉరవకొండ : ఉరవకొండలోని కరిబసవస్వామి గవిమఠం దశాబ్దాల కాలంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఇక్కడ చంద్రమౌళీశ్వరుడు ఉత్సవమూర్తిగా పూజలు అందుకొంటున్నాడు. ఈ మఠానికి ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో 770 ఉప మఠాలు ఉన్నాయి. ఈ మూడు రాష్ట్రాల్లో 2,943 ఎకరాల సాగు భూమి ఉంది. ఒక్క ఉరవకొండ పట్టణంలోనే మఠం స్థలంలో 314 దుకాణాలు ఉన్నాయి. వీటన్నిటి ద్వారా సుమారు ఏటా రూ.2 కోట్లు మఠానికి ఆదాయం చేకూరుతోంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లకు వడ్డీ రూపంలోనూ ఆదాయం



వస్తోంది. అన్ని వ్యయాలు పోగా మఠం ఏడాది ఆదాయం రూ.1.26 కోట్ల వరకు మిగులుతోంది. భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

**భవనాలు శిథిలం:** విశాల వాతావరణంలో శతాబ్దం కిందట నిర్మించిన గవిమఠం భవనాలు శిథిలం అవుతున్నాయి. చంద్రమౌళీశ్వరుని ఉత్సవ విగ్రహం ఉండే గర్భగుడితోపాటు ఇతర గదులు పూర్తిగా దెబ్బతిన్నాయి. గర్భగుడిపై మొక్కలు మానులుగా ఎదుగుతున్నా... తొలగించే నాథుడే కరవయ్యాడు. మోస్తరు వర్షం కురిస్తే ఆలయం మొత్తం కారుతోంది. గదులన్నీ పాడవుతుండటంతో భక్తులు వచ్చినా ఉండడానికి అవకాశం లేదు.

**ప్రతిపాదనలు తయారు చేస్తాం**

రాణి, మఠం సహాయ కమిషనరు

మఠాన్ని ఇటీవల దేవదాయ ఇంజినీరింగ్ అధికారుల బృందం సందర్శించింది. ముందుగా డీజీపీహెచ్ స్కెచ్‌ను తయారు చేయాలని సూచించారు. మఠం పీఠాధిపతి, సిబ్బంది సంయుక్తంగా చర్చించుకుని తగిన నిర్ణయం తీసుకుంటాం.

# చెప్పిందొకటి.. చెల్లించేదొకటి

చిత్తూరు : మామిడి రైతుకు గిట్టుబాటు ధరపై భరోసా లేకుండాపోయింది. చెప్పిన ధరకు చెల్లిస్తున్న మొత్తానికి పొంతన లేకపోవడంపై వారు గగ్గోలు పెడుతున్నారు. పుత్తూరు మండలం కేబీఆర్‌పురానికి చెందిన 50 మంది రైతులు కార్వేటినగరం మండ లం అన్నూరు సమీపంలోని పరిశ్రమకు తోతాపురి తరలించారు. ప్రస్తుతం టన్నుకు రూ.4-7 వేల మధ్య ధర చెల్లిస్తున్నారు. ఈ ఏడాది తోతాపురికి డిమాండు లేకపోవడంతో ప్రభుత్వం రంగంలోకి దిగి.. టన్నుకు రూ.12 వేలు ధర నిర్ణయించింది. పరిశ్రమల యజమానులు టన్నుకు రూ.8 వేలు, ప్రభుత్వం ్రూ.4 వేలు చెల్లించాల్సి ఉంది.

**సమావేశాలు నిర్వహించినా..**

ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో రైతు సంఘాలు, గుజ్జు పరిశ్రమల



యజమానులతో కలెక్టర్లు సమావేశాలు నిర్వహించి ధర నిర్ణయించారు. సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనకు వచ్చిన సందర్భంలో గుజ్జు పరిశ్రమల యజమానులను పిలిచి మాట్లాడారు.

**ప్రశ్నిస్తే బెదిరింపులు..**

పరిశ్రమలకు కాయలు తరలించి రెండునెలలు గడిచిపోగా బిల్లుల కోసం రైతులు రోడ్డెక్కే పరిస్థితులు ఉండటంతో రెండురోజులుగా రైతుల ఖాతాల్లో నగదు వేస్తున్నారు. అయితే ఒక్కో రైతుకు ఒక్కోధర చెల్లిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఇచ్చిందే తీసుకోవాలని బెదిరిస్తుండటంతో వారు లబోదిబోమంటున్నారు.

**31 యాజమాన్యాలకు నోటీసులు**

మామిడికి ప్రభుత్వం ప్రకటించిన ధరను చెల్లించాలంటూ అధికారులు గుజ్జు పరిశ్రమలకు నోటీసులు జారీ చేశారు. రూ.5-6వేలు మాత్రమే చెల్లిస్తుండటంపై మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో 31 పరిశ్రమలకు నోటీసులిచ్చామని ఉద్యాన శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో తోతాపురి సాగు : 55 వేల హెక్టార్లు

గుజ్జు పరిశ్రమల కొనుగోళ్లు : 5.50 లక్షల టన్నులు

# గృహయోగం

చిత్తూరు : దసరా నాటికి నిరుపేద కుటుంబాలు గృహప్రవేశం చేసేలా కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అప్పటిలోగా నిర్మాణాలు శరవేగంగా పూర్తయ్యేలా చూడాలని దిశానిర్దేశం చేసింది. గత ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు పేరుతో హడావుడి చేసింది. అరకొరగా నిధులు కేటాయించింది. ఫలితంగా చాలామంది ఇళ్లు నిర్మించుకోలేకపోయారు. మరికొందరు అప్పులు చేయలేక మధ్యలోనే నిర్మాణాలు ఆపేశారు. ఫలితంగా మంజూరైన ఇళ్లలో 40 శాతం కూడా పూర్తికాని పరిస్థితి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి సారించింది. దశలవారీగా నిర్మాణాలు పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందించింది. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించింది. దీంతో చాలామంది గృహాలు నిర్మించేందుకు ముందుకొచ్చారు.

**36 వేలకు.. 23 వేలే..**

గత ప్రభుత్వం మంజూరు చేసిన యూనిట్ ధర రూ.1.80 లక్షలకు అదనంగా నిధుల్ని విడుదల చేసింది. దీంతో చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు, నగరి నియోజకవర్గాల్లో జరుగుతున్న పనుల్లో వేగం పెరిగింది. వైకాపా ప్రభుత్వం చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు, నగరి నియోజకవర్గాలకు 36,672 గృహాలను మంజూరు చేయగా.. 23 వేల ఇళ్లను పూర్తిచేశారు.

ఇవి పూర్తయితేనే పీఎంఏవై 2.0

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం లబ్ధి కోసం జిల్లాలోని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. అయితే పీఎంఏవై 1.0 పథకంలో మంజూరైన ఇళ్లు పూర్తయితేనే కొత్త ఇళ్లు మంజూరు కానున్నాయి.

# బొప్పాయి.. లాభాలు లేవోయి



అనంతపురం : గత ఏడాది నుంచి లాభాలు చూసిన బొప్పాయి రైతులకు ఈసారి చేదు అనుభవం ఎదురైంది. మంచి దిగుబడి వచ్చినా.. మార్కెట్‌లో ధర భారీగా పడిపోయింది. గతంలో వచ్చిన లాభాలను చూసి ఈసారి ఎక్కువ మంది రైతులు బొప్పాయి సాగు చేశారు. అయితే వర్షాలు కురవడంతో దిల్లీ మార్కెట్‌కు ఎగుమతులు నిలిచిపోయాయి. దానికితోడు మహారాష్ట్రలో బొప్పాయి దిగుబడి అధికంగా రావడంతో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది ప్రారంభంలో టన్ను రూ.10-12 వేలు పలికిన ధర ప్రస్తుతం రూ.3-4 వేలకు పడిపోయింది. కనీసం మార్కెట్‌కు తరలించేందుకు రవాణా ఖర్చులు కూడా గిట్టుబాటు కావడం లేదు. చేసేదిలేక రైతులు కాయలు, పండ్లను చెట్లపైనే వదిలేస్తున్నారు.

**1,500 హెక్టార్లలో సాగు**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1,500 హెక్టార్లలో బొప్పాయి సాగు చేశారు. హెక్టారు విస్తీర్ణంలో 3,060 మొక్కలు నాటుతున్నారు. ఒక్కో మొక్కకు డిమాండ్‌ను బట్టి రూ.15-20 ఖర్చవుతోంది. పంటసాగు చేసిన తొమ్మిదో నెల నుంచి కోతలు మొదలై 10 నెలలపాటు దిగుబడి వస్తుంది. 14-16 కోతలు రాగా, హెక్టారుకు 55-70 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. మార్కెటింగ్ చేసుకోవడం రైతులకు తలకు మించిన భారమవుతోంది..

**నిలిచిన పెట్టుబడి రాయితీ**

బొప్పాయి రైతులను అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. గతంలో హెక్టారు విస్తీర్ణంలో పంట సాగుకు పెట్టుబడి రాయితీ తొలి ఏడాది రూ.16,500, రెండో ఏడాది రూ.6 వేలు చొప్పున మొత్తం రూ.23,500 అందించేవారు. ఈ ఏడాది నుంచి రాయితీని ఉద్యానశాఖ నుంచి తొలగించారు. కేవలం వడగండ్ల వానలు కురిసి పంట దెబ్బతింటేనే రూ.13,500 పరిహారం అందజేస్తున్నారు

**గిట్టుబాటు కాలేదు**

సంజీవరాయుడు, చోళసముద్రం (కూడేరు)

మూడెకరాల్లో బొప్పాయి సాగు చేశా. రూ.3.20 లక్షలు పెట్టుబడి పెట్టా. తెగుళ్ల నుంచి పంటను కాపాడుకున్నా. మార్కెటింగ్ సౌకర్యం లేదు. రెండు కోతల్లో రూ.లక్ష మాత్రమే వచ్చింది. టన్ను రూ.4-5 వేలకు చెప్పినా కొనేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. కాయలు మాగుతున్నాయి. చేసేదిలేక పండ్లను చెట్లపైనే వదిలేశా. కొన్నేళ్లుగా పెట్టుబడి రాయితీ నిలిపేశారు. రాయితీ అందించి ఆదుకోవాలి.

**తిరిగి అమ్ముకుంటున్నాం**

ఓబయ్య, కమ్మూరు(కూడేరు)ఎనిమిదెకరాల్లో బొప్పాయి పంట సాగు చేశా. దిగుబడి బాగుంది. సీజన్‌లో దిల్లీ, ఆగ్రా, కలకత్తా, ముంబయి, చెన్నైల్లో మార్కెట్ సదుపాయం ఉండేది. అక్కడ వర్షాలు ఎక్కువగా కురవడంతో వ్యాపారులు ముందుకు రావడం లేదు. కూలీలు, రవాణా ఖర్చులు కూడా రావడంలేదు. కాయలను అనంతపురంలో తిరిగి అమ్ముకుంటున్నాం. ప్రభుత్వం మార్కెట్ సౌకర్యంతో పాటు ధర కల్పిస్తే రైతులకు ఊరట కలుగుతోంది.

# నకిలీలలు ఎన్నో?



అనంతపురం : మెగా డీఎస్సీ-2025లో నకిలీ సర్టిఫికెట్ల కలకలం రేపుతోంది. గతనెల 28, 29, 30 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన పూర్తయింది. అందులో కొన్ని నకిలీ సర్టిఫికెట్లున్నట్లు ఆరోపణలు రావడంతో పునఃపరిశీలన చేస్తున్నారు. ఇందులో అనేక నకిలీ సర్టిఫికెట్లను అధికారులు గుర్తించారు. ఉమ్మడి అనంత జిల్లాలో 807 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నారు. 757 మంది ధ్రువపత్రాలు తొలివిడతలో పరిశీలించారు. రెండో విడతో 13మంది, మూడో విడతలో ముగ్గురు అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించారు. సర్టిఫికెట్లు పరిశీలించి వాటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మొదట ధ్రువపత్రాల పరిశీలన సక్రమంగా జరగలేదని విమర్శలు వస్తున్నాయి. దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, టెట్ తదితర సర్టిఫికెట్లలో తేడాలు వెలుగులోకొచ్చాయి. రాష్ట్ర విద్యాశాఖ అధికారుల దృష్టికి కూడా నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెళ్లింది. ఇతర జిల్లాల నుంచి అధికార బృందం త్వరలో జిల్లాకు రానున్నారు. ఇతర జిల్లా అధికారులు సర్టిఫికెట్ల పునః పరిశీలన చేయనున్నారు.

**పరిశీలనలో చేతివాటం!**

ధ్రువపత్రాల పరిశీలనకు 16 బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో నలుగురు అధికారులున్నారు. అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సర్టిఫికెట్లు సక్రమంగా లేకపోయినా ఓకే చేసినట్లు విమర్శలు వస్తున్నాయి.

**గుర్తించలేక పాట్లు..**

ఓ అభ్యర్థి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ సమర్పించారు. ఆ అభ్యర్థి కుటుంబానికి ఆన్‌లైన్‌లో 11 ఎకరాల భూములున్నాయి. కానీ పట్టా పాసు పుస్తకంలో 3 ఎకరాలు మాత్రమే ఉంది. రెవెన్యూ అధికారి 3 ఎకరాలున్నట్లు సర్టిపై చేశారు. అసలు సర్టిఫికెట్ ఏదో గుర్తించలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

దివ్యాంగుల సర్టిఫికెట్లు 24 మంది సమర్పించారు. మెడికల్ బోర్డు అధికారులు పునఃపరిశీలన చేశారు. దరఖాస్తులో 80 శాతం ఉండగా పునఃపరిశీలనలో 20 శాతం మాత్రమే వికలత్వం ఉన్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగుల సర్టిఫికెట్లలో ఎక్కువగా నకిలీలున్నాయి.

ఓ అభ్యర్థి డిగ్రీ మార్కులు 56 శాతం వచ్చాయి. కానీ ప్రొవిజన్ సర్టిఫికెట్‌లో తృతీయశ్రేణిలో ఉత్తీర్ణత ఉన్నట్లు పేర్కొన్నారు.

మరో అభ్యర్థి టెట్ పేపర్-2లో మంచి మార్కులు సాధించాడు. స్పెషల్ ఎడ్యుకేషన్ టెట్ పరీక్షలో వచ్చిన మార్కులు ఆంగ్లం స్కూల్ అసిస్టెంట్‌కు దరఖాస్తు చేశారు. ఒక అంశంలో టెట్ ఉత్తీర్ణుడై, డీఎస్సీలో మరో సబ్జెక్టుకు దరఖాస్తు చేశాడు.

డిగ్రీలో ఒక సబ్జెక్టు చదివి, డీఎస్సీలో మరో సబ్జెక్టుకు దరఖాస్తు చేశాడు. కులధ్రువ పత్రాల్లో కూడా తేడాలున్నాయి. మహిళా అభ్యర్థులు తమ తండ్రి పేరుతో కులధ్రువపత్రాలు కొందరు సమర్పించారు. మరికొందరు భర్త పేరుతో కులధ్రువపత్రాలు సమర్పించారు.

# పీఎంశ్రీ.. విద్యార్థుల భవితకు భాగ్యశ్రీ

గోరంట్ల : జాతీయ విద్యావిధానం అమల్లో భాగంగా విద్యాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి స్కూల్ ఆఫ్ రైజింగ్ ఇండియా (పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ) పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం విద్యార్థులు పలు రంగాల్లో నైపుణ్యాలు, సామర్థ్యాలు సాధించడానికి దోహదపడుతుంది. క్రీడలు, వైజ్ఞానిక పరిజ్ఞానం, నీటి సంరక్షణ, గ్రంథాలయాలు, ప్రత్యేక ప్రయోగశాలలు, ఆరోగ్యం, పరిశుభ్రత, నిత్య జీవితంతో ముడిపడి ఉన్న అంశాలపై అవగాహన, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్.. ఇలా ఎన్నో అంశాల్లో విద్యార్థులను తీర్చిదిద్దడానికి పాఠశాలల రూపురేఖలు మార్చేస్తున్నారు. ప్రస్తుతానికి రెండు విడతలుగా పాఠశాలలను ఎంపిక చేసి పనులు చేస్తున్నారు.

**అన్నిచోట్ల పనులు సాగుతున్నాయి**

దేవరాజు, పథకం జిల్లా అదనపు సమన్వయకర్త

పీఎంశ్రీ పథకం అమల్లో రాష్ట్రంలోనే శ్రీసత్యసాయి జిల్లా రెండో స్థానంలో ఉంది. రెండు విడతలుగా మంజూరైన అన్ని పాఠశాలల్లో ప్రత్యేక ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయి.

పథకం : పీఎంశ్రీ, జిల్లా: శ్రీసత్యసాయి

ఎంపికైన పాఠశాలలు: 37 (మొదటి విడత-25, రెండో విడత-12)




పథకం ప్రారంభించినది: 2022 సెప్టెంబరు, 2026-27 విద్యాసంవత్సరానికి పూర్తి చేయాలి.

ఒక్కో పాఠశాలకు విడుదలయ్యే నిధులు: రూ.2 కోట్లు అంచనా

ప్రస్తుత పరిస్థితి: అన్ని పాఠశాలల్లో పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.

# చెత్తలో చేతివాటం.. 'రాశా'కుటిల వ్యూహం..!

పాయకరావుపేట : చెత్త సేకరణలో అక్రమాలకు పాల్పడి జీవీఎంసీకి రూ.కోట్లు నష్టం వాటిల్లేలా చేసిన 'రాశా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్' కంపెనీపై కమిషనర్ కేతన్‌గార్గ్ చర్యలు తీసుకున్నారు. తక్షణమే ఒప్పందాలను రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. రెండేళ్ల నుంచి ఆ సంస్థ చేసిన పనులను పరిశీలించిన కమిషనర్... క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశించారు. 'రాశా' అక్రమాలపై గతంలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి.

ఏళ్లుగా 'సీసీఎస్ ప్రాజెక్టు' ఆ సంస్థకే: నగరంలో ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించడానికి జీవీఎంసీ క్లోజ్డ్ కాంపాక్షన్ సిస్టం (సీసీఎస్) అమలు చేస్తోంది. పాతనగరం, గాజువాక, చీమలాపల్లి, భీమిలి, ముడసర్లోవలో చెత్త తరలింపు కేంద్రాలు ఉన్నాయి. వాటి నిర్వహణ బాధ్యతలను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టడానికి రాశా సంస్థ వచ్చింది. తర్వాత కొందరు ఇంజినీరింగ్ అధికారులను ప్రసన్నం చేసుకుని మరో కంపెనీ టెండర్ ప్రక్రియలో పోటీకి రాకుండా చేసింది.

నాలుగేళ్ల క్రితం వరకు ఒక్కో స్టేషన్ నుంచి చెత్తను తరలించడానికి రూ.60 లక్షలతో టెండర్ పిలిస్తే, ఆ తర్వాత రూ.1.20 కోట్లు, రూ.1.80 కోట్లతో టెండర్లు నిర్వహించారు.

ప్రస్తుతం ఆ మొత్తం రూ.2.10 కోట్లకు చేరింది. నాలుగేళ్లలో వ్యయం నాలుగు రెట్లకు చేరడం గమనార్హం.



**నెల నుంచి కమిషనర్ నిఘా..:** వర్షాల నేపథ్యంలో నెల రోజులుగా ఆయా కేంద్రాలలో చెత్త నిల్వలపై కమిషనర్ పూర్తి నిఘా ఉంచారు. గాజువాక, పాతనగరం కేంద్రాల్లో చెత్త భారీగా పేరుకుపోవడాన్ని గమనించారు. 'రాశా' సంస్థ నిర్వహణ బాధ్యతలు, చెల్లింపులు, తదితర అంశాలపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

టెండరు నిబంధనలకు విరుద్ధంగా ఇతర వాహనాలతో చెత్తను తరలించి అదనంగా రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్టు కమిషనర్ గుర్తించారు. దీనిపై గుత్తేదారులు, ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. గాజువాక, పాతనగరం కేంద్రాల్లో స్టాటిక్ కాంపాక్టర్ పని చేయడం లేదని, మరమ్మతులకు రూ.1.50 కోట్లు అవసరమని తెలిపారు. దాని నిర్వహణ బాధ్యతలను రాశా సంస్థ చూడాలి. అందుకు విరుద్ధంగా ఏడాదిన్నర క్రితం ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఓ అధికారి యంత్రం నిర్వహణకు రూ.1.50 కోట్లు వెచ్చించారు. అయినా అది పనిచేయకపోవడం గమనార్హం.

**నోటీసులు ఇచ్చాం- పీవీవీ సత్యనారాయణరాజు, జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు** రాశా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ నిర్వహణ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించలేదని గుర్తించి గుత్త రద్దు నోటీసు జారీ చేశాం. గాజువాక చెత్త తరలింపు కేంద్రంలో వందల టన్ను వ్యర్థాలు పేరుకుపోయి ఉండడంతో కమిషనర్ ఆగ్రహించి ఈ చర్యలకు ఆదేశించారు.

# 150 పనులకు రూ.12 కోట్లు

పాయకరావుపేట : జిల్లాలోని పాఠశాలలకు మహర్దశ పట్టనుంది. మౌలిక వసతుల కల్పనకు రూ.కోట్లలో నిధులు మంజూరయ్యాయి. ఏపీ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో రూ.12 కోట్లతో 150 పనులు చేపట్టనున్నారు. ఈ నిధులతో కేజీబీవీ, గురుకుల జూనియర్ కళాశాలలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో వసతులు కల్పించనున్నారు. పాయకరావుపేట, ఎలమంచిలిలలో జడ్పీ బాలికోన్నత, నర్సీపట్నం, సబ్బవరం, మాడుగుల, మాకవరపాలెం, కశింకోట, వడ్డాది, రావికమతం, ఎస్.రాయవరం, దేవరాపల్లి, నాతవరం తదితర ప్రాంతాల్లోని కేజీబీవీల్లో బయాలజీ, భౌతిక, రసాయన శాస్త్ర ల్యాబ్‌లకు సుమారు రూ.ఆరు కోట్లు వెచ్చించనున్నారు. కశింకోట, మాకవరపాలెం, రావికమతం, దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, చోడవరం, రాంబిల్లి మండలాల్లోని ఏడు పాఠశాలల్లో రూ.26.6 లక్షలతో బాలికలకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పిస్తారు. వీటితోపాటు తాగునీటి వసతి, రిసోర్సు గదుల నిర్మాణాలు చేపట్టనున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రయోగశాలలు, మరుగుదొడ్లు నిర్మించను న్నారు. తరగతి గదులకు మరమ్మతు, తాగునీటి సదుపాయం కల్పించేందుకు నిధులు ఖర్చు చేయనున్నారు. ర్యాంపుల నిర్మాణం, విద్యుద్దీకరణ సహా 22 రకాల పనులు చేపట్టనున్నారు. చీడికాడ, నర్సీపట్నం, మునగపాక, కశింకోటలోని ఏపీ మోడల్ పాఠశాలల్లో రూ.60 లక్షలతో భవనాల మరమ్మతు చేపడతారు. ఏడు పాఠశాలలకు ప్రహరీల నిర్మాణానికి రూ.67.5 లక్షలు కేటాయించారు. అనకాపల్లి, ఎస్.రాయవరం, బుచ్చెయ్యపేట, నక్కపల్లి మండలాల్లోని నాలుగు పాఠశాలలకు రూ.6 లక్షలతో విద్యుద్దీకరణ పనులు చేపట్టనున్నారు.

# ఖరీదైన భవనం.. వదిలేదే లే..!

గాజువాక : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆవరణలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)కు కేటాయించిన భవనం ఎవరికి చెందాలనే విషయమై పీటముడి పడింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో 2014లో రాష్ట్రానికి ఐఐటీ, ఐఐఎం, ఐఐపీఈ వంటి ప్రఖ్యాత విద్యా సంస్థలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో ఐఐటీని తిరుపతిలో, ఐఐఎం, ఐఐపీఈని విశాఖలో ఏర్పాటు చేశారు. నాడు ఐఐపీఈని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయం పైభాగంలో, ఐఐఎంను ఆంధ్రబ్యాంకు నూతనంగా నిర్మించిన భవనంలో ప్రారంభించారు. **ఏయూ, ఆంధ్రబ్యాంకు అవగాహన ఒప్పందం:** ఆంధ్రబ్యాంకు అప్పటి చైర్మన్ రామకృష్ణన్ ఏయూలో పీహెచ్‌డీ చేశారు. ఏయూకు తన వంతు సహాయం చేయాలన్న ఉద్దేశంతో సుమారు రూ.4కోట్ల సీఎస్ఆర్ నిధులతో భవనాలు నిర్మించడానికి ముందుకు వచ్చారు. తొలుత రూ.2కోట్లతో ఏయూ డీసీఎంఎస్ ముందు భాగంలో భవనం నిర్మించారు. దాన్ని ఏయూ డీసీఎంఎస్ విభాగం వాడుకోవడానికి ఏయూ- ఆంధ్రబ్యాంకులు అప్పట్లో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఐఐఎంకు శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి గంభీరంలో స్థలం కేటాయించారు. అప్పటిలోగా ఆంధ్ర బ్యాంకు భవనాన్ని కార్యకలాపాలకు కేటాయించారు. నాడు సుమారు రూ.8కోట్లతో సౌకర్యాలు కల్పించారు. గడువు తీరిన తర్వాత ఏయూకి విడిచి వెళ్తామని చెప్పారు. 2022లో గంభీరంలో శాశ్వత భవనాల నిర్మాణం పూర్తి కావడంతో ఐఐఎం అక్కడికి తరలివెళ్లింది. అయినా భవనాన్ని 2025 సెప్టెంబరు 30వరకు తమ ఆధీనంలో ఉంచుకుంటామని ఐఐఎం అధికారులు కోరడంతో ఏయూ అధికారులు సమ్మతించారు. **మాకంటే మాకు కావాలి..:** ఈ నెలాఖరుకు ఐఐఎంకు ఇచ్చిన గడువు ముగియనుంది. సదస్సుల నిర్వహణకు మరి కొన్నాళ్లు భవనాన్ని తమ ఆధీనంలో ఉంచాలని ఐఐఎం అధికారులు మళ్లీ కోరుతుండగా ఏయూ డీసీఎంఎస్ అధికారులు తిరస్కరిస్తున్నారు. సొంత భవనాలు నిర్మించుకున్నాక కూడా అడగడం సబబు కాదని అంటున్నారు. విభాగానికి 21 తరగతి గదులు అవసరం కాగా, 12మాత్రమే ఉన్నాయని, వసతి కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. ఆ భవనం డీసీఎంఎస్‌కు ఆంధ్రబ్యాంకు ఇచ్చినందున తమకే చెందుతుందంటున్నారు.

చురకలు



## తెలుగమ్మాయి జిలి బిలి అందాలు

ఇటీవలి కాలంలో గ్లామర్ రంగంలో తెలుగమ్మాయిలకు చెప్పుకోదగ్గ అవకాశాలొస్తున్నాయనే చెప్పాలి. ప్రతిభతో పాటు దూసుకుపోయే తత్వం ఉంటే చాలు భాషతో సంబంధం లేకుండా ఛాన్సులిస్తున్నారు. నయనతార, దీపిక పదుకొనే, ఆలియా రేంజులో స్టార్లు కాలేకపోయినా కానీ, తమకంటూ ఒక స్థాయి ఉందని తెలుగమ్మాయిలు నిరూపిస్తున్నారు. శ్రీలీల, డింపుల్ హయాథీ, ప్రియాంక జవాల్కర్, రక్షిత ఇంకా చాలా మంది కథానాయికలుగా రాణిస్తున్నారు. తెలంగాణకు చెందిన అనన్య నాగళ్ల తనదైన అందం ప్రతిభతో ఇటీవల తెలుగు సినీపరిశ్రమలో తనని తాను నిరూపించుకునేందుకు ప్రయత్నిస్తోంది. స్టార్ రేంజ్ అవకాశాలు లేకపోయినా, తన రేంజుకు తగ్గ పాత్రల్లో అవకాశాల్ని అందుకుంటోంది. ముఖ్యంగా అనన్య చుట్టూ పాజిటివ్ వైబ్స్ తనకు పరిశ్రమలో గుర్తింపును తెచ్చాయి. గత ఏడాది పొట్టేల్, శ్రీకాకుళం షెర్లాక్ హెూమ్స్ లాంటి సినిమాలతో అభిమానుల ముందుకు వచ్చింది. ఈ ఏడాది తన తదుపరి సినిమా గురించి ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఇటీవల సీఎం రేవంత్ చేతులమీదుగా ప్రతిష్టాత్మక గద్దర్ తెలంగాణ స్పెషల్ జూరీ పురస్కారాల్ని కూడా అందుకుంది. ఇక



అనన్య నాగళ్ల తన సోషల్ మీడియా ఫ్యాన్స్ కు నిరంతరం టచ్ లో ఉంటోంది. ఎప్పటికప్పుడు లేటెస్ట్, అప్ డేట్స్ ని, లైఫ్ లో ముఖ్యమైన విషయాలను, కొన్ని అందమైన ఫోటోషూట్లను షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా అనన్య అందమైన శారీ లుక్ లో కనిపించిన ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. అనన్య పాక్షికంగా తన అందాల్ని ఆవిష్కరించే క్రీమ్ కలర్ శారీ, అందమైన డిజైనర్ బ్లౌజ్ లో ప్రత్యక్షమైంది. ఇక ఈ ఫోటోషూట్ లో అనన్యలోని ఇన్నర్ అందాలను ఆవిష్కరించిన తీరు అందరి దృష్టిని ఆకర్షించింది. మునుపటితో పోలిస్తే, ఇటీవల అనన్య ఘాటైన ఫోటోషూట్లతో పరిశ్రమను ఆకర్షిస్తోందని అభిమానులు కామెంట్ చేస్తున్నారు. ఈ తెలుగమ్మాయి ప్రయత్నానికి మెచ్చి దర్శకనిర్మాతలు అవకాశాలు కల్పించాలని కూడా ఎంకరేజ్ చేస్తున్నారు. పింక్ రీమేక్ వకీల్ సాబ్ లో అనన్య నాగళ్ల నటనకు మంచి పేరొచ్చింది. పవన్ కల్యాణ్ లాంటి స్టార్ సినిమాలో ఆరంభ రోజుల్లోనే ఈ భామ అవకాశం అందుకుని అందరినీ ఆకర్సించింది. ఆ తర్వాత వరుసగా సినిమాల్లో అవకాశాలొచ్చాయి. ప్రస్తుతం కొంత గ్యాప్ వచ్చినా కానీ, తిరిగి కరీర్ పరంగా పుంజుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు.

## ల్యాండ్ మార్క్ మూవీ కోసం చైతూ సూపర్ ప్లాన్

టాలీవుడ్ స్టార్ డైరెక్టర్లలో కొరటాల శివ కూడా ఒకరు. మహేష్ బాబు, ప్రభాస్, ఎన్టీఆర్ లాంటి స్టార్ హీరోలకు మంచి మంచి బ్లాక్ బస్టర్లను అందించిన శివ, చిరంజీవితో చేసిన ఆచార్య సినిమాతో భారీ డిజాస్టర్ ను అందుకున్నారు. ఆచార్య రిజల్ట్ తో కొరటాలపై చాలా నెగిటివిటీ వచ్చింది. ఆచార్య తర్వాత ఎన్టీఆర్ తో చేసిన దేవర సినిమా మంచి హిట్ అయినప్పటికీ ఆ సక్సెస్ మొత్తం ఎన్టీఆర్ ఖాతాలోనే పడింది. దీంతో కొరటాల తన స్టామినాను దేవర2 తో ప్రూవ్ చేసుకుంటారని అందరూ అనుకుంటున్న నేపథ్యంలో అసలు దేవర2 ఉంటుందా అనే డిస్కషన్స్ మొదలయ్యాయి. కానీ దేవర2 ఉ



ంటుందని మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేయగా, దేవర2 ఉంటుంది, ఉండి తీరుతుందని ఎన్టీఆర్ కూడా స్టేజ్ పై చెప్పడంతో దేవర2 అప్డేట్ కోసం ఎన్టీఆర్ ఫ్యాన్స్ తెగ వెయిట్ చేస్తున్నారు. దేవర2 అప్డేట్ కోసం వెయిట్ చేస్తున్న తారక్ ఫ్యాన్స్ కు కొరటాల ఇప్పుడు షాకిచ్చారు.

**ల్యాండ్‌మార్క్ ఫిల్మ్ కోసం..** కొరటాల తన తర్వాతి సినిమాను అక్కినేని నాగ చైతన్యతో చేయనున్నారని నెట్టింట వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తండేల్ సినిమాతో కెరీర్ బిగ్గెస్ట్ హిట్ ను అందుకున్న చైతన్య ప్రస్తుతం తన 24వ సినిమాను విరూపాక్ష ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా తర్వాత తన కెరీర్ మైల్ స్టోన్ ఫిల్మ్ అయిన %చీజ%25 కోసం చైతన్య పలు డైరెక్టర్లు చెప్పే కథలు వింటున్నారని వార్తలొచ్చాయి. అందులో భాగంగానే శివ నిర్వాణ, బోయపాటి శ్రీనుతో పాటూ మరికొందరి పేర్లు వినిపించగా ఇప్పుడు సడెన్ గా ఆ లిస్ట్ లో కొరటాల కూడా జాయిన్ అయ్యారు.

ప్రస్తుతం టాలీవుడ్ లో వినిపిస్తున్న వార్తల ప్రకారం, రీసెంట్ గా కొరటాల శివ నాగ చైతన్యకు ఓ స్క్రిప్ట్ ను నెరేట్ చేశారని, దానికి చైతన్య నుంచి కూడా పాజిటివ్ రెస్పాన్స్ వచ్చిందని తెలుస్తోంది. కొరటాల చెప్పిన మాస్ డ్రామా చేయడానికి చైతన్య ఇంట్రెస్టింగ్ గా ఉన్నారని అంటున్నారు. ఇదే నిజమైతే చైతూ ల్యాండ్ మార్క్ మూవీకి మంచి కాంబినేషన్ రెడీ అయినట్టే అవుతుంది. మరి ఈ వార్తల్లో నిజమెంతన్నది తెలియాల్సి ఉంది.




## నట సింహం నటరాజ తాండవం..!




బాలకృష్ణ బోయపాటి శ్రీను కాంబినేషన్ లో వస్తున్న క్రేజీ మూవీ అఖండ 2 తాండవం. 14 రీల్స్ బ్యానర్ లో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ సినిమాలో సంయుక్త మీనన్ హీరోయిన్ గా నటిస్తుంది. రెండేళ్ల క్రితం రిలీజైన అఖండ సినిమా ఫ్యాన్ ఫీస్ట్ ఇవ్వగా ఈసారి అఖండ 2 తాండవం పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ కు రెడీ అవుతుంది. అసలైతే సెప్టెంబర్ 25న రిలీజ్ చేయాలనుకున్న ఈ సినిమా ఫైనల్ గా డిసెంబర్ 5న రిలీజ్ ఫిక్స్ చేశారు. ఈ సినిమా విషయంలో నందమూరి ఫ్యాన్స్ మాత్రమే కాదు ఆడియన్స్ కూడా చాలా ఎగ్జైటింగ్ గా ఉన్నారు.

**సింహా నుంచి ఈ కాంబో..** అఖండ 2 సినిమా నుంచి అప్పట్లో ఒక గ్లింప్స్ టీజర్ రాగా లేటెస్ట్ గా దసరా సందర్భంగా ఒక పోస్టర్ వదిలారు. నటరాజ రూపంలో బాలయ్య తాండవం అదరగొట్టేసిందని చెప్పొచ్చు. బాలయ్య బోయపాటి ఈ కాంబో సినిమా అంటే చాలు ఫ్యాన్స్ కి పండగ అన్నట్టే. సింహా నుంచి ఈ కాంబోలో వచ్చిన ప్రతి సినిమా సూపర్ సక్సెస్ అయ్యింది. ఐతే ఈసారి అఖండ 2 తాండవం తో భారీ ప్లానింగ్ తో వస్తున్నారు బోయపాటి. దసరా సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ లో అఘోరా నటరాజ భంగిమ అదరగొట్టేసింది. ఈ సినిమాతో బాలయ్య బాబు మరోసారి తన ఉగ్ర రూపాన్ని చూపించబోతున్నారు. అఖండ కేవలం తెలుగు ఆడియన్స్ ని మెప్పిస్తే ఈసారి అఖండ 2 తాండవం నేషనల్ లెవెల్ ఆడియన్స్ ని ఒక ఊపు ఊపేయాలని వస్తుంది.

**అఖండ టైం లోనే స్పీకర్స్ బ్లాస్ట్..** అఖండ 2 సినిమాలో వి.ఎఫ్.ఎక్స్ వర్క్ కూడా బాగానే ఉండేలా ఉంది. సినిమాను బోయపాటి శ్రీను చాలా ప్రెస్టీజియస్ గా చేస్తున్నారు. అఖండ 2 సినిమాకు థమన్ మరో హైలెట్ అవ్వబోతున్నాడు. అఖండ టైం లోనే స్పీకర్స్ బ్లాస్ట్ అవ్వగా అఖండ 2 కోసం మరింత కష్టపడుతున్నాడు. డిసెంబర్ 5న నందమూరి ఫ్యాన్స్ తో పాటు సినీ లవర్స్ అందరికీ అఖండ 2 తాండవం ఒక మాస్ ఫీస్ట్ ఇస్తుందని అంటున్నారు. అఖండ 2 పోస్టర్ చాలా పవర్ ఫుల్ గా ఉంది. ముఖ్యంగా అఘోరాగా బాలకృష్ణ పూనకాలు తెప్పించేందుకు రెడీ అవుతున్నారు. డిసెంబర్ 5న ఈ సినిమా రిలీజ్ అవుతుంది కాబట్టి ఇయర్ ఎండింగ్ ఫ్యాన్స్ అండ్ ఆడియన్స్ కి అఖండ 2 తో బాలయ్య అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చే ప్లానింగ్ తో వస్తున్నారు.

## శ్రీలీల వర్సెస్ ఆలియా భట్.. బాలీవుడ్ లో పీఆర్ స్టంట్స్






డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల టాలీవుడ్, శాండల్ వుడ్ లో స్టార్ హీరోల సరసన నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయితే కెరీర్ ప్రారంభంలో మంచి హిట్లు అందుకున్న ఈ అమ్మడు కొద్ది రోజులుగా హిట్ కోసం ఎదురుచూస్తుంది. ఈ క్రమంలోనే బాలీవుడ్ లోనూ అదృష్టం పరీక్షించుకునేందుకు వెళ్లింది. హిందీలో శ్రీలీల ఆషికి 3సో అక్కడి డెబ్యూ చేయనుంది. ఈ సినిమా రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతుంది. ఇందులో కార్తీక్ ఆర్యన్ హీరోగా నటిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా క్రిస్మస్ ట్రీట్ గా 2025 డిసెంబర్ 25న థియేటర్లలోకి రానుంది. అయితే శ్రీలీలకు బీ టౌన్ లో తొలి సినిమాకే బాక్సాఫీస్ వద్ద పోటీ ఎదురుకానుంది. బ్యూటీ ఆలియా భట్ కీలక పాత్రలో నటిస్తున్న ఆల్ఫా సినిమా కూడా అదే రోజు థియేటర్లలోకి రానుంది. ఈ సినిమా థ్రిల్లర్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతుంది. అయితే రెండు సినిమాలు ఒకే రోజు బాక్సాఫీస్ ముందుకు రానుండడంతో ఆయా మూవీటీమ్స్ వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లనున్నాయి. అసలే బాలీవుడ్ అంటేనే పీ ఆర్ మేనేజ్ మెంట్లతో నడుస్తుంది. సినిమా రిలీజ్ కు ముందు పీఆర్ స్టంట్స్ వేరే లెవెల్ లో ఉంటాయి. ఈ వ్యూహాలతోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్తాడు. ఈ క్రమంలోనే బాలీవుడ్ పీఆర్ సంస్థలు ఇప్పుడు శ్రీలీల– ఆలియాకు ఫేస్ టు ఫేస్ ఫైట్ గా చూపిస్తున్నాయి. ఆలియా కంటే ఎక్కువగా వైరల్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగానే ఈ ఏడాది ప్రారంభంలో హీరో కార్తీక్ ఆర్యన్తో శ్రీలీల డేటింగ్ చేస్తున్నట్లు పీఆర్ ఏజెన్సీలు స్టంట్ చేశాయి. ఈవెంట్లలో, రెస్టారెంట్లలో వీళ్లిద్దరు కనిపించిన వీడియోలు, ఫొటోలు తెగ వైరల్ చేసేశారు. అంతేకాకుండా.. ఈ ఇద్దరి మధ్య ఏదో నడుస్తుందని కథనాలు కూడా సృష్టించారు. ఇప్పటికీ అలాంటి స్టోరీలు పుట్టుకొస్తున్నాయి. కానీ, దీనిపై అటు కార్తిక్ కానీ, ఇటు శ్రీలీల కానీ అధికారికంగా స్పందించలేదు. అయితే, వారి గురించి నిరంతరాయంగా కథలు రాస్తున్నప్పటికీ, ఇద్దరు స్టార్లలో ఎవరూ ప్రేమ ఊహాగానాల గురించి నోరు విప్పలేదు. కాగా, ఆలియా భట్ కీలక పాత్రలో శివ్ రవైల్ ఆల్ఫా సినిమాను స్పై యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కిస్తున్నారు. ఇందులో ఆలియాతో పాటు శర్వరి కూడా నటిస్తుంది. ఇది యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ లో భాగంగా రానుంది. అయితే యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ లో ఆల్ఫా సినిమా మహిళా ప్రధాన పాత్ర ఉన్న తొలి చిత్రం కానుంది.

## జాన్వీ కపూర్.. ఓ పువ్వులాంటి అందం!

బాలీవుడ్ యంగ్ హీరోయిన్ జాన్వీ కపూర్ ఎప్పుడూ తన స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. తాజాగా ఆమె షేర్ చేసిన కొత్త ఫోటోషూట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పింక్ రెడ్ షేడ్స్ కలిగిన ఫ్లోరల్ డ్రెస్‌లో జన్వి సంప్రదాయాన్నీ, మోడ్రన్ టచ్‌ని కలిపి ఒక కొత్త గ్లామర్ వేవ్‌ని చూపించింది. చేతిలో ఒక తెల్లని పువ్వుని పట్టుకుని చిరునవ్వులు చిందించడం, జతగా వెండి గాజులు, జుమ్కాలు జోడించడం వల్ల ఈ లుక్‌కి సింపుల్‌గా ఒక ప్రత్యేకమైన అందం వచ్చింది. ఈ ఫోటోలు పోస్ట్ చేసిన వెంటనే అభిమానుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. “గార్డెన్‌లో పూల కంటే నువ్వే అందంగా ఉన్నావు,” “కలర్స్ కంటే నీ చిరునవ్వు బ్రైట్‌గా ఉంది,” అంటూ కామెంట్లు కురిపించారు. కేవలం కొన్ని గంటల్లోనే లక్షల లైక్స్ సాధించడంతో జాన్వి క్రేజ్ ఎలా ఉందో మరోసారి



రుజువైంది. ఈ ఫోటోషూట్ ఆమె ఫ్యాషన్ గేమ్‌లోని ప్రయోగాత్మక ట్రెండ్ ను మళ్లీ హైలైట్ చేస్తోంది. కెరీర్ విషయానికి వస్తే, జాన్వీ 2018లో ‘ధడక్’ సినిమా ద్వారా బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత ‘గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గర్ల్’ వంటి చిత్రాలతో తన నటనను నిరూపించుకుంది. ఇటీవల దక్షిణాదికి కూడా అడుగుపెట్టి దేవరలో ఎన్టీఆర్ కు జోడిగా నటించింది. ఇక రామ్ చరణ్ సరసన తన రెండో తెలుగు సినిమా ‘పెద్ది’ చేస్తోంది. అలాగే సిద్ధార్థ్ మల్హోత్రా జోడీగా ‘పరం సుందరి’లో నటిస్తోంది. ఈ ప్రాజెక్టులు ఆమెకు పాన్ ఇండియా స్థాయిలో మంచి అవకాశాలను తెస్తున్నాయి. సినిమాలతో పాటు జాన్వీ ఫ్యాషన్‌లోనూ తనకంటూ ఓ ప్రత్యేకమైన స్థానం సంపాదించుకుంది. ఎప్పుడూ కొత్త స్టైల్‌ను ప్రయత్నించడానికి వెనుకాడని ఆమె, సాంప్రదాయ దుస్తుల్లోనూ, మోడ్రన్ అవుట్‌ఫిట్స్‌లోనూ సమానంగా మెరిసిపోతుంది. ఈ ఫ్లోరల్ డ్రెస్సింగ్ లుక్ ద్వారా ఆమె మరోసారి ఫ్యాన్స్ హృదయాలను గెలుచుకుంది. ఇక జాన్వీ కెరీర్ ఇప్పుడు ఒక క్రిటికల్ ఫేజ్‌లో ఉంది. మంచి కథలతో పాటు తన గ్లామరస్ ఇమేజ్‌ను కూడా బ్యాలెన్స్ చేస్తూ, స్టార్ హీరోయిన్ల లీగ్‌లోకి వెళ్లాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## జాన్వి ఆశలన్నీ దాని మీదే..!

శ్రీదేవి తనయురాలు జాన్వి కపూర్ ఇప్పటికే బాలీవుడ్ లో తన హవా కొనసాగిస్తుంది. ఐతే తన తల్లి లానే సౌత్ లో కూడా తన సత్తా చాటాలని చూస్తుంది అమ్మడు. ఈ క్రమంలోనే ఎన్టీఆర్ దేవరతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది జాన్వి. కొరటాల శివ డైరెక్షన్ లో తెరకెక్కిన ఆ సినిమాలో జాన్వి కపూర్ తంగం పాత్రలో నటించింది. సినిమాలో ఆమెకు ఉన్నవి చాలా తక్కువ సీన్స్. అందులోనే ఆమె గ్లామర్ షో తో మెప్పించింది. దేవర 1 కాదు దేవర 2 లో ఆమెకు మంచి స్కోప్ ఉందని టాక్.

**దేవర 2 క్యాన్సిల్..** ఐతే ఇప్పుడు పరిస్తితి చూస్తుంటే దేవర 2 దాదాపు క్యాన్సిల్ చేశారనే అంటున్నారు. దేవర 1 రిజల్ట్ కూడా ఆశించిన స్థాయిలో లేదు కాబట్టి దేవర 2 దాదాపు అటకెక్కించారని తెలుస్తుంది. ఐతే దేవర 2 మీద చాలా హెూప్స్ పెట్టుకుంది జాన్వి. ఇప్పుడు అది



క్యాన్సిల్ అయ్యింది. ఇక ప్రస్తుతం అమ్మడు చరణ్ తో పెద్ది సినిమా చేస్తుంది. ప్రస్తుతం ఆమెకున్న ఆప్షన్ అదొక్కటే. బుచ్చి బాబు సన డైరెక్షన్ లో తెరకెక్కుతున్న పెద్ది సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. దేవర తో టాలీవుడ్ లో స్టార్ రేంజ్ కి వెళ్లాలని అనుకున్న జాన్వి ఆశలు నెరవేరలేదు. అందుకే నెక్ట్స్ చేస్తున్న పెద్ది సినిమా మీద అమ్మడు అంచనాలు పెట్టుకుంది. ఎలాగు బుచ్చి బాబు ఉప్పెనలో హీరోయిన్ రోల్ ని బాగా రాసుకున్నాడు. పెద్ది కమర్షియల్ సినిమా అయినా కూడా జాన్వికి తగిన ప్రాధాన్యత ఉంటుందట.

**జాన్వి కపూర్ పెద్ది లక్కీ మూవీ..** సో జాన్వి కపూర్ పెద్దినే తన లక్కీ మూవీగా భావిస్తుంది. తెలుగులో పెద్ది తర్వాత ఇంకా చాలా ప్లాన్స్ తోనే ఉందట అమ్మడు. అటు తమిళ్ లో కూడా సినిమాలు చేయాలని ఇంట్రెస్ట్ చూపిస్తుంది. ఐతే తమిళ్ మేకర్స్ మాత్రం జాన్విని తీసుకోవట్లేదు. జాన్వి కపూర్ అటు బాలీవుడ్ లో కూడా మంచి రోల్స్ చేయాలని చూస్తుంది. బీ టౌన్ ఆడియన్స్ ని తన గ్లామర్ తో ఆల్రెడీ బుట్టలో వేసుకున్న జాన్వి కపూర్ ఇక మీదట పర్ఫార్మెన్స్ స్కోప్ ఉన్న రోల్స్ కూడా చేసి మెప్పించాలని చూస్తుంది. సౌత్ లో పెద్ది తర్వాత మళ్లీ వరుస ఛాన్స్ లు ఆశిస్తున్న అమ్మడు అటు నార్త్, సౌత్ అనే తేడా లేకుండా అందరినీ ఆకట్టుకోవాలని చూస్తుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536